

ఆర్టీసీలో ఎన్నికలు ఎప్పుడు?

- ట్రేడ్ యూనియన్ ఎన్నికలపై సర్కారు నిర్లక్ష్యం
- ప్రభుత్వ తీరుపై ఆర్టీసీ కార్మిక సంఘాల మండిపాటు
- మోటర్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యాక్ట్‌ను పట్టించుకోని సంస్థ

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్ ఎన్నికల నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. ఆర్టీసీ యూనియన్ పునరుద్ధరణకు అనుమతిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఏప్రిల్‌లో కోర్టుకు సైతం 3 నెలల్లో ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పింది. ఆ తర్వాత కనీస చర్యలు తీసుకోకపోవడంపై కార్మికులు మండిపడుతున్నారు. గుర్తింపు సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఆరు కార్మిక సంఘాలు ఇటీవల రవాణాశాఖ కమిషనర్‌ను కలిసి కోరాయి. చివరిసారిగా 2016లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. అప్పుడు తెలంగాణ మజ్దూర్ యూనియన్ గెలిచింది. ఆ తర్వాత ఎన్నికలు జరగలేదు. మోటర్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యాక్ట్ ప్రకారం తప్పనిసరిగా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి. కానీ ఈ సర్కారు దానిని పట్టించుకోవడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ప్రతి డిపోలో ఓ వెల్ఫేర్ కమిటీ ఏర్పాటుచేస్తూ ఆర్టీసీ యాజమాన్యం కాలయాపన చేస్తున్నది. ట్రేడ్ యూనియన్ల స్థానంలో వెల్ఫేర్ కమిటీలు చట్ట విరుద్ధమని సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

ఎన్నికలను అడ్డుకుంటున్నది ఎవరు?

ఎన్నికలు జరగకుండా యాజమాన్యంలో కీలకమైన స్థానంలో ఉన్న వ్యక్తి అడ్డుపడుతున్నారని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ట్రేడ్ యూనియన్ ఉన్నప్పుడు ఆర్టీసీ రూ.2,500 కోట్ల అప్పుల్లో ఉంటే, ట్రేడ్ యూనియన్ లేకుండా ఎండీ పాలనలో రూ.10 వేల కోట్ల అప్పులకు సంస్థ చేరుకున్నదని తెలిపారు.

స్థానిక ఎన్నికలపై కమిషన్ ఎఫెక్ట్

- ఈ నెలలో ముగియనున్న బీసీ కమిషన్ గడువు
- కొత్త కమిషన్ వస్తే ఇప్పట్లో ఎన్నికలు కష్టమే
- గడువు పొడిగిస్తేనే రిజర్వేషన్లపై త్వరగా నివేదిక



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు విషయంలో కొత్త చిక్కుముడి వచ్చిపడింది. సుప్రీంకోర్టు సూచనల మేరకు ట్రిపుల్ టెస్ట్ నిర్వహించి నివేదిక ఇవ్వనున్న ప్రస్తుత బీసీ కమిషన్ గడువు ఈ నెలాఖరుతో ముగియనున్నది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించడానికి కొత్త కమిషన్ వేయడం కంటే ప్రస్తుతం ఉన్న బీసీ కమిషన్ గడువును మరికొంత కాలం పొడిగిస్తేనే సాధ్యమవుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొత్త బీసీ కమిషన్ నియామకం జరిగి, వారు బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం చేయడం, సుప్రీంకోర్టు ట్రిపుల్ టెస్ట్ తీర్పుపై అవగాహన ఏర్పర్చుకోవడం, నివేదిక తయారీ, సంప్రదింపులు తదితర అంశాల ప్రక్రియ పూర్తి కావడానికి నెలల సమయం పడుతుంది. స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాల్సి ఉన్నందున ప్రస్తుతం ఉన్న కమిషన్ గడువును పొడిగించడమే ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుత కమిషన్ ద్వారా ట్రిపుల్ టెస్ట్ నివేదిక తెప్పించుకొని వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. త్వరగా ఎన్నికలు నిర్వహించి పాలనను గాడిలో పెట్టాలని మాజీ ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. వెంటనే ఎన్నికలు నిర్వహించి, కేంద్రం నుంచి నిధులను సాధించుకొని స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని సూచిస్తున్నారు.

ఇప్పటికే అధ్యయనం చేసిన కమిషన్

ప్రస్తుత బీసీ కమిషన్ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై ఇతర రాష్ట్రాల్లో పర్యటించిన ఆయా చోట్ల చేపట్టిన విధానాలు, ఎదురైన అనుభవాలు, ఇబ్బందులను తెలుసుకొన్నది. ఆయా రాష్ట్రాల బీసీ కమిషన్లు, ముఖ్యమంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతోనూ భేటీ అయి, వివిధ అంశాలను అధ్యయనం చేసింది. రాష్ట్రంలోనూ వివిధ బీసీ కుల సంఘాల నేతలతోనూ సమావేశమైంది. బీసీ సామాజిక వర్గాలకు చెందిన మేధావులు, ఉన్నత విద్యావంతులు, వివిధ శాఖల అధికారులతో అనేక సమావేశాలు నిర్వహించింది. రాష్ట్రంలో ట్రిపుల్ టెస్ట్ నిర్వహించడానికి సన్నాహాలనూ పూర్తి చేసింది. సమగ్ర అవగాహనతో ప్రస్తుత కమిషన్ సిద్ధంగా ఉన్నది. ఈ కమిషన్ ట్రిపుల్ టెస్ట్ నివేదిక ఇవ్వడానికే కనీసం రెండు నెలల సమయం పడుతుందని, ఆ తర్వాత దానిని ప్రభుత్వం ఆమోదించడం, సుప్రీంకోర్టుకు నివేదించడం, తదితర ప్రక్రియ పూర్తి కావడానికి మరికొంత సమయం పడుతుంది. అయితే ఈ నెలాఖరుతో ప్రస్తుత కమిషన్ గడువు ముగియనున్నది. ప్రభుత్వం కొత్త బీసీ కమిషన్‌ను నియమిస్తే కొన్ని నెలల సమయం పడుతుందని, దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో అసాధ్యమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కేంద్ర ఆర్థిక సంఘం నిధుల నిలిపివేత

జడ్పీ, మండల పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ఇప్పటికే ముగిసింది. ఫిబ్రవరిలోనే పంచాయతీల పాలకవర్గం సమయం ముగిసింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ఆర్థిక సంఘం రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు ఇచ్చే నిధులను ఇప్పటికే నిలిపివేసింది. కొత్త కమిషన్ వేస్తే ఇంకా ఆలస్యమై ఇప్పట్లో నిధులు రావడం కష్టమేనని నిపుణులు చెప్తున్నారు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చిత్తశుద్ధి ఉంటే ప్రస్తుతమున్న కమిషన్ గడువును మరికొంత కాలం పొడిగించి వెంటనే నివేదిక తెప్పించుకొని ఎన్నికలు నిర్వహించాలని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.

విద్యుత్తు సంస్థల్లో పదోన్నతుల పంచాయితీ!

- పదోన్నతుల్లేని బదిలీలపై సంఘాల అభ్యంతరం
- ఏకపక్ష బదిలీలను వ్యతిరేకిస్తూ ఆందోళనల బాట



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విద్యుత్తు సంస్థల్లో పదోన్నతుల పంచాయితీ తారాస్థాయికి చేరింది. విద్యుత్తు సంస్థలు, సర్కారు తీరును నిరసిస్తూ వివిధ సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. పదోన్నతులు ఇవ్వకుండా బదిలీలు చేపడితే ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమని ఆయా ఉద్యోగ సంఘాలు అల్టిమేటం జారీచేశాయి. ఇటీవలే విద్యుత్తు సంస్థల్లో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. తొలుత పదోన్నతులు కల్పించి, ఆ తర్వాతే బదిలీలు చేపట్టాలని ఉద్యోగ సంఘాల నేతలు యాజమాన్యాలను కలిసి వినతిపత్రాలు సమర్పించాయి. కానీ, ఇటీవల విద్యుత్తు సంస్థల అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జరిపిన సమీక్షలో కేవలం బదిలీలపైనే చర్చించారు. విద్యుత్తు సంస్థల యాజమాన్యాలు ప్రస్తుతానికి పదోన్నతులను పక్కనబెట్టి బదిలీలు చేపట్టేందుకు సమాయత్తం అవుతున్నాయి. మొత్తం ఉద్యోగుల్లో 40 శాతం మందిని బదిలీ చేసేలా మార్గదర్శకాలను రూపొందించారు. ఈ లెక్కన ట్రాన్స్‌కోలో ఎలక్ట్రికల్‌లో 508, సివిల్‌లో 51, టెలికాంలో 45 మంది చొప్పున బదిలీ అవుతారని ఓ నివేదికను సైతం సిద్ధంచేశారు. మార్గదర్శకాలు విడుదలవుతాయని అంతా భావించగా, సంఘాల నేతల అభ్యంతరాలు, హెచ్చరికలతో మార్గదర్శకాల విడుదల నిలిచిపోయింది.

25 వేల మందికి న్యాయం

పదోన్నతులతో 25 వేల మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని సంఘాల నేతలు పేర్కొంటున్నారు. జేఎల్‌ఎం క్యాడర్‌లో 5 వేల మంది, ఆఫీసర్, ఇంజినీర్ క్యాడర్లల్లో 2 వేల మంది, 15 వేల మంది ఆర్టిజన్స్‌కు గ్రేడ్ మారి పదోన్నతులు దక్కుతాయి. పదోన్నతులు ఇచ్చేవరకు బదిలీల మార్గదర్శకాలను విడుదల చేయొద్దని అసోసియేషన్లు, సంఘాలు హెచ్చరించడంతో విద్యుత్తు సంస్థలు డోలాయమానంలో పడ్డాయి. పదోన్నతులు చేపట్టాలా? లేక బదిలీలు చేయాలా? అన్న విషయంపై తేల్చుకోలేక యాజమాన్యాలు సతమతం అవుతున్నాయి. మరోవైపు 1104, 327 వంటి ఉద్యోగ, కార్మిక సంఘాలు ఆందోళనలకు సిద్ధమవుతున్నాయి.

క్రమబద్ధీకరణ కలేనా..?

- **దశాబ్దాలుగా కాంట్రాక్ట్ వ్యవస్థలోనే ఆచార్యులు**
- 60 ఏండ్లు పూర్తవుతుండడంతో ఉద్యోగ విరమణలు..
- రెగ్యులర్ చేయాలంటున్న ఒప్పంద అసిస్టెంట్ ప్రొఫెసర్లు

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): ఆచార్యులు లేక కునారిల్లిన వర్సిటీలు.. ఇప్పుడు మరింత సంక్షోభం దిశగా అడుగులేస్తున్నాయి. ఇంత కాలం రెగ్యులర్ ఆచార్యులు ఉద్యోగ విరమణలు పొందగా, తాజాగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు సైతం విరమణలు పొందుతున్నారు. ఇదీ రాష్ట్రంలోని వర్సిటీల పరిస్థితి. 60 ఏండ్ల వయోపరిమితి పూర్తవడంతో పలువురు కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ పొందారు. మరికొంత మంది రెడీగా ఉన్నారు. ఇటీవల ఏకంగా 15 మంది వైదొలిగారు. అటు రెగ్యులర్ ఫ్యాకల్టీ లేక, ఇటు కాంట్రాక్ట్ ఆచార్యులు సైతం ఉద్యోగ విరమణ పొందుతుండటంతో వర్సిటీల్లో బోధన గాడి తప్పుతున్నది.

ఖాళీగా పోస్టులు..

రాష్ట్రంలో 2,888 టీచింగ్ ఫ్యాకల్టీ పోస్టులుంటే, 800 వరకు మాత్రమే రెగ్యులర్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. మరో 2,044 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో 900 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. వీరు కూడా ఉద్యోగ విరమణ పొందుతుండటం విశేషం. ఉద్యోగ, వేతన భద్రత లేకపోవడంతో ఆయా కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాయి. వీరిని రెగ్యులరైజ్ చేయాలని చేయాలని ప్రతిపక్షంలో ఉండగా కాంగ్రెస్ నేతలు గొంతు చించుకున్నారు. అధికారంలోకి వచ్చాక ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గతంలో అసెంబ్లీలో ప్రసంగిస్తూ.. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు ఆ విషయాన్నే పట్టించుకోవడం లేదు. ఇటీవల తమను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ ఆచార్యులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాటపట్టారు. అయినా కాంగ్రెస్ సర్కారు పట్టించుకోలేదు. తామేమీ అనర్హులం కాదని, పీహెచ్‌డీలు, నెట్, సెట్ కలిగి ఉన్నామని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు.



ఈ ఫొటోలో ఉన్న డాక్టర్ ఏ అనితాకుమారి నిజాం కళాశాల జువాలజీ డిపార్ట్‌మెంట్‌లో 24 ఏండ్లపాటు పనిచేసి 2023 సెప్టెంబర్‌లో 60 ఏండ్లు పూర్తవడంతో రిటైర్మెంట్ అయ్యారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు అందిన వేతనం తప్ప, ఉద్యోగ విరమణ సమయంలో ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు చేకూరకుండానే రిటైర్మెంట్ అయ్యారు.



డాక్టర్ డీ ధర్మతేజ ఓయూ బీఈడీ కాలేజీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. 25 ఏండ్లుగా కాంట్రాక్ట్ ఆచార్యుడిగా పనిచేస్తున్న ఇతను 60 ఏండ్లు నిండటంతో ఈ ఏడాది డిసెంబర్‌లో ఉద్యోగం నుంచి వైదొలగనున్నారు.

దివ్యాంగులకు స్వతంత్రశాఖపై కదలికేదీ?

- ఏడాదిన్నర క్రితమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు
- మహిళా,శిశు సంక్షేమశాఖ నుంచి వేరు చేస్తూ నిర్ణయం
- కేంద్రం, పలు రాష్ట్రాల్లో స్వతంత్రశాఖలు
- రాష్ట్రంలో ఇప్పటికీ ఆచరణలోకి రాని వైనం



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమశాఖను స్వతంత్రశాఖగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటికీ ఆచరణలో కలగానే మిగిలింది. సిబ్బంది కొరతను సాకుగా చూపుతూ ఇప్పటికీ మహిళా సంక్షేమశాఖలోనే వికలాంగులశాఖను కొనసాగిస్తుండటంపై దివ్యాంగుల నుంచి అసహనం వ్యక్తమవుతున్నది. సాంఘిక సంక్షేమశాఖలో భాగంగా ఉన్న వికలాంగుల సంక్షేమశాఖను 1983లో ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేశారు. కొందరు ఉన్నతాధికారుల అత్యుత్సాహం వల్ల ఈ శాఖను మహిళా శిశు సంక్షేమశాఖలో విలీనం చేశారు. మహిళాశిశు సంక్షేమశాఖ అధికారులు తమ శాఖ పథకాల అమలుపైనే శ్రద్ధ చూపుతున్నారు తప్ప, దివ్యాంగులను పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో దివ్యాంగుల శాఖను స్వతంత్రశాఖగా ఏర్పాటు చేయాలని నాటి సీఎం కేసీఆర్ నిర్ణయించారు. 2022 డిసెంబర్2న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వికలాంగుల శాఖ పేరు ను దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జండర్ల సాధికారత సంస్థగా నామకరణం చేసింది. అయినా ఇప్పటికీ ఆ ఉత్తర్వులు అమలు కాలేదు.

ప్రత్యేకశాఖలేక ఇబ్బందులు

10.46 లక్షల మంది దివ్యాంగులకు ప్రత్యేకశాఖ లేకపోవడంతో పలు పథకాలు, కార్యక్రమాల అమలుపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయం, సాధికారతశాఖ కిందనే ప్రత్యేక శాఖగా వికలాంగుల వ్యవహారాల శాఖను ఏర్పాటు చేసింది. మహారాష్ట్రతోపాటు పలు రాష్ట్రాలు కూడా ప్రత్యేక శాఖలను ఏర్పాటు చేశాయి. అదే బాటలో తెలంగాణ కూడా ప్రత్యేకశాఖగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ ఇచ్చింది. కానీ ఆచరణలో పరిస్థితి మారలేదు.

అధికారుల కొరత సాకు..

దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జండర్ల సంక్షేమశాఖకు సమర్థవంతమైన సేవలందించడానికి జిల్లా స్థాయిలోనూ ప్రత్యేకంగా జిల్లా అధికారిని నియమించాల్సి ఉంది. క్యాడర్ స్ట్రెంత్‌ను పునఃపంపిణీ చేయడానికి ఉత్తర్వులను జారీ చేయాల్సి ఉన్నా ఇప్పటికీ చేయలేదు. వాస్తవంగా జిల్లాకు ఒక అడిషనల్ డైరెక్టర్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ మొత్తంగా ఐదుగురు సిబ్బంది, 33జిల్లాలకు కలిపి 165మంది కావాల్సి ఉంది. ఈ మేరకు పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది. కానీ సిబ్బంది లేరనే సాకుతో దివ్యాంగులశాఖను యథావిధిగా మహిళాశిశు సంక్షేమశాఖ పరిధిలోనే కొనసాగిస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): తిరుమలలో శ్రీవారి దర్శనం టికెట్ లేని భక్తులకు 12 గంటల్లో, ప్రత్యేక దర్శనం 4 గంటల్లో లభిస్తున్నది. 65,131 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 30,998 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. హుండీలో రూ.4.66 కోట్లు వచ్చినట్టు టీటీడీ అధికారులు తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 వరకు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు జరుగనున్నాయి.

ఏపీ ఎంబీబీఎస్ ప్రవేశాలకు నోటిఫికేషన్

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య, దంత కళాశాల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల కోసం విజయవాడలోని ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. 16 వరకు http://apuhs&ugadmissions.aptonline.in దరఖాస్తు చేసుకోవచ్చు.

10 ఇండిపెండెంట్ ప్రత్యేక్య రైళ్లు : ఎస్సీఆర్

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): కాచిగూడ-తిరుపతి, మచిలీపట్నం-వికారాబాద్ వంటి రైల్వే స్టేషన్ల మధ్య 10 ఇండిపెండెంట్ ప్రత్యేక రైళ్లను ఏర్పాటుచేసినట్టు శనివారం రైల్వే అధికారులు ప్రకటన జారీ చేశారు. ధనపూర్-బెంగళూరు స్టేషన్ల మధ్య మరో 10 ప్రత్యేక రైళ్లను పొడిగించినట్టు పేర్కొన్నారు.



గూగుల్ మ్యాప్‌లో సర్కారు భూములు

- సర్వేకు రెవెన్యూ అధికారుల కసరత్తు
- పైలట్ ప్రాజెక్టుగా మేడ్చల్ -మల్కాజిగిరి
- ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో ఉన్నవెన్ని?
- కబ్జారాయుళ్ల లెక్క తేల్చనున్న సర్వే

మేడ్చల్, ఆగస్టు10(నమస్తే తెలంగాణ):గూగుల్ మ్యాప్‌లోనూ ప్రభుత్వ భూముల వివరాలు గుర్తించవచ్చు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాను ఎంపిక చేసి ప్రణాళికను సిద్ధం చేశారు. ప్రభుత్వ నిబంధనలమేరకు కచ్చితమైన ప్రమాణాలతో జిల్లాలోని నిషేధిత భూములు, రక్షణశాఖ, అటవీశాఖ, సీలింగ్, అసైన్డ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల భూములను సర్వే చేయనున్నారు. గుర్తించిన భూములను కేఎంఎల్ మ్యాప్(గూగుల్)లో ఎలాంటి పొరపాట్లు లేకుండా పక్కాగా పొందపరచనున్నారు. ఈ భూముల వివరాలు మండల, డివిజన్, జిల్లా స్థాయి కార్యాలయాలలో శాశ్వత రికార్డులుగా సిద్ధం చేసి భద్రపరచనున్నారు. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భూములకు అధిక డిమాండ్ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ భూములను పరిరక్షణకు ఈ సర్వేను నిర్వహిస్తున్నట్టు రెవెన్యూ అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రభుత్వ భూములపై సర్వే

ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారులు నిర్వహించనున్న సర్వేలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల లెక్క తెలనున్నది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలలో గత రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూములు 5,195 ఎకరాలు ఉండగా అసైన్డ్ భూములు 11,201 ఎకరాలు ఉన్నాయి. పేదలకు అసైన్డ్ చేసిన భూములన్నీ రియల్టర్ల కబ్జాలో ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూములు ఉన్నాయా ? కబ్జాలో ఉన్నాయా? అనే దానిపైనా అధికారులు చెప్పలేకపోతున్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపట్టనున్న సర్వేలో ప్రభుత్వ భూముల వివరాలు తెలిపోనున్నాయి. భూ పరిరక్షణకు టాస్క్‌ఫోర్స్ బృందాలు లేకపోవడంతో ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైనట్టు ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆదాయంలో ఎదురులేని వెదురు



- పర్యావరణానికి మేలు.. కోట్ల మందికి జీవనోపాధి
- గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ వనరు
- ఒక్కసారి నాటితే 40 ఏండ్లు ఆదాయం
- విస్తీర్ణం పెంచడంపై అధికారుల దృష్టి

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): పర్యావరణానికి మేలు చేస్తూ కోట్ల మందికి జీవనోపాధిని అందించేదిగా వెదురు చెట్లకు ఓ ప్రత్యేకత. అంతర్జాతీయ మార్కెట్‌లో అయినా, అటవీ గ్రామీణ ప్రాంతాల్లో అయినా ఇది ప్రధాన ఆదాయ వనరు. పోవాషియే కుటుంబానికి చెందిన వెదురులో 115 జాతులు, 1,400 ఉపజాతుల మొక్కలు ఉన్నాయి. కొన్ని జాతులు రోజుకి 30 సెంటీమీటర్ల చొప్పున పెరుగుతాయి. ఈశాన్య ప్రపంచంలో వెదురును పేదవాడి కలప, ఆకుపచ్చ బంగారం అని పిలుస్తారు. ఈ కలపను కట్టడాలు, పేపర్, హస్తకళల్లోనూ ఉపయోగిస్తారు. వీటి పెంపకానికి రసాయనాలు, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ ఏవీ అవసరం ఉండదు. బీడు భూముల్లోనూ పెరుగుతుంది. అధిక వర్షాలప్పుడు మట్టి కొట్టుకుపోకుండా అడ్డుకుంటున్నది. వెదురు ఆకులు పశుగ్రాసంగా, సిలికాను మందుల తయారీలో ఉపయోగిస్తారు. వెదురు సామాన్లకు, ఫర్నిచర్‌కు, పరికరాలకు, షోకేస్ వస్తువులకు గ్లోబల్ మార్కెట్‌లో బాగా గిరాకీ ఉంది.

కేంద్రం ప్రోత్సాహం..

కేంద్ర ప్రభుత్వం వెదురు చెట్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తుంది. చెట్టుకు రూ.120 వరకు సబ్సిడీ అందిస్తోంది. ఈ చెట్లను నాటితే 4 ఏండ్ల తర్వాత నుంచి లాభాలు పొందవచ్చు. ఒక్కసారి నాటితే 40 ఏళ్ల రాబడి వస్తుంది. హెక్టార్‌లో 1500 మొక్కలను నాటవచ్చు. ఒక్కో మొక్క ఐదు అడుగుల దూరం ఉండాలి. నాలుగేళ్ల తర్వాత నుంచి రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు పొందవచ్చు.

థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో వెదురు గుళికలు

దేశ వ్యాప్తంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రణకు బొగ్గుకు బదులుగా వెదురు గుళికలు తప్పనిసరిగా వాడాలని కేంద్ర ఇంధన కొత్త విధానంలో పేర్కొన్నది. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు వినియోగం వల్ల ఏటా 21లక్షల టన్నులకుపైగా బొగ్గు వాయువు కార్బండయాక్సైడ్ వాతావరణంలోకి విడుదలవుతోంది. దీంతో పర్యావరణ కాలుష్యం ఏర్పడుతోందని కేంద్ర విద్యుత్ శాఖ ఓ నివేదికలో తెలిపింది. అందుకే బొగ్గును కాల్చే సమయంలో ఏడు శాతం వెదురు గుళికల్ని వాడాలని జాతీయ ఇంధన విధానంలో కేంద్రం స్పష్టం చేసింది. అందుకే వెదురు సాగుకు ప్రోత్సాహం అందిస్తోంది.

తెలంగాణలో వెదురు ..

దేశంలో 8 నుంచి 10 మిలియన్ టన్నుల వెదురు కొరత ఉంది. తెలంగాణ కూడా వివిధ రాష్ట్రాలకు వెదురును ఎగుమతి చేస్తోంది. రాష్ట్రంలో సహజసిద్ధంగా రెండు రకాల వెదురు జాతులు ఉన్నాయి. డెండ్రోకాలమస్ స్ట్రిక్టస్, బాంబుసా అరుండినేసియా అనే రకాలు రాష్ట్రంలోని అడవుల్లో పెరుగుతున్నాయి. జాతీయ వెదురు మిషన్ కింద, తెలంగాణ ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా ముధోల్‌లోని వెదురు ప్రదర్శన క్షేత్రంలో నాలుగు జాతులను నాటింది. ఈ నాలుగు జాతులు.. డెండ్రోకాలామస్ లాటిఫ్లోరస్, బాంబుసా బాల్కోవా (మధ్యస్థ పెరుగుదల), డెండ్రోకాలమస్ బ్రాండిసి (నెమ్మదిగా వృద్ధి చెందడం), బంబుసా తుల్దా (వేగవంతమైన పెరుగుదల)- నీటిపారుదల పరిస్థితులలో చాలా బాగా పని చేస్తున్నాయి. ముధోల్ వ్యవసాయ క్షేత్రం అధికారులు ఈ పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు.

విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే



- రెసిడెన్షియల్ స్కూళ్ల మూసివేతకు కుట్ర
- రాష్ట్రంలో పాలన అమెరికా నుంచే
- కేటీఆర్‌లా తనకు ఇంగ్లిష్ రాదని రేవంత్‌కు అసూయ ఉండొచ్చు
- కేసీఆర్ కిట్లు ఇవ్వక పోవడం వల్లే సర్కార్ దవాఖానల్లో తగ్గిన ప్రసవాలు
- ఎమ్మెల్యేలు కే సంజయ్, కౌశిక్‌రెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కే సంజయ్. చిత్రంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : గురుకుల పాఠశాలల్లో అనేక మంది విద్యార్థులు చనిపోతున్నారని, ఇవన్నీ ప్రభుత్వ హత్యలుగానే పరిగణించాల్సి ఉంటుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలల మూసివేతకు కుట్ర జరుగుతున్నదని, ఇందులో భాగంగానే వాటిపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ముందుగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ ఏడు నెలల్లో ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో 36 మంది విద్యార్థులు చనిపోయారని, దాదాపు 500 మంది ఫుడ్ పాయిజనింగ్ బారిన పడ్డారని, తన నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఆరుగురు విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారని, వారిలో ఇద్దరు చనిపోయారని ఆందోళన వ్యక్తంచేశారు. పెద్దాపూర్ గురుకులంలో ఓ విద్యార్థి నిన్ననే చనిపోయాడని, ఇంకో విద్యార్థి మృత్యువుతో పోరాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకు ముందు మంచానపడ్డ మన్యం అనే వార్తలు వచ్చేవని, ఇప్పుడు మంచానపడ్డ రెసిడెన్షియల్ పాఠశాలలు అనాల్సి వస్తున్నదని వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి భాషలో చెప్పాలంటే విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలేనని, ఈ మరణాలపై ప్రభుత్వం సమీక్షించడం లేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో వెయ్యి ప్రభుత్వ గురుకులాలు ఏర్పాటయ్యాయని, వాటిని సమీక్షించేందుకు గతంలో సెంట్రల్ కమాండ్ సిస్టం ఉండేదని, ఇప్పుడు అలాంటిదేదీ లేదని చెప్పారు. ప్రతి రెసిడెన్షియల్ స్కూల్‌కు హెల్త్ సూపర్ వైజర్ ఉండాలని, విద్యార్థులు జబ్బు పడితే కనీసం మందులు కూడా అందుబాటులో లేవని, విద్యార్థులు పాము, ఎలుక కాట్ల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డికి రెసిడెన్షియల్ స్కూళ్లపై సదభిప్రాయం లేదన్న విషయం ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యలు బట్టి తెలుస్తున్నదని చెప్పారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో ఇటీవల మూడు వేల సీట్ల కోసం లక్ష మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని, దీన్నిబట్టి ఆ స్కూళ్లకు ఎంత డిమాండ్ ఉన్నదో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. భేషజాలకు పోకుండా గురుకులాలను కాపాడాలని సూచించారు.

అమెరికా నుంచే పాలన : కౌశిక్‌రెడ్డి

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన అంతా అమెరికా నుంచే నడుస్తున్నదని, ముఖ్యమైన అధికారులంతా విదేశీ పర్యటనకు వెళ్లిన సందర్భం గతంలో ఎన్నడూ లేదని చెప్పారు. రేవంత్‌రెడ్డి గతంలో ఎన్‌ఆర్‌ఐలను నాన్ రిలయబుల్ ఇండియన్స్ అన్నారని, మరి వారి దగ్గరకే ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తెచ్చానని చెబుతున్న పెట్టుబడులన్నీ బోగస్ అని, రేవంత్ తమ్ముడు డైరెక్టర్‌గా ఉన్న స్వచ్ఛ్ బయోతో ఒప్పందం పెద్ద కుంభకోణమని ఆరోపించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరగాలని, 15 రోజుల క్రితమే ఏర్పాటైన సంస్థతో ఎలా ఒప్పందాలు కుదుర్చుకుంటారని ప్రశ్నించారు. గోడీ సంస్థతో ఒప్పందం అంటూ సీఎం రేవంత్ గతంలో బోడి మాటలు చెప్పారని దుయ్యబట్టారు. వైద్యరంగం పడకేసిందని, ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీల సంఖ్య దారుణంగా పడిపోయిందని, డాక్టర్ల కొరత వేధిస్తున్నదని, సామాన్యులు సైతం మళ్లీ ప్రైవేట్ హాస్పిటళ్ల బాట పడుతున్నారని చెప్పారు. నెలకు 200 డెలివరీలు జరిగే ప్రభుత్వ దవాఖానల్లో ఇప్పుడు ఒక్కటి కూడా కావడం లేదని తెలిపారు. కేసీఆర్ కిట్లు ఇవ్వకపోవడంవల్ల ప్రభుత్వ హాస్పిటళ్లలో డెలివరీలు తగ్గాయని చెప్పారు. అవసరమైతే కేసీఆర్ పేరు తొలగించి వేరే పేరుతోనైనా కిట్లను అందించాలని సూచించారు. కేటీఆర్‌లా తనకు ఇంగ్లిష్ రాదని రేవంత్‌కు అసూయ ఉండొచ్చని చెప్పారు. కేటీఆర్‌లా ఇంగ్లిష్ నేర్చుకునేందుకు రేవంత్‌రెడ్డి మంచి ట్యూటర్‌ను పెట్టుకోవాలిగానీ పిచ్చి విమర్శలు చేయొద్దని సూచించారు. కేటీఆర్ ఇంగ్లిష్‌పై రేవంత్ చేస్తున్న పిచ్చి విమర్శలు చూసి అందరూ నవ్వుకుంటున్నారని కౌశిక్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

గతి తప్పిన గురుకులం

మొదటిపేజీ తరువాయి...

వెల్ఫేర్, మైనార్టీ, బీసీ, ఎస్టీ గురుకులం ఇలా దేనిలో చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. ఘటన జరిగిన వెంటనే హడావుడి చేయడం, తూతూమంత్రంగా ఎంక్వయిరీ కమిటీ వేయడం, కంటితుడుపుగా వార్డెన్‌నో, లేదా ప్రిన్సిపాల్‌నో సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి పరిపాటిగా మారింది. అంతేతప్ప కారణాలేమిటి? ఎందుకు ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయి.? కారకులెవరు? పరిష్కార మార్గాలేంటి? అన్న అంశాలపై ఇటు ఉన్నతాధికారులకు గానీ, అటు సర్కారుగానీ దృష్టిసారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరుస ఘటనలపై ఇప్పటికీ బీసీ సంక్షేమశాఖకు మంత్రి ఉన్నా ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదంటే ప్రభుత్వ పర్యవేక్షణ ఎలా ఉన్నదో తేటతెల్లమవుతున్నది. 8 నెలలుగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖలకు మంత్రి దిక్కులేక వాటి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

8 నెలలు..ఎన్నో ఘటనలు!

- **జనవరి 22:** నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి ఎస్సీ గురుకులంలో 9వ తరగతి విద్యార్థి భార్గవి ప్రార్థన సమయంలో కింద పడిపోయింది. దవాఖానకు తరలించగా అప్పటికే చనిపోయింది.
- **ఫిబ్రవరి4 :** భువనగిరి పట్టణంలోని ఎస్సీ గురుకులంలో 10వ తరగతి చదువుతున్న హబ్సీగూడకు చెందిన ఇద్దరు బాలికలు భవ్య, వైష్ణవి ఒకే రోజు ఆత్మహత్య చేసుకున్నారు.
- **ఫిబ్రవరి 10:** సూర్యాపేటలో జిల్లా ఇమాంపేట ఎస్సీ గురుకులంలో ఇంటర్ సెకండియర్ విద్యార్థిని వైష్ణవి అనుమానాస్పదంగా చనిపోయింది.
- **ఫిబ్రవరి 18:** ఇదే గురుకులానికి చెందిన విద్యార్థి అస్మిత ఇంటివద్ద బలవన్మరణానికి పాల్పడింది.
- **ఏప్రిల్16:** భువనగిరిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థి ప్రశాంత్ చనిపోయాడు. భువనగిరి జిల్లాలోనే బొమ్మలరామారం, గుండాల, భువనగిరి, వలిగొండ, మోటకొండూరు వసతి గృహాల్లోనూ ఫుడ్ పాయిజన్ కేసులు నమోదయ్యాయి.
- **జూలై12:** కొత్త గూడెం జిల్లాలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో సుజాతనగర్ మండలం గరీబ్‌పేటకు చెందిన 5వ తరగతి విద్యార్థి బుర్ర లిడియా (12) జ్వరంతో ఇంటికి వెళ్లింది. తర్వాత ఊహించని రీతిలో బాలిక ఉరేసుకున్నది.
- **ఆగస్టు 8:** మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలం నంచర్ల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇదేరోజున ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి కొయ్యడ కార్తీకశ్రీ గురుకుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది.
- **ఆగస్టు 9 :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో 6వ తరగతి విద్యార్థి అడ్మాల అనిరుద్ (11) చనిపోయాడు. అదే తరగతికి చెందిన విద్యార్థులు హేమంత్, మొండి మోక్షిత్ అస్వస్తతకు గురయ్యారు.
- **జూలై 26:** ఇదే గురుకులంలో మెట్‌పల్లి మండలం అరపేటకు చెందిన 8వ తరగతి విద్యార్థి అద్వైత్ అస్వస్థతకు గురై మృతిచెందాడు.



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలో శనివారం సిబ్బంది చంపిన పాము

గురుకుల పనివేళలను మార్చాలి

గురుకుల పాఠశాలల్లో అమలు చేస్తున్న పని వేళలను పూర్తిగా మార్చాలి. ప్రస్తుతం ఉన్న పని వేళల వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. దాని ప్రభావం విద్యార్థులపైనా పడుతున్నది. విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య స్నేహపూర్వక వాతావరణం అన్నదే లేకుండా పోతున్నది. ఆహ్లాదకర వాతావరం నెలకొల్పాలంటే ఉపాధ్యాయుల్లో ఒత్తిడిని తగ్గించాలి. ప్రభుత్వం ఆ దిశగా సత్వరమే చర్యలు చేపట్టాలి.

- బాలరాజు, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

మానసిక ఒత్తిడి.. నాసిరకం సరుకులే?

గురుకులాల్లో వరుసగా చోటు చేసుకుంటున్న ఫుడ్ పాయిజన్ ఘటనలకు నాసిరకం సరుకులే కారణమని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచి ఇవ్వకవడంతో కాంట్రాక్టర్లు నాణ్యతలేని సరుకులనే సరఫరా చేస్తున్నారని, ఎక్కడా మెనూ పాటించడం లేదని వారు చెబుతున్నారు. ఫలితంగానే గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు తరచూ జరుగుతున్నాయని వాపోతున్నారు. ఇదిలా ఉంటే గురుకుల విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. ప్రభుత్వం అమలు చేస్తున్న పాఠశాలల వేళల కారణంగా విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని విద్యార్థి సంఘాల నేతలతో పాటు తల్లిదండ్రులు సైతం వాపోతున్నారు. సాధారణంగా గురుకుల విద్యార్థుల దినచర్య ఉదయం 5గంటలకు మొదలవుతుంది. 7గంటల వరకు బ్రేక్ ఫాస్ట్, 8.15 గంటల నుంచి మధ్యాహ్నం 1:25 వరకు 7 పీరియడ్లను ఏకధాటిగా నిర్వహిస్తే స్టూడెంట్స్ ఎలా భరిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. అదే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు క్లాసులు ప్రారంభమైనప్పటి నుంచి స్కూల్ ముగిసే వరకూ యూరినల్ టైమ్స్‌కి గంటన్నర, మూడున్నర గంటల గ్యాప్‌లో లంచ్, ఆ తర్వాత గంటన్నర గ్యాప్‌లో తిరిగి షార్ట్ బ్రేక్ లాంటివి ఉంటాయని ఉదహరిస్తున్నారు. కానీ గురుకుల విద్యార్థులను రోబోల్లా ట్రీట్ చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాయంత్రం గేమ్స్ తర్వాత విద్యార్థులకు పర్సనల్ టైమ్ కేవలం 15 నిమిషాలే ఉంటున్నదంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోచ్చని చెబుతున్నారు. మార్చిన వేళలు విద్యార్థుల మానసికస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

కన్నెత్తి చూడని కాంగ్రెస్ సర్కారు

రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాలు, విపక్షాలు మండిపడుతున్నాయి. ఫుడ్‌పాయిజన్, అనుమానాస్పద, బలవన్మరణాలు వెలుగులోకి వచ్చినప్పుడు ఉన్నతాధికారులు హడావుడి చేయటం, ఎంక్వయిరీ కమిటీ వేయటం పరిపాటిగా మారిందని, గురుకులాలను ఎత్తేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. ఆయా ఘటనల్లో గురుకుల వార్డెన్‌ను లేదంటే ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం రివాజుగా మారిందని విద్యార్థినేతలు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బీసీ సంక్షేమ గురుకులాలకు సంబంధించి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నా ఇప్పటి వరకు వారు సమీక్షించింది, అధికారులకు సూచనలిచ్చిందీ లేకపోవడం ప్రభుత్వ పర్యవేక్షణకు అద్దంపడుతున్నది. ఇక ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖలు సీఎం వద్దే ఉన్నా ఆయన పట్టించుకోకపోవడం గమనార్హం. ఇకనైనా గురుకులాల్లో జరిగే ఘటనలకు ప్రభుత్వం పరిష్కారమార్గాలను వెతకాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

పనిఒత్తిడితో గురుకుల ఉపాధ్యాయులు

గురుకుల సిబ్బంది పర్యవేక్షణలోపం కూడా వరుస ఘటనలకు కారణమని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. పనిఒత్తిడి కారణంగానే పర్యవేక్షణపై దృష్టి పెట్టడం లేదని గురుకుల ఉపాధ్యాయులు సైతం వాపోతున్నారు. మార్చిన పనివేళలతో చాలామంది మానసికంగా కుంగిపోతున్నారని, అందుకే విద్యార్థులపై దృష్టిపెట్టడం లేదని పలువురు ఉద్యోగులు బాహాటంగానే చెబుతున్నారు. గురుకుల ఉపాధ్యాయుడికి పాఠాలు చెప్పడం ఒక్కటే కాకుండా డైనింగ్, వాటర్ డ్యూటీ, శానిటరీ డ్యూటీ, కిచెన్ ఇన్‌స్పెక్షన్, ఏటీపీ రొటేషన్, స్టడీ అవర్స్, కూరగాయలు కొలతలతో ఇవ్వడం, రాయడంలాంటి అనేక బోధనేతర విధులతోనే నిత్యం సతమతమవుతున్నామని, వృత్తికి, తాము చేసే పనికి సంబంధమే లేదని చెబుతున్నారు. తాము కూడా మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని టీచర్లు చెప్తున్నారు.

లోకం పోకడ



చిత్తుకాగితాలు కొంటాం.. పాత కాగితాలు కొంటాం.. జాబ్ క్యాలెండర్లు కొంటాం..!

డెంగ్యూతో గురుకుల విద్యార్థిని మృతి



కౌటాల, ఆగస్టు 10 : డెంగ్యూతో గురుకుల విద్యార్థిని శనివారం మృతి చెందింది. ఈ ఘటన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో చోటుచేసుకున్నది. కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన జాడి కిశోర్-సురేఖ దంపతుల పెద్ద కూతురు పూజ (16) ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో పదోతరగతి చదువుతున్నది. నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నది. పాఠశాల సిబ్బంది పూజ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో 8వ తేదీన ఆమె తండ్రి కిశోర్ పాఠశాలకు వచ్చి ఇంటికి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. జ్వరం తగ్గకపోవడంతో శుక్రవారం మహారాష్ట్రలోని చంద్రపూర్‌లోగల ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. డెంగ్యూతో బాధపడుతుండటంతో మెరుగైన చికిత్స కోసం చంద్రపూర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి



పెద్ద చిరంజీవులు (ఫైల్)

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 10: పొలంలో స్టార్టర్ బాక్స్ మరమ్మతు కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసేందుకు యత్నిస్తూ ఓ రైతు విద్యుత్తు షాక్‌తో మృతి చెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్నది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట్‌కు చెందిన రైతు మామాడి పెద్ద చిరంజీవులు (54) శనివారం తన భార్యతో కలిసి పొలంలో మందు చల్లేందుకు వెళ్లాడు. దాహం వేయడంతో బోర్ వేసేందుకు వెళ్లగా ఆన్ కాలేదు. స్టార్టర్ బాక్స్ పాడైందని గుర్తించిన చిరంజీవులు దాన్ని సరిచేయడానికి పొలం పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. హ్యాండిల్ పట్టుకుని ఆఫ్ చేసేందుకు యత్నిస్తున్న క్రమంలో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సంగీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న కత్తె మల్లేశ్

రైతు ఆత్మహత్యాయత్నం

రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలో మోసపోయిన అన్నదాత

నాగర్‌కర్నూల్, ఆగస్టు 10 : రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలో మోసపోయిన రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ మండలం వనపట్ల గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు, బాధితుడి కథనం మేరకు.. కత్తె రాములు, కత్తె మల్లేశ్, కత్తె జ్యోతికి వనపట్ల గ్రామ శివారులోని సర్వే నంబర్ 135లో 4 ఎకరాల 38 గుంటలు ఉన్నది. ఈ భూమిని 2022లో వనపట్లకు చెందిన ఓ వ్యక్తిని మధ్యవర్తిగా ఉంచి ఎకరం రూ.1.36 కోట్లుగా ధర ఖరారు చేసి విక్రయించారు. రూ.2.32 లక్షలు అడ్వాన్స్ ఇచ్చి, మిగతా డబ్బులను ఏడాదిలోగా ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుంటామని అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే, డీటీసీపీ అప్రూవల్ నిమిత్తం పది శాతం భూమిని గ్రామ పంచాయతీకి అప్పజెప్పాలని కత్తె రాములు, కత్తె మల్లేశ్, కత్తె జ్యోతిని నమ్మించి.. మొత్తం భూమిని వారి పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. గడువు తీరిన తరువాత మిగతా డబ్బులు ఇవ్వకపోవడంతో వారి మధ్య విబేధాలు వచ్చాయి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన కత్తె మల్లేశ్ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తోటి రైతులు అతడిని జిల్లా దవాఖానకు తరలించారు. నిరక్షరాస్యులైన తమను మోసం చేసిన సదరు వ్యక్తులపై చర్యలు తీసుకొని, మిగతా డబ్బులు ఇప్పించాలని మల్లేశ్ కోరారు. ఈ విషయం శనివారం సోషల్ మీడియాలో వైరలైంది. ఇదిలావుండగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

యువరైతు ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

కానరాక తీవ్ర మనస్తాపంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రమేశ్‌కు భార్య జ్యోతి, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. తండ్రి చక్రు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజ్ తెలిపారు.

సీఎం ఇలాకాలో టీచర్లు లేరు!

- నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో టీచర్ల కొరత
- రెండు జిల్లాల్లో విస్తరించిన సీఎం నియోజకవర్గం
- రేవంత్‌రెడ్డి వద్దే విద్యాశాఖ
- డీఎస్సీపై ఎస్సీ వర్గీకరణ ప్రభావం
- కొత్త టీచరు వచ్చే దాకా ఇన్‌స్ట్రక్టర్లు



సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ కేంద్రం వ్యూ

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం విస్తరించి ఉన్న నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లోనూ ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్నది. నారాయణపేట జిల్లాలో 185 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, 99 మంది స్కూల్ అసిస్టెంట్ల చొప్పున మొత్తం 284 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వికారాబాద్ జిల్లాలో 84 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని కోస్గి మండలంలో 4 స్కూల్ అసిస్టెంట్, మద్దూరు మండలంలో 22 ఎస్జీటీ, 14 స్కూల్ అసిస్టెంట్ చొప్పున మొత్తం 36, గుండుమల్ మండలంలో 4 ఎస్జీటీ, 1 స్కూల్ అసిస్టెంట్ చొప్పున మొత్తంగా 5, కొత్తపల్లి మండలంలో ఒక స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉన్నది. విద్యాశాఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దే ఉన్నా ఈ రెండు జిల్లాల్లో విద్యార్థులకు బోధించేందుకు టీచర్లు లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నది.

కొత్త టీచర్లు వచ్చేదెప్పుడు ?

సర్కారు బడుల్లో టీచర్లను నియామకానికి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. సెప్టెంబర్‌లోపు నియామకాలు పూర్తి చేయాలని గడువుగా విధించుకున్నా ఈ రిక్రూట్‌మెంట్‌లో తీవ్ర ఆలస్యం కానున్నది. కొత్త టీచర్లు ఇప్పుడు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. డీఎస్సీ పరీక్షలు ముగిసినా ఇప్పటి వరకు ప్రాథమిక కీ విడుదల కాలేదు. పైగా డీఎస్సీ ఫలితాలపై ఎస్సీ వర్గీకరణ ప్రభావం పడనున్నది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇప్పటికే జారి చేసిన నియామకాల్లోనూ వర్తింపజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. వర్గీకరణ అమలుపై విధివిధానాలు ఖరారుకాని నేపథ్యంలో అప్పటివరకు డీఎస్సీ ఫలితాల వెల్లడి సాధ్యపడే సూచనలు కనిపించడంలేదు.

మూసివేత దిశగా 100 స్కూళ్లు!

టీచర్ల బదిలీలు, పదోన్నతుల తర్వాత నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో అత్యధికంగా టీచర్ల కొరత సమస్య తలెత్తింది. టీచర్లు లేకపోవడంతో ఈ రెండు జిల్లాల్లోనే దాదాపు 100 పాఠశాలలు మూసివేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఇటు టీచర్లు లేక, అటు విద్యార్థుల చదువులు సాగే పరిస్థితి లేకపోవడంతో ఈ రెండు జిల్లాల కలెక్టర్లు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి అనుమతి కోరారు. దీంతో మూడు నెలలపాటు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి అనుమతిచ్చినట్టు తెలిసింది. డీఎస్సీ నియామకాలు పూర్తయ్యే వరకు మాత్రమే వీరిని కొనసాగించే అవకాశముందని అధికారులు తెలిపారు.

మూడు నెలలకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు..

ఇటీవలి బదిలీలు, పదోన్నతులతో పెద్ద ఎత్తున టీచర్లకు స్థానచలనం కలిగింది. ఈ నేపథ్యంలో టీచర్ల కొరతను అధిగమిందుకు విద్యాశాఖ టీచర్ల సర్దుబాటును చేపట్టింది. కొన్ని జిల్లాల్లో మిగులు టీచర్లు ఉండగా, ఎన్‌రోల్‌మెంట్ లేని బడుల్లోని టీచర్లను విద్యార్థులున్న బడుల్లో సర్దుబాటు చేశారు. ఇంకా టీచర్ల సమస్య ఉంటే అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జూలై 30న వివరాలు పంపించాలని అన్ని జిల్లాల డీఈవోలకు పాఠశాల విద్యాశాఖ అధికారులు లేఖను పంపించారు. మూడు నెలల కాలానికి అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించనుండగా, వీరికి రూ. 15,600 పారితోషికంగా చెల్లించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం ఉన్న వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో 317 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

సర్కారు ‘ఇంజినీరింగ్’లో చేరట్లే

- ప్రభుత్వ కాలేజీల్లో మిగులుతున్న బీటెక్ సీట్లు..
- మరోవైపు ప్రైవేట్ కాలేజీల్లో జోరుగా అడ్మిషన్లు



యాజమాన్యాల సీట్ల భర్తీశాతం

సంవత్సరం	ప్రభుత్వ కాలేజీల్లో	ప్రైవేట్ కాలేజీల్లో	మొత్తం
2020-21	83.02	65.85	66.39
2021-22	77.00	70.54	70.78
2022-23	70.05	76.37	76.09
2023-24	67.33	78.01	77.50

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీల్లో చదవాలని విద్యార్థులు తహతహలాడుతారు. సీటు వస్తే చాలు ఎగిరిగంతేస్తారు. కానీ ఏటా అలాంటి సర్కారు ఇంజినీరింగ్ కాలేజీల్లో బీటెక్ సీట్లు మిగులుతున్నాయి. 2020-21 విద్యాసంవత్సరంలో 17 శాతం మిగలగా, 2023-24కు వచ్చేసరికి ఏకంగా 33శాతం సీట్లు మిగిలాయి. 2023-24 విద్యాసంవత్సరంలో ఆయా కాలేజీల్లో 67శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. రాష్ట్రంలో 19 ప్రభుత్వ, 155 ప్రైవేట్ కాలేజీలున్నాయి. ప్రతిభావంతులంతా ఐఐటీలు, ఎన్‌ఐటీల్లో చేరడంతో సర్కారు కాలేజీల్లోని సీట్లు ఖాళీగా ఉండేవి. దీంతో ఇప్పుడు ఐఐటీ, ఎన్‌ఐటీల్లో సీట్ల భర్తీ అయిన తర్వాతే ఎప్‌సెట్ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అయినా అత్యంత ప్రధానమైన ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు నిండటం లేదు. రాష్ట్రంలో 18 యూనివర్సిటీ కాలేజీలుండగా 5,907 సీట్లకు 5,014 సీట్లు భర్తీకాగా 893 ఖాళీగా ఉన్నాయి. 2 ప్రైవేట్ వర్సిటీల్లో 98.91 సీట్లు భర్తీకాగా, 154 ప్రైవేట్ కాలేజీల్లో 94.88 శాతం భర్తీ అయ్యాయి. 87 కాలేజీల్లో వందశాతం సీట్లు భర్తీకాగా, వీటిలో 80 ప్రైవేట్ కాలేజీలే ఉన్నాయి. ఏడు మాత్రమే యూనివర్సిటీ కాలేజీలున్నాయి.

తాజా అప్పు.. 3వేల కోట్లు

మొదటిపేజీ తరువాయి...

వేయనున్నట్టు ఆర్బీఐ శుక్రవారం వెల్లడించింది. అనంతరం ఆ మొత్తం రాష్ట్ర ఖజానాకు చేరనున్నది. ప్రతి నెల రూ.5 నుంచి 6 వేల కోట్ల విలువైన బాండ్లను విక్రయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నుంచి అప్పులు తీసుకుంటున్నది. ఈ ఏడాది జూలై 24 నాటికే రూ.35,118 కోట్లు అప్పుగా తీసుకున్నట్టు రాష్ట్ర బడ్జెట్‌లో రేవంత్‌రెడ్డి సర్కారు వెల్లడించింది. ఈ ఏడాది రూ.62,012 కోట్లు రుణ సమీకరణ చేయనున్నట్టు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిపాదించింది. నిరుటితో పోలిస్తే ఈ ఏడాది రాష్ట్ర అప్పు పద్దు రూ.10 వేల కోట్లు ఎక్కువకావడం గమనార్హం. బహిరంగ మార్కెట్‌లో రూ.57,112 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ.1000 కోట్లు సమీకరించనున్నట్టు బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.

వార్షిక ఆదాయం 2 లక్షల్లోపు ఉంటేనే రేషన్‌కార్డు


మొదటిపేజీ తరువాయి...

సూచనలు తీసుకుంటామని ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తక్షణమే రాజ్యసభ, లోకసభ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలందరికీ లేఖలు రాయాలని, సూచనలు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖకు సూచించారు. డాక్టర్ ఎన్‌సీ సక్సేనా కమిషనర్‌గా ఉన్న సక్సేనా కమిటీ సిఫారసులను రేషన్‌కార్డుల జారీలో పరిగణనలోకి తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఆ కమిటీలో సుప్రీంకోర్టు స్పెషల్ కమిషనర్ హర్షమందర్ సభ్యుడిగా ఉన్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ సూచన మేరకు అధికారులు వివిధ రాష్ట్రాల్లో తెల్లరేషన్‌కార్డు మంజూరుకు అవలంబిస్తున్న విధివిధానాలను అధ్యయనం చేశారని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు వలస వచ్చిన వారికి అక్కడా, ఇక్కడ రెండు చోట్లా తెల్లకార్డులు ఉన్నట్టు తేలిందని, అటువంటి వారికి ఎక్కడైనా ఒక్క చోటనే కార్డు ఉంచుకునే ఆప్షన్ ఇవ్వాలనే ప్రతిపాదనపైనా ఉపసంఘం చర్చించినట్టు ఉత్తమ్ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89.96 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త తెల్ల రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించగా 10లక్షలు వచ్చినట్టు చెప్పారు. ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్ల చేర్పు కోసం 11.33 లక్షల అర్జీలు వచ్చాయని, వాటన్నింటి మంజూరుకు ప్రభుత్వానికి రూ. 956కోట్లు ఖర్చవుతుందని వివరించారు.



‘స్థానికత’ పాపం సర్కారుదే

మొదటిపేజీ తరువాయి...



రాసినట్టు సమాచారం. సాంకేతిక విద్యాశాఖ సహా వివిధ యూనివర్సిటీల నుంచి ప్రభుత్వానికి ఇలాంటి విజ్ఞప్తులే అందినా పక్కన పెట్టినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇంజినీరింగ్ ప్రవేశాల సమయంలోనూ ఉమ్మడి కోటాపై తర్జనభర్జన జరిగింది. అయితే జూన్ 2కు ముందే అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడంతో ‘ఉమ్మడి’ కోటా కొనసాగించాల్సి వచ్చింది. మెడికల్ సీట్లపై మాత్రం ప్రభుత్వం మీనమేషాలు లెక్కించింది. యూనివర్సిటీ నుంచి ఎన్నిసార్లు విజ్ఞప్తులు అందినా వైద్యారోగ్య శాఖ నిర్ణయం తీసుకోలేదు. చివరికి తప్పని పరిస్థితుల్లో జూలై 19న తూతూమంత్రంగా జీవో ఇచ్చి చేతులు దులుపుకున్నది. విమర్శలు వస్తాయన్న భయంతో ఆ జీవోను కూడా బహిర్గతం చేయకుండా రహస్యంగా ఉంచింది. రెండు వారాల తర్వాత నోటిఫికేషన్‌తోపాటు విడుదల చేసింది. మరుసటి రోజు నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సి ఉండటంతో పెద్దగా పట్టించుకోరని ప్రభుత్వం భావించగా.. పరిస్థితి తలకిందులైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, జీవో 33లో మార్పులు చేయడంతోపాటు భవిష్యత్తులో మళ్లీ సమస్య రాకుండా సమగ్ర అధ్యయనం జరిపి స్థానికతను నిర్ధారించాలని కోరుతున్నారు.

ఏపీ సర్కారు ముందుచూపు

జూన్ 2 తర్వాత ఉమ్మడి కోటా ఉండవని ఏపీ ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలకు స్థానికత, రిజర్వేషన్లపై అధ్యయనం చేసేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ప్రత్యేక కమిటీని నియమించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, 8 మంది ఉన్నతాధికారులు, అడ్మిషన్ల రంగంలో నిపుణులు ఒకరిని సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేసింది. స్థానికత, ఉమ్మడి కోటా అంశంపై నిపుణులు, విద్యార్థులు, అసోసియేషన్ల నుంచి అభిప్రాయాలు తీసుకొని నివేదిక సమర్పించాలని ఆదేశించింది. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో స్థానికతను నిర్ధారించారు. తాజాగా ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఎంబీబీఎస్, బీడీఎస్ నోటిఫికేషన్‌లో స్థానికతపై స్పష్టత ఇచ్చారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు గరిష్ఠంగా నాలుగేండ్లు చదివిన ప్రాంతాన్ని లోకల్‌గా గుర్తించాలన్న నిబంధనను కొనసాగిస్తూనే, కచ్చితంగా ఇంటర్ ఏపీలోనే చదవాలనే నిబంధన పెట్టారు. ఏపీలో ఇంటర్ చదవలేని వారికి కూడా ఓ వెసులుబాటు ఇచ్చారు. దీంతో అక్కడ స్థానికతపై వివాదాలు తలెత్తడం లేదు.

కుక్కల నుంచి ప్రజలను కాపాడండి

- ప్రాణాలు తీస్తున్నా చర్యలేవి ?
- 5 లక్షల పరిహారమివ్వండి
- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహకు ఏఐసీసీ సభ్యుడు జీ నిరంజన్ లేఖ



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కుక్కల దాడుల్లో చిన్నారులు, వృద్ధులు చనిపోతున్నారని ఏఐసీసీ సభ్యుడు జీ నిరంజన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఇటువంటి ఘటనలు అనేకం వెలుగులోకి వస్తున్నా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తూ శనివారం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహకు లేఖ రాశారు. శునకాల దాడిలో మూడు వారాల క్రితం నాలుగేండ్ల బాలుడు చనిపోయాడని, వరంగల్ ఎంజీఎంలో అప్పుడే పుట్టిన శిశువుపై వీధికుక్కలు దాడిచేసి చంపేశాయని లేఖలో గుర్తు చేశారు. ఈ వరుస ఘటనలపై స్పందించిన హైకోర్టు దీనిని సుమోటోగా తీసుకుని శునకాల బారి నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. వరంగల్ ఎంజీఎం దవాఖానలో కుక్కలు ఇష్టారాజ్యంగా తిరుగుతున్నా వాటిని నియంత్రించడంలో అధికారులు, సిబ్బంది, సెక్యూరిటీ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల బెడదను నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి శునకాలను ఏరిపారేయాలని సూచించారు. కుక్కల దాడిలో మరణించిన వారికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని నిరంజన్ డిమాండ్ చేశారు.

గ్రామాల్లో కుక్కలు.. గురుకులాల్లో ఎలుకలు

- రైతుభరోసా లేదు.. తులం బంగారం లేదు
- చెత్తకుప్పలుగా పంచాయతీలు
- సఫాయి కార్మికులకు జీతాల్లేవ్
- సీజనల్‌తో పడకేస్తున్న పల్లెలు
- ప్రభుత్వానికి చీమకుట్టినట్టూ లేదు
- కేసీఆర్ పాలనలో ఇట్లే ఉండేదా?
- కాంగ్రెస్‌వి కోతలు.. ఎగవేతలు
- హామీలన్నీ ఎగ్గొడుతున్న మోసకారి ప్రభుత్వం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరులో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు

సిద్దిపేట, ఆగస్టు 10: గ్రామాల్లో కుక్కలు కరుస్తున్నాయి.. గురుకులాల్లో ఎలుకలు కొరుకుతున్నాయి.. కేసీఆర్ పాలనలో పరిస్థితి గిట్లనే ఉన్నదా? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్‌ది ఎగవేతలు, కోతల ప్రభుత్వమని విమర్శించారు. ఎన్నిలప్పుడు ఆరు గ్యారెంటీలతోపాటు అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత కాంగ్రెస్ సర్కారు ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. శనివారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, కల్యాణలక్ష్మి తులం బంగారం మాటలకే పరిమితమైందని విమర్శించారు. రూ.4 వేల పెన్షన్ దేవుడెరుగు.. ఉన్న పెన్షన్‌రాక రెండు నెలలు అయిందని.. ముసలోళ్లు గోసపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 8 నెలలుగా కల్యాణలక్ష్మి చెక్కులు రావడంలేదని, మధ్యాహ్న భోజన కార్మికులకు, గురుకులాల్లో పని చేసే కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. గ్రామాలన్నీ చెత్తకుప్పలుగా మారాయని, ట్రాక్టర్ డీజిల్‌కూ పైసల్లేవని, సఫాయి కార్మికులకు జీతాల్లేవని.. జీపీల్లో నిధులే లేవని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు చెవుటోని ముందు శంఖం ఊదినట్టుందని ఎద్దేవా చేశారు. పారిశుధ్య నిర్వహణ లేక సీజనల్ వ్యాధులతో పల్లెలు పడకేస్తున్నా.. ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. అంతకుముందు సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరులో పారిశుద్ధ్య కార్మికులు తమకు 7 నెలలుగా జీతాలులేవని మాజీ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, నాయకులు పాల సాయిరాం, కాముని శ్రీనివాస్, గుండు భూపేశ్, కుంభాల ఎల్లారెడ్డి, మట్టె బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుక్కకాటుకు ప్రభుత్వానిదే బాధ్యత

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నమోదవుతున్న కుక్కకాటు సంఘటనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబసభ్యులకు, గాయపడినవారికి నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ దవాఖానల ద్వారా కుక్కకాటు బాధితులకు తక్షణ వైద్యం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. యాంటీ రేబిస్ మందులు అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, దవాఖానల్లో అందుబాటులో ఉంచాలని శనివారం ఒక ప్రకటనలో సూచించారు. వీధికుక్కల నియంత్రణ కోసం సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని, క్రమం తప్పకుండా మానిటర్ చేస్తూ సంఖ్య పెరగకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఒక్కరోజే వరంగల్ ఎంజీఎంలో పసికందు మృతదేహాన్ని కుక్కలు పీక్కతినడం, నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలో దివ్యాంగ చిన్నారి మర్మాంగాలపై కుక్కలు దాడి చేయడం, రంగారెడ్డి జిల్లాలో చిన్నారి కుక్కల దాడిలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందడం వంటి హృదయవిదారక ఘటనలు జరిగినా ప్రభుత్వం చలించకపోవడం అమానవీయమని పేర్కొన్నారు. కుక్కల దాడుల్లో మనుషులు చనిపోవడాన్ని ఒక సాధారణ అంశంగా ప్రభుత్వం భావిస్తుండటం దుర్మార్గమని మండిపడ్డారు. కుక్కకాటు కేసులు నమోదైన మొదట్లోనే తగిన చర్యలు తీసుకొని ఉంటే గడిచిన ఎనిమిది నెలల్లో 343 కుక్కకాటు సంఘటనలు జరిగి ఉండేవి కావని పేర్కొన్నారు. రాష్ట్రంలో 3,79,156 వీధికుక్కలు ఉన్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల హైకోర్టుకు తెలిపిందని, వీటి సంఖ్య రెట్టింపు ఉంటుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పల్లెప్రగతి, పట్టణప్రగతి కార్యక్రమాలు నిలిపివేయడం వల్ల పారిశుద్ధ్య నిర్వహణ పడకేసిందని, చెత్తాచెదారం పేరుకుపోయి వీధికుక్కల బెడద మరింత ఎక్కువైందని ఆందోళన వ్యక్తంచేశారు. మున్సిపల్ పట్టణాల్లో పురపాలక శాఖ వైఫల్యం వల్ల వీధికుక్కల నియంత్రణ లేకుండా పోయిందని విమర్శించారు. సరైన నిధుల కేటాయింపు లేక కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేసే వ్యవస్థ కూడా సరిగా పనిచేయడం లేదని, దీనివల్ల వీధికుక్కల సంతానం విపరీతంగా పెరిగిపోయిందని పేర్కొన్నారు. ఇప్పటికే పలు మార్లు హైకోర్టు కూడా హెచ్చరికలు జారీ చేసినా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వదలడం లేదని మండిపడ్డారు.

పిచ్చికుక్క స్వైర విహారం

యాచారం, ఆగస్టు 10: రంగారెడ్డి జిల్లా యాచారంలో శనివారం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి ఐదుగురిపై దాడి చేసింది. ఎల్లమ్మగుడి కాలనీకి చెందిన ముగ్గురు చిన్నారులు లడ్డు, లోకేశ్, ఎంజిలీనాలపై దాడి చేసింది. మేడిపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు నరసింహాచారి, యాచారానికి చెందిన స్వాతిపై దాడి చేయగా స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు కర్రలతో పిచ్చికుక్కను తరిమేశారు. కుక్కకాటు బాధితులను ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు.

'సుంకిశాల'పై విచారణకు వెనుకడుగు ఎందుకు?

మొదటిపేజీ తరువాయి...



ప్రభుత్వాన్ని ఎవరు, ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించేందుకు ప్రభుత్వం ఎందుకు వెనుకంజ వేస్తున్నదని కేటీఆర్ నిలదీశారు. ఈ మొత్తం ప్రమాదాన్ని చిన్నదిగా కప్పిపుచ్చే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారో, దీనికి బాధ్యులు ఎవరో తెలపాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని కేటీఆర్ శనివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

'సుంకిశాల' బాధ్యత మెఘాదే

- ప్రభుత్వం కావాలనే దాచిపెట్టింది
- ప్రజాధనం, ప్రాణాలతో సర్కార్, మెఘా ఆటలాడుతున్నయ్
- బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదం బాధ్యత నిర్మాణ సంస్థ మెఘాదేనని బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. అసెంబ్లీలోని బీజేఎల్పీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సుంకిశాల ప్రాజెక్టులో ఈ నెల 2న ఉదయం ప్రమాదం జరిగిందని, అప్పుడు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. నాసిరకం నిర్మాణం వల్లే ప్రమాదం జరిగినట్టు అధికారులు చెప్తున్నారని, గత ప్రభుత్వ తప్పిదం వల్లే జరిగిందని చెప్పి మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉన్న మున్సిపల్ శాఖ పరిధిలోకి వస్తుందని, అయినా ప్రాజెక్టు నిర్మాణ నాణ్యతను కొత్త ప్రభుత్వం ఎందుకు పర్యవేక్షించలేదని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యమని విమర్శించారు. ప్రాజెక్టులన్నీ ఒక్క కంపెనీకే కట్టబెడుతున్నారంటూ గతంలో కాంగ్రెస్ విమర్శించిందని, ఇప్పుడు కాంగ్రెస్ అదేపని చేస్తున్నదని ఆరోపించారు. అమృత్ పథకం కింద కేంద్రం ఇచ్చిన పనులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మెఘా సంస్థకు కట్టబెట్టిందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో నిర్మించబోయే కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టును కూడా ఆ కంపెనీకి ఇస్తారనే ప్రచారం జరుగుతున్నదని తెలిపారు. సుంకిశాల ప్రాజెక్టు పాక్షికంగా కూలిన ఘటనను గోప్యంగా ఉంచడంలో బాధ్యులెవరో తేల్చి, వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాని, ప్రమాద విషయాన్ని మెఘా కంపెనీ ప్రభుత్వం దృష్టికి తెచ్చిందా? లేదా? అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని, ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.



బీసీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కులగణన చేపట్టకుంటే అగ్నిగుండమే

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ, ఆగస్టు 10: తెలంగాణలో కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్రం అగ్ని గుండమే అవుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం హెచ్చరించారు. హైదరాబాద్ శనివారం బీసీ సంఘాలు, కుల సంఘాలతో ఏర్పాటైన సమావేశంలో సత్యం మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే ఎంపీ ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో అడ్డుకుంటామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఆనాడు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జీ మల్లేశ్‌యాదవ్, నందగోపాల్, రామకృష్ణ, ఉదయ్‌నేత తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచకుంటే అల్లకల్లోలమే

- రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యంపై ఐక్యపోరాటం
- 42 % బీసీ రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే
- ఆర్ కృష్ణయ్య సహా బీసీ ప్రజాప్రతినిధులు
- హైదరాబాద్ ధర్నాచౌక్‌లో బీసీల సత్యాగ్రహ దీక్ష



ధర్నాచౌక్‌లో బీసీ సత్యాగ్రహ దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, ఆర్ కృష్ణయ్య, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, వినయ్‌భాస్కర్ తదితరులు

చిక్కడపల్లి, ఆగస్టు10: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేంత వరకు పోరాడుదామని పలువురు బీసీ నేతలు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను కచ్చితంగా అమలు చేయాలని వారంతా ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. బీసీ జనసభ, హిందూ బీసీ మహాసభ, సోషల్ జస్టిస్ పార్టీ, ఆలిండియా ఓబీసీ జాక్ తదితర బీసీ సంఘాల ఆధ్వర్యంలో సమగ్ర కుల జనగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం శనివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో బీసీల సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయకపోతే రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందని బీసీ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. బీసీలకు రిజర్వేషన్ ఇవ్వడంలో రేవంత్‌రెడ్డి సర్కారు నిర్లక్ష్యం చూపుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 2 కోట్ల మంది బీసీలకు వ్యతిరేకంగా పోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని స్పష్టం చేశారు. బీసీల లెక్కలు తీస్తే రాజ్యాధికారం వారికే పోతుందని పాలకుల్లో భయం పట్టుకుందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. కాంగ్రెస్ హామీ మేరకు స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తనకు సీఎం కంటే బీసీలే ముఖ్యమని, అవసరమైతే బీసీల కోసం పదవులు త్యాగం చేయడానికైనా సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలని కోరారు. కాంగ్రెస్ బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమగ్ర కుల జనగణన చెపట్టాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకపోతే ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేంత వరకు పోరాడాలని మాజీ ప్రభుత్వ విప్ వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. సాయంత్రం రాజారాం యాదవ్, మాజీ మత్రి శ్రీనివాస్ గౌడ్, ఇతర బీసీ నేతలకు ఆర్ కృష్ణయ్య నిమ్మరసం ఇచ్చి వారి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో బీసీ నేతలు డాక్టర్ వినయ్‌కుమార్, జస్టిస్ చంద్రకుమార్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, జూలూరి గౌరీశంకర్, ముఠా జయసింహ తదితరలు హాజరయ్యారు.



జనగామ జిల్లా చిల్పూరు మండలం శ్రీపతిపల్లిలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డిని ముందస్తు అరెస్టు చేస్తున్న పోలీసులు

శ్రీపతిపల్లిలో బీఆర్‌ఎస్ నేత అరెస్ట్

- ఎమ్మెల్యే కడియం శ్రీహరిని అడ్డుకుంటారనే అదుపులోకి
- గ్రామదేవతకు కొండా దంపతుల మొక్కు చెల్లింపు వాయిదా
- ముందస్తు అరెస్టులతో ఉద్రిక్తత

జనగామ, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): జనగామ జిల్లా చిల్పూరు మండలం శ్రీపతిపల్లి మాజీ సర్పంచ్ ప్రత్యూషరెడ్డి భర్త, బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి సహా మరో ఇద్దరు నాయకులను శనివారం పోలీసులు ముందుస్తుగా అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఐదేండ్ల క్రితం శ్రీపతిపల్లి మాజీ సర్పంచ్ ప్రత్యూషామనోజ్‌రెడ్డి ఇంట్లో సినిమాషూటింగ్ చేశారు. ఆ సమయంలో గ్రామ దేవతకు రూ.6 లక్షల బంగారు ఆభరణాలు బహూకరిస్తామని కొండా దంపతులు అప్పట్లో హామీ ఇచ్చారు. శుక్రవారం దుర్గామాతకు ఆభరణాలు సమర్పించి మొక్కు చెల్లించుకోవాల్సి ఉండగా వారి పర్యటన రద్దయింది.

స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. కొండా దంపతులను అడ్డుకున్నారని మనోజ్‌రెడ్డి ఓ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా వైరల్ అయింది. మాతృవియోగం చెందిన శ్రీపతిపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేశ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు శనివారం కడియం శ్రీహరి గ్రామ పర్యటన ఖరారైంది. ఈ క్రమంలో కడియంను బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించే అవకాశం ఉన్నదనే సమాచారంతో పోలీసులు మనోజ్‌రెడ్డితోపాటు స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రంగు హరీశ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పంగా సురేశ్‌ను ముందుస్తుగా అదుపులోకి తీసుకొని గృహ నిర్బంధం చేశారు. ఆ తర్వాత ఈ ముగ్గురిని రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మనోజ్‌రెడ్డిని అన్యాయంగా అరెస్టు చేశారని, ఆయనకు ఏమైనా హాని జరిగితే కడియం శ్రీహరి బాధ్యత వహించాల్సి వస్తుందని అతని భార్య ప్రత్యూషరెడ్డి మాట్లాడిన ఓ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది. దీంతో పోలీసులు మనోజ్‌రెడ్డి, రంగు హరీశ్, పంగా సురేశ్‌ను చిల్పూరు పోలీస్‌స్టేషన్‌లో బైండోవర్ చేసి విడుదల చేశారు. కడియం ఒత్తిడితోనే బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేసి ఇబ్బంది పెట్టారని ఆరోపిస్తూ గ్రామస్థులు పోలీసులకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగడంతో స్థానికంగా కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొన్నది.

బీఆర్‌ఎస్‌తో విలీన చర్చలు అబద్ధం

కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం పై చర్చలు జరుగుతున్నాయని వస్తున్న వార్తలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి,బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ కొట్టిపడేశారు. శనివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత బెయిల్‌కు, బీజేపీకి సంబంధం లేదని, కోర్టు విషయాలను పార్టీతో ముడిపెట్టవద్దని కోరారు. ప్రస్తుతం కేంద్ర నిధులతోనే పంచాయతీలు నడుస్తున్నాయని తెలిపారు. పంచాయతీలకు కేంద్రమే నిధులు ఇస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పటికైనా చెప్పడం శుభ పరిణామమని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల భూముల కొనుగోలు దందా బాధ్యతను ఓ కాంగ్రెస్ నేతకు అప్పగించారని విమర్శించారు. కాంగ్రెస్‌లో లుకలుకలు మొదలయ్యాయని చెప్పారు.వక్ఫ్ బోర్డు భూములను కాంగ్రెస్, ఎంఐఎం నేతలు చాలా చోట్ల కబ్జా చేశారని ఆరోపించారు. ఎన్ని వక్ఫ్ బోర్డు భూములను కాపాడారో అసదుద్దీన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు భూములను ఎంతమంది పేద ముస్లింలకు ఇచ్చారో చెప్పగలరా? అని నిలదీశారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందితే వాస్తవాలన్నీ బయటకు వస్తాయని చెప్పారు.

త్రిశంకు స్వర్గంలో టీవీవీపీ!

- ఇప్పటికీ సొసైటీగానే కొనసాగింపు
- వేతనాల జాప్యంతో 7 వేల మంది ఉద్యోగుల అవస్థలు
- 'డైరెక్టరేట్'గా మార్పుపై ప్రభుత్వం పూటకో మాట
- గతంలో చివరి దశకు తీసుకొచ్చిన బీఆర్‌ఎస్ సర్కారు

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): వైద్య సిబ్బందియందు తెలంగాణ వైద్య విధాన పరిషత్తు (టీవీవీపీ) సిబ్బంది వేరయా.. వినడానికి విచిత్రంగా ఉన్నా ఇదే నిజం. టీవీవీపీ ఉద్యోగులు ఇప్పటికీ సొసైటీ కిందే ఉన్నారు. దీంతో సమయానికి వేతనాలు అందక, పదవీ విరమణ ప్రయోజనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఒకటో తేదీనే జీతాలు వేస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నా.. టీవీవీపీ ఉద్యోగులకు మాత్రం దక్కని పరిస్థితి. ఈ నెలలో శనివారం నాటికీ ఉద్యోగులకు వేతనాలు అందలేదు. సోమవారం (12న) వారి ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు చెప్తున్నారు. ప్రతి నెల మిగతా వైద్యసిబ్బందికన్నా వారం పదిరోజులు ఆలస్యంగా వేతనాలు అందుతున్నాయి. వైద్యారోగ్యశాఖ పరిధిలో అనేక విభాగాలు ఉండగా.. ప్రధానంగా డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్), డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), టీవీవీపీ పనిచేస్తున్నాయి. ప్రస్తుతం టీవీవీపీ కింద సుమారు 7 వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారు. తమను ప్రభుత్వ పరిధిలోకి తీసుకొని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్)గా మార్చాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఫైల్ చివరి దశలో ఉన్నా.. నిర్ణయం తీసుకోవడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తున్నది.ఓవైపు టీవీవీపీని డీఎస్‌హెచ్‌గా మారుస్తామని చెప్తూనే.. మరోవైపు టీవీవీపీని, డీపీహెచ్‌ను విలీనం చేస్తామని, వైద్యసేవలన్నింటినీ ఒకే గొడుగు కిందికి తెచ్చి కొత్త డైరెక్టరేట్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెప్తుండటంతో ఉద్యోగులు త్రిశంకు స్వర్గంలో ఊగిసలాడుతున్నారు.

చివరి దశకు ఫైల్..

ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు 1987 మార్చి 1న ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్తు (ఏపీవీవీపీ) ఏర్పాటయ్యింది. రాష్ట్ర విభజన అనంతరం టీవీవీపీగా ఆవిర్భవించింది. మొదటి నుంచీ సొసైటీగానే కొనసాగుతున్నది. మిగతా వైద్యసిబ్బందితో సమానంగా సేవలు అందిస్తున్నా.. తమకు వారితో సమానంగా వేతనాలు, పదవీ విరమణ ప్రయోజనాలు అందటం లేదని, ప్రభుత్వంలో విలీనం చేయాలని టీవీవీపీ సిబ్బంది కోరుతున్నారు. ఏపీలో గత ఏడాది ఆగస్టులో ఏపీవీవీపీని ప్రభుత్వం డీఎస్‌హెచ్‌గా మార్చింది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుడు టీవీవీపీని ప్రభుత్వంలో విలీనం చేయటంపై సెప్టెంబర్‌లో కమిటీని నియమించింది. దీనికి డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ చైర్మన్‌గా, డీఎంఈ, డీపీహెచ్ సభ్యులుగా, టీవీవీపీ కమిషనర్ సభ్య కార్యదర్శిగా వ్యవహరించారు. ఈ కమిటీ పలు దఫాలుగా చర్చలు జరిపిన అనంతరం ప్రభుత్వానికి నవంబర్‌లో నివేదిక అందజేసింది. టీవీవీపీని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చాలని సిఫారసు చేసింది. ఉద్యోగులకు సంబంధించిన ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని సూచించింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదు. నివేదికను అమలు చేయాలంటూ టీవీవీపీ ఉద్యోగులు ప్రభుత్వం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డీఎస్‌హెచ్ ఏర్పాటు చేయాలని, సమయానికి వేతనాలు అందించాలని కోరుతున్నారు.

ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

- ఐదుగురు సిబ్బందికి మెమోలు జారీ
- 'రోగికి గడువు తీరిన సెలైన్' ఫలితం
- విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు: కలెక్టర్
- 'నమస్తేతెలంగాణ' కథనానికి స్పందన

ఖానాపూర్ టౌన్, ఆగస్టు 10: నిర్మల్ జిల్లా ఖానాపూర్ సామాజిక దవాఖానలో కాలం చెల్లిన సెలైన్ ఎక్కించిన ఘటనలో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో పాటు ఐదుగురు సిబ్బందికి మెమోలు జారీ చేశామని కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'రోగికి గడువు తీరిన సెలైన్' శీర్షికన శనివారం 'నమస్తే తెలంగాణ'లో వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన కలెక్టర్.. ఘటనపై విచారణ చేపట్టాలని డీఎంహెచ్‌వో రాజేందర్, డీసీహెచ్ఎస్ సురేశ్‌ను ఆదేశించారు. నివేదిక ఆధారంగా ఫార్మసిస్టు సునీత, స్టాఫ్ నర్సు చంద్రకళను విధుల నుంచి తొలగించినట్టు తెలిపారు. దవాఖాన పర్యవేక్షకుడు వంశీ, ఫార్మసిస్టులు శ్రీనివాసాచారి, విజయ్‌కుమార్, వెంకటేశ్, కల్యాణిలకు మెమోలు జారీ చేసినట్టు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతమవకుండా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ దవాఖానల నిర్వహణ, మెరుగైన వైద్య సేవలు అందించేందుకుఅందించేందుకు కమిటీలు ఏర్పాటుచేస్తామని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

పీఏసీఎస్ సీఈవో, కంప్యూటర్ ఆపరేటర్ సస్పెండ్

- 'ఒకరి ఆధార్.. మరొకరికి రుణం' తప్పిదానికి ఫలితం
- రుణమాఫీకి ఆధార్ వివరాల నమోదులో పొరపాట్లు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి అధికారుల స్పందన

నల్లబెల్లి, ఆగస్టు 10: రైతు రుణమాఫీకి సంబంధించి ఆధార్ మిస్‌మ్యాచ్‌కు కారకులైన ఇద్దరు పీఏసీఎస్ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల పీఏసీఎస్ కార్యాలయంలో డీసీసీ బ్యాంకులో రుణాలు పొందిన రైతుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడంలో అనేక పొరపాట్లు జరిగాయి. ఒకరి ఆధార్ మరో రైతు బ్యాంకు ఖాతాకు మిస్‌మ్యాచ్ కావడంతో కొంతమంది రైతులు రుణమాఫీకి నోచుకోలేదు. దీనిపై 'నమస్తే తెలంగాణ' జూలై 30న 'ఒకరి ఆధార్.. మరొకరికి రుణం' శీర్షికతో మెయిన్‌లో కథనాన్ని ప్రచురించింది. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆధార్ మిస్‌మ్యాచ్‌పై విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ నమోదులో జరిగిన అవకతవకలతో రుణమాఫీకి అనర్హులుగా మారిన రైతులను గుర్తించి సరైన ఆధార్ నంబర్లను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరింది. కలెక్టర్ పీఏసీఎస్ కార్యాలయానికి విచారణ అధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ కీరూనాయక్‌ను నియమించారు. ఆధార్ మిస్‌మ్యాచ్‌కు పీఏసీఎస్ సీఈవో మొగిలితోపాటు కంప్యూటర్ ఆపరేటర్ వైనాల రాజును కారకులుగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీంతో సీఈవో, కంప్యూటర్ ఆపరేటర్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రుణమాఫీ సంగతేంది?




ఆధార్ మిస్‌మ్యాచ్‌కు కారుకులను సస్పెండ్ చేయడం సరే గానీ.. రుణమాఫీ సంగతేంది? ప్రభుత్వం ఆగమేఘాల మీద ఇచ్చిన ఆదేశాలతో ఆధార్ నమోదు ప్రక్రియలో పీఏసీఎస్ సిబ్బంది పొరపాట్లు చేసింది. దీంతో మాకు రుణమాఫీ కాలేదు. బాధ్యులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదు. నాలాంటి వారికి రుణమాఫీ వర్తించేలా చర్యలు చేపట్టాలి.

-బాధిత రైతు, సమ్మయ్యనాయక్, ముచ్చింపుల తండా

కార్మికశక్తిలో తెలంగాణ జోరు

- పలు అంశాలలో జాతీయ సగటు కంటే ఉన్నతం
- తెలంగాణలో కార్మికుల భాగస్వామ్యం 66.5 శాతం
- జాతీయ సగటు 61.6 శాతానికే పరిమితం



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కార్మిక శక్తి పుష్కలంగా ఉన్నది. లేబర్ మార్కెట్ సూచికల్లో రాష్ట్ర కార్మిక శక్తి జోరును ప్రదర్శిస్తున్నది. నిరుద్యోగిత, పురుషుల కార్మిక శక్తి అంశాల్లో మినహా మిగతా అన్ని అంశాల్లో జాతీయ సగటు కంటే ఉన్నతస్థాయిలో సాగుతున్నది. 2024-25 సామాజిక ఆర్థిక గణాంకాల ప్రకారం.. తెలంగాణ లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు (ఎల్ఎఫ్‌పీఆర్) జాతీయ సగటు (61.6%)ను అధిగమించి 66.5 శాతానికి చేరింది. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎంతో దోహదపడుతున్నది. పీరియాడిక్ లేబర్ సర్వే ప్రకారం.. మహిళా శక్తిలో జాతీయ సగటు 39.8 శాతంగా, తెలంగాణలో 50.4 శాతంగా ఉన్నది. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో మహిళా ఎల్ఎఫ్‌పీఆర్ 64.4% కాగా.. జాతీయ సగటు 44.3% మాత్రమే. రాష్ట్రంలో పురుషుల ఎల్ఎఫ్‌పీఆర్ 81.8 శాతంగా నమోదవగా..జాతీయ సగటు 83.2 శాతంతో కాస్త మెరుగ్గా ఉన్నది.

తెలంగాణలో 63.4% మందికి ఉపాధి

ఉపాధి పొందిన వ్యక్తుల శాతాన్ని డబ్ల్యూపీఆర్ సూచిస్తుంది. ఇది తెలంగాణలో 63.4 శాతంగా, జాతీయ సగటు 59.5 శాతంగా ఉన్నది. నిరుద్యోగ రేటు విషయంలో తెలంగాణ (4.6%) కంటే జాతీయ సగటు (3.4%) మెరుగ్గా ఉన్నది. రాష్ట్రంలోని వయోజనుల్లో 47.3% మంది వ్యవసాయంలో నిమగ్నమై ఉండగా.. 33% మందికి సేవా రంగం, 19.7% మందికి పారిశ్రామిక రంగం ఉపాధిని కల్పిస్తున్నాయి.

లేబర్ మార్కెట్ అంటే

జాబ్ మార్కెట్‌నే లేబర్ మార్కెట్ అని అంటారు. ఒక దేశం లేదా ప్రాంతంలో కార్మికులు/ఉద్యోగులకున్న డిమాండ్, వారి సరఫరాను జాబ్‌మార్కెట్‌గా చెప్తారు. ప్రతి దేశానికి లేబర్ మార్కెట్ ఎంతో కీలకం. జాబ్ మార్కెట్‌లో కంపెనీలు, సంస్థలు(ఎంప్లాయర్స్) డిమాండ్‌ను సృష్టిస్తే.. కార్మికులు/ఉద్యోగులు (ఎంప్లాయీస్) ఉత్పత్తిని అందిస్తారు.

2024-25 సామాజిక, ఆర్థిక గణాంకాల ప్రకారం..

	తెలంగాణలో (%)	జాతీయ సగటు (%)
మహిళా ఎల్ఎఫ్‌పీఆర్	50.4	39.8
పురుషుల ఎల్ఎఫ్‌పీఆర్	81.8	83.2
కార్మిక జనాభా నిష్పత్తి	63.4	59.5
నిరుద్యోగిత	4.6	3.4



కాంగ్రెస్‌లో రాజ్యసభ రగడ

- తెరపైకి అభిషేక్ సింఘ్వీ పేరు
- సీనియర్లకు సీఎం రేవంత్ చెక్
- రగిలిపోతున్న ఆశావహులు
- అందెశ్రీకి ఆఫర్ ఏమైనట్టు?
- సింఘ్వీతో లాభం ఎవరికి?

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో రాజ్యసభ రగడ కొనసాగుతున్నది. సీనియర్ నేత కే కేశవరావు రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, కేశవరావు ఎంపీ పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడం, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులు కావడంతో ఆ స్థానం కోసం ఆశలు పెట్టుకున్న సీనియర్లు ఆకస్మికంగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ పేరు తెరపైకి రావడంతో కంగుతిన్నారు. దశాబ్దాలుగా పార్టీనే నమ్ముకొని, పార్టీ కోసం పనిచేసిన వారిని కాదని ఇతర రాష్ట్రాల నేతలకు అవకాశం ఇవ్వడం ఏమిటని సీనియర్లు ప్రశ్నిస్తున్నారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జైరాం రమేశ్‌కు ఉమ్మడి రాష్ట్ర నుంచి రాజ్యసభకు అవకాశం కల్పించినట్టే, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అధిష్ఠానం భుజాల మీద తుపాకీ పెట్టి రాష్ట్రంలోని సీనియర్ల ఆశలపై కాల్పులు జరిపారని ఆశావహులు మండిపడుతున్నారు.

ఒక్కొక్కరినీ తప్పిస్తూ..



అభిషేక్ మను సింఘ్వీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిష్ఠానంతో నేరుగా సంబంధాలున్న పార్టీ సీనియర్ నేతలెవరినీ ఆ ఛాయలకు కూడా పోనివ్వని రీతిలో వ్యవహరిస్తున్నారనే ప్రచారం సాగుతున్నది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి తెరవెనుక క్రియాశీలకంగా పనిచేసిన పార్టీ సీనియర్ నేతలు, ఇతర ముఖ్యులకు వారి వారి స్థాయిని బట్టి పెద్దల సభకు పంపుతామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో హామీ ఇచ్చారు. మాజీ ఎంపీలు రామసహాయం సురేందర్‌రెడ్డి, వీ హన్మంతరావు, మాజీ మంత్రులు కోదండరెడ్డి, జానారెడ్డి సహా పలువురు పార్టీ నేతలు రాజ్యసభ స్థానం ఆశిస్తున్నారు. ఇప్పటికే రామసహాయం సురేందర్‌రెడ్డి కొడుకు ఖమ్మం ఎంపీగా ఎన్నికకాగా, జానారెడ్డి ఇద్దరు కుమారుల్లో ఒకరు ఎంపీగా, మరొకరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కేకే ఖాళీ చేసిన స్థానానికి తమ పేరును పరిశీలించాలని వీ హన్మంతరావు, కోదండరెడ్డి సహా పలువురు నేతలు అధిష్ఠానాన్ని కోరుతున్నారు. అందరి అంచనాలను తారుమారు చేస్తూ.. అభిషేక్ మను సింఘ్వీని రాష్ట్రం నుంచి రాజ్యసభకు పంపిస్తామని స్వయంగా రేవంత్‌రెడ్డే అధిష్ఠానానికి హామీ ఇచ్చారని ప్రచారం జరుగుతున్నది.

సింఘ్వీతో లాభం ఎవరికి?

అభిషేక్ మను సింఘ్వీ పేరు రాష్ట్రం నుంచి రాజ్యసభకు తెరపైకి రావడంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో ఆసక్తికరమైన చర్చ సాగుతున్నది. దేశంలో ప్రముఖ న్యాయవాదిగా అభిషేక్‌కు పేరున్నది. దేశంలో అతి చిన్న వయసులోనే భారత అదనపు సోలిసిటర్ జనరల్‌గా పనిచేసిన రికార్డు ఉన్నది. ఇటువంటి న్యాయకోవిదుడిని రాష్ట్రం నుంచి రాజ్యసభకు నామినేట్ చేయడానికి అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటే తమకేం అభ్యంతరం లేదని, అదే సమయంలో తమకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరే హక్కు తమకు ఉన్నదని పార్టీ సీనియర్ నేతలు పేర్కొంటున్నారు. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే ఈ పేరును సూచించడంలో 'ఓటుకు నోటు కేసు' వ్యవహారం దాగున్నదనే ప్రచారం గాంధీభవన్ సహా పార్టీ సీనియర్ నేతల్లో జోరుగా సాగుతున్నది.

అందెశ్రీకి ఆఫర్ ఏమైనట్టు?

ఎన్నికల సమయంలో కోదండరాంరెడ్డి, అందెశ్రీలకు రాజ్యసభ ఎంపీలుగా అవకాశం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు సమాచారం. 'ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సరే మీ ఇద్దరినీ నా రెండు కండ్లుగా భావిస్తా. దేశంలో మేధావులు, వివిధ రంగాల విషయ నిపుణులు ఉండే స్థానంలో మిమ్మల్ని నిలబెట్టే పూచీ నాదీ' అని వారికి పరోక్షంగా రాజ్యసభ ఆఫర్ చేశారని ఉద్యమకారులు చెప్తున్నారు. సీఎం తన వైపు నుంచి ఎమ్మెల్సీ పదవికి క్లియర్ చేసినా, గవర్నర్ దగ్గర ఫైల్ ఉన్న నేపథ్యంలో కోదండరాంకు ఏమనాలో పాలుపోని పరిస్థితి నెలకొన్నది. కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాళ కాకపోయినా, రేపు పక్కా అనే వాతావరణం నెలకొనడంతో తరువాత స్థానం అందెశ్రీది అని ఉద్యమకారులు భావించారు. ఎన్టీఆర్ హయాంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సీ నారాయణరెడ్డిని రాజ్యసభకు నామినేట్ చేసినట్టే, అందెశ్రీకి కూడా ఆ అవకాశం తప్పకుండా లభిస్తుందని ఆశించారు. అయితే, ఆకస్మికంగా అభిషేక్ మను సింఘ్వీ పేరు తెరపైకి రావడం, ఆ పేరును సూచించిందే సీఎం రేవంత్‌రెడ్డి అని ప్రచారం కొనసాగడంతో అటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు, ఇటు ఉద్యమకారులు ఒక్కసారిగా విస్మయానికి గురవుతున్నారు.

నేడు 'సీతారామ' ట్రయల్ రన్

- 15న సీఎంతో మూడు పంప్‌హౌజ్‌ల ప్రారంభం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ట్రయల్‌రన్‌ను ఆదివారం నిర్వహిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఈ నెల 15న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్టుకు చెందిన మూడు పంప్‌హౌజ్‌లను ప్రారంభించనున్నట్టు తెలిపారు. సచివాలయంలో శనివారం సీతారామ ప్రాజెక్టుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. 15న ఖమ్మం జిల్లా వైరాలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 67 టీఎంసీల గోదావరి జలాలను కేటాయించాలని కోరుతూ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందని, సుప్రీంకోర్టుతోపాటు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖల అనుమతులపై దృష్టి సారించాలని సూచించారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, సహాయ కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్సీ అనిల్‌కుమార్, డిప్యూటీ ఈఎన్సీ శ్రీనివాస్ పాల్గొన్నారు.





మేడిగడ్డ బరాజ్ వద్ద దిగువకు వెళ్తున్న నీరు; రాజన్నసిరిసిల్ల జిల్లా తిప్పాపూర్‌లోని అన్నపూర్ణ పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి బయటకు దుంకుతున్న కాళేశ్వరం జలాలు

కొనసాగుతున్న ఎత్తిపోతలు

నంది రిజర్వాయర్‌లోకి 3,150 క్యూసెక్కుల ఎత్తిపోత.. సాగర్‌కు సందర్శకుల తాకిడి

ధర్మారం/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 10: కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. దిగువన పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌కు జలాలు చేరుతుండగా, శనివారం ఒక మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. ఇక్కడ కూడా ఒకే మోటర్ నడిపిస్తున్నారు. మొత్తం 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తూ శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు ఎల్లంపల్లి నుంచి 13 టీఎంసీలకుపైగా జలాలు మధ్య మానేరుకు తరలించినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మధ్యమానేరు జలాశయంలో 27.54 టీఎంసీల నీటి సామర్థ్యానికిగాను ప్రస్తుతం 17.06 టీఎంసీల నీటి నిలువ ఉన్నట్టు అధికారులు తెలిపారు. మధ్య మానేరు నుంచి సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరిలోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు నీటిని తరలిస్తున్నారు. మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా, ఇక్కడ పంప్‌హౌస్‌లో రెండు బాహుబలి మోటర్ల ద్వారా 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి చేరుకుంటున్నాయి. ఇక్కడ జలాశయం గేట్లు తెరిచి అంతే మొత్తంలో రంగనాయకసాగర్‌కు వదులుతున్నారు. అన్నపూర్ణ జలాశయంలో 3.5 టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం 1.25 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

సాగర్‌కు పోటెత్తుతున్న వరద

కృష్ణాకు వరద ప్రవాహం తగ్గడం లేదు. శనివారం జూరాల ప్రాజెక్టుకు 1.90 లక్షలు ఇన్‌ఫ్లో, 1.71 లక్షల అవుట్‌ఫ్లో నమోదైంది. శ్రీశైలం జలాశయానికి 1.86 లక్షల క్యూసెక్కుల వరద రాకతో 6 గేట్ల ద్వారా 2,23,142 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నాగార్జునసాగర్‌కు 3,55,590 క్యూసెక్కులు వస్తుండగా 26 క్రస్ట్‌గేట్లు ఎత్తి 3,12,756 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌లో కృష్ణమ్మ అందాలను వీక్షించేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. కాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్‌కు శనివారం 3,41,350 క్యూసెక్కుల వరద రాగా, మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నారు. అన్నారం బరాజ్‌కు 4 వేల క్యూసెక్కులు వస్తుండగా, మొత్తం 66 గేట్ల ద్వారా అంతే మొత్తంలో వదులుతున్నారు. కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి శనివారం సాయంత్రం 3.41లక్షల క్యూసెక్కుల మేర ప్రవహిస్తున్నది.



నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద సెల్ఫీ దిగుతున్న మహిళ

కోటి ఎకరాలకు రైతుభరోసా కోత!

మొదటిపేజీ తరువాయి...

సాయం అందజేస్తే, ఈ బడ్జెట్ కోటి ఎకరాలకు మాత్రమే సరిపోతుంది. దీంతో మిగిలిన భూమికి కోత పెట్టడం ఖాయమని స్పష్టమవుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి సీజన్‌లో 69 లక్షల రైతులకు సంబంధించిన 1.53 కోట్ల ఎకరాలకు రైతుబంధు అందజేసింది. ఏడాదికి సుమారు 3 కోట్ల ఎకరాలకు రైతుబంధు పంపిణీ చేసింది.

సీజన్‌కు 50 లక్షల ఎకరాలకు కోత!

బీఆర్ఎస్ ప్రభుత్వం సీజన్‌కు ఎకరానికి రూ.5 వేల (ఏడాదికి రూ.10 వేలు) చొప్పున ఏటా రూ.15 వేల కోట్లు రైతుల ఖాతాల్లో ఎటువంటి పైరవీలు, షరతులు లేకుండా జమ చేసింది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఈ మొత్తాన్ని సీజన్‌కు రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15 వేలకు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ లెక్కన ఒక్కో సీజన్‌కు 1.53 కోట్ల ఎకరాలకు రైతుభరోసా అందించేందుకు సుమారు రూ.11,475 కోట్లు, ఏడాదికి సుమారు రూ.23 వేల కోట్లు అవసరం. కానీ, బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు మాత్రమే కేటాయించడం గమనార్హం. ఈ లెక్కన ఏడాదికి రెండు కోట్ల ఎకరాలకు మాత్రమే రైతుభరోసా పంపిణీ చేయనున్నది. గతంతో పోల్చితే ఏడాదికి కోటి ఎకరాలకు కోత పెట్టనున్నది. సీజన్‌కు 50 లక్షల ఎకరాలకు రైతుభరోసా వచ్చే అవకాశం లేదు.

భరోసాకు పీఎం కిసాన్ నిబంధనలు!

ఇప్పటికే రుణమాఫీలో రేషన్‌కార్డు లేని వారికి, ఆదాయపు పన్ను చెల్లించేవారికి, ప్రభుత్వ ఉద్యోగులకు కోత పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇకపై రైతుభరోసాలోనూ కోత పెట్టేందుకు రంగం సిద్ధంచేస్తున్నది. ఈ పథకానికి కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం కిసాన్ నిబంధనలనే ప్రామాణికంగా తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. అంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయబోతున్నది! రేవంత్‌రెడ్డి సర్కార్ మోదీ ప్రభుత్వ మార్గాన్ని ఎంచుకుంటే.. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయ పన్ను చెల్లించేవారికి రైతుభరోసా రావడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతోపాటు రైతుభరోసా భూమికి సీలింగ్ పెట్టాలని కూడా ప్రభుత్వం భావిస్తున్నది. ప్రతి రైతుకు 5 ఎకరాలు లేదా 10 ఎకరాల సీలింగ్ విధించే అంశంపై ఆలోచన చేస్తున్నది. ఈ నిబంధన అమలు చేస్తే మరింత మందికి రైతుభరోసాలో కోత పడటం ఖాయం. కోతలపై ఇప్పటికే ప్రభుత్వం సబ్ కమిటీని ఏర్పాటుచేసి జిల్లాల్లో రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా అసెంబ్లీలో చర్చించిన తర్వాత రైతుభరోసా అమలుచేస్తామని ముఖ్యమంత్రి, మంత్రులు చెప్తున్నారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పటికీ కమిటీ రైతు భరోసాపై నివేదిక అందించలేదు. దీంతో ఈ అసెంబ్లీ సెషన్‌లో రైతుభరోసాపై చర్చ ఉంటుందా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతున్నది. దీనిపై ప్రభుత్వం కూడా ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడంతో అనుమానాలు పెరుగుతున్నాయి.

లైంగిక దాడిపై అలా అనలేదు

అధికారుల సమాచారాన్ని ప్రస్తావించా.. అంధబాలిక ఘటనపై మంత్రి సీతక్క



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): మలక్‌పేటలోని ప్రభుత్వ అంధబాలికల హాస్టల్లో బాలికపై లైంగిక దాడి జరగలేదని తాను అసెంబ్లీలో చెప్పినట్టు జరుగుతున్న ప్రచారాన్ని మంత్రి సీతక్క ఖండించారు. ఆ రోజు తనకు అధికారులిచ్చిన సమాచారాన్ని మాత్రమే ప్రస్తావించినట్టు తెలిపారు. తాను చెప్పిన మాటలను వక్రీకరించవద్దని హితవు పలికారు. ఇటువంటి సున్నితమైన అంశాల పట్ల బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. అంధబాలికపై లైంగిక దాడి కేసు పురోగతిని మంత్రి సీతక్క సచివాలయంలో శనివారం సమీక్షించారు. నిందితుడిని ఇప్పటికే అరెస్టు చేసినట్టు, దర్యాప్తును వేగవంతం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. విధుల్లో అలసత్వం వహించిన సిబ్బందిని తొలగించామని చెప్పారు.

కొత్త అంగన్‌వాడీలు మంజూరు చేయండి

ఏజెన్సీ ప్రాంతాల్లో కొత్త అంగన్‌వాడీ సెంటర్లను మంజూరు చేయాలని మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రులతో కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణాదేవి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాష్ట్రంలో అమలవుతన్న పథకాలను వివరించారు.



జలవిద్యుత్తు ఉత్పత్తిని పెంచండి: భట్టి

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో జల (హైడల్) విద్యుత్తు ఉత్పత్తిని పెంచాలని విద్యుత్తు శాఖ అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. అన్ని ప్లాంట్లల్లో గరిష్ఠ విద్యుత్తు ఉత్పత్తిని సాధించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కృష్ణా, గోదావరి పరివాహకం, ఇతర ప్రాంతాల్లో నమోదవుతున్న వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్తు ఉత్పత్తిని పెంచాలని తెలిపారు. శనివారం ప్రజాభవన్‌లో థర్మల్, హైడల్ విద్యుత్తు ఉత్పత్తి తీరుపై ఆయా శాఖల చీఫ్ ఇంజినీర్లతో సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ థర్మల్ పవర్ ప్రాజెక్టుల్లో 17 రోజుల విద్యుత్తు ఉత్పాదనకు సరిపడా బొగ్గు నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. విద్యుత్తు కేంద్రాల పరిస్థితి, ఉత్పాదనకు సంబంధించిన నివేదికలను వారానికోసారి తనకు పంపాలని ఆదేశించారు. సమస్యలుంటే వెంటనే విద్యుత్తుశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సమాచారాన్ని అందించాలని, సీఈలు నిర్లక్ష్యం వహిస్తే రాతపూర్వక వివరణ తీసుకోవాలని తేల్చిచెప్పారు. సమీక్షలో విద్యుత్తుశాఖ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస్‌రావు, ఓఎస్డీ సురేందర్‌రెడ్డి, జెన్‌కో డైరెక్టర్లు, సీఈలు పాల్గొన్నారు.



ఫైలేరియా నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ

- మంత్రి రాజనర్సింహ

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తున్నట్టు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆయుష్, వైద్యారోగ్య శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ నిర్వహించిన సమీక్షలో రాష్ట్రం నుంచి మంత్రి దామోదర హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపడుతున్న చర్యలను వివరించారు. సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాల్లోని 14 పీహెచ్‌సీల పరిధిలో ప్రజలకు బోదకాలు, నులిపురుగుల నివారణకు డీఈసీ, ఆల్బెండజోల్, ఐవర్‌మెక్టిన్ మాత్రల పంపిణీని ప్రారంభించారు. హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా పాల్గొన్నారు.

తెలంగాణలో టీడీపీని విస్తరిస్తాం: చంద్రబాబు

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో తెలుగుదేశం పార్టీని మళ్లీ విస్తరిస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం రాష్ట్రంలోని ముఖ్యనాయకులతో చర్చించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో టీడీపీ అభివృద్ధిపై సమాలోచనలు చేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణలో ఏ పార్టీతో పొత్తులో ఉంటాం.. ఏ కూటమిలో కొనసాగుతాం అనే విషయాలు ఇప్పుడే వెల్లడించలేనని అన్నారు.

నేను వేసిన పునాదుల వల్లే..

'ఆ రోజు నేను వేసిన పునాది వల్ల తెలంగాణ నేడు తలసరి ఆదాయంలో నంబర్ వన్‌గా నిలిచింది. నేను ఒక్కడ్నే చేశానని చెప్పడం లేదు.. నా తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు కూడా దాన్ని ముందుకు తీసుకెళ్లారు' అని చంద్రబాబు చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి మళ్లీ తెలంగాణ సీఎంను కలుస్తానని చెప్పారు.

కొండల్‌రెడ్డి బాకీ లేడు: డేవిడ్

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డి తన వద్ద 58,500 యూఎస్ డాలర్ల అప్పు తీసుకున్నట్టు యూట్యూబ్ వీడియోలో ఆరోపణలు చేసిన ఎన్నారై డేవిడ్ తాజాగా వివరణ ఇచ్చారు. కొండల్‌రెడ్డి మీద తాను చేసిన ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు. 'తెలంగాణలో ఎన్నికలకు ముందు కొందరు వ్యక్తులు ప్రలోభపెట్టడం వల్లే నేను వీడియో చేశాను. నా వయస్సు 80 ఏండ్లు. నేను మెడిసిన్ తీసుకుంటాను. అప్పుడప్పుడు అన్‌కాన్షియస్ ఉండటం వల్ల ఈ వీడియోను నేను చేయాల్సి వచ్చింది. కొండల్‌రెడ్డి నాకు ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సింది లేదు' అని తాజా వీడియోలో డేవిడ్ పేర్కొన్నారు.

గంజాయి మొక్కలో ఔషధ గుణాలు!


వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ వెల్లడి



వాషింగ్టన్, ఆగస్టు 10: గంజాయి మొక్కల్లో (కన్నాబిస్) ఔషధ గుణాలున్నాయా లేదా అనే అంశంపై అనేక ఏండ్లుగా పరిశోధనలు సాగుతున్నాయి. తాజాగా వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. దీనిపై 'సైంటిఫిక్ జర్నల్' కథనం ప్రకారం, గంజాయి మొక్క కాండం, పుష్పం..ఇలా వివిధ భాగాల నుంచి లభించే పదార్థాల్ని సైకోయాక్టివ్‌గా పేర్కొంటారు. ఇందులో నుంచి ఉత్పన్నం చేసిన 'కన్నాబిజిరోల్' (సీబీజీ) వినియోగంపై సైంటిస్టులు హ్యూమన్ ట్రయల్స్ నిర్వహించగా, ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. 34 మందిపై సీబీజీని ప్రయోగించగా, వారిలో ఆందోళన, ఒత్తిడి స్థాయిలు తగ్గాయి. అలాగే జ్ఞాపకశక్తి కూడా గణనీయంగా మెరుగుదల కనిపించిందని సైంటిస్టులు గుర్తించారు.

850 కోట్ల విలువైన కాలిఫోర్నియం సీజ్

బీహార్‌లో స్మగ్లింగ్ ముఠా అరెస్ట్



పాట్నా: ముగ్గురు సభ్యుల అక్రమ రవాణా ముఠాను అరెస్ట్ చేసిన బీహార్ పోలీసులు వారి నుంచి రూ.850 కోట్ల విలువైన 50 గ్రాముల రేడియో యాక్టివ్ పదార్థం 'కాలిఫోర్నియం'ను స్వాధీనం చేసుకున్నారు. గ్రాము దాదాపు రూ.17 కోట్లు పలికే ఈ పదార్థాన్ని అణు విద్యుత్తు కేంద్రాలు మొదలుకొని క్యాన్సర్ చికిత్స వరకు వివిధ రంగాల్లో వివిధ రూపాల్లో వాడుతుంటారు. తమ వద్దనున్న ఈ పదార్థాన్ని విక్రయించేందుకు కొన్ని నెలలుగా ఈ గ్యాంగ్ ప్రయత్నిస్తున్నట్టు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు బాల్‌ధారి చెక్‌పోస్టు వద్ద నిందితులను కాపుకాసి పట్టుకున్నారు. వారు తమను తాము ఐఐటీ మద్రాస్‌కు చెందిన వారిగా చెప్పుకున్నారని, నిందితుల వద్ద ల్యాబ్ టెస్ట్ రిపోర్టు కూడా ఉన్నదని గోపాల్‌గంజ్ ఎస్పీ స్వర్ణ్ ప్రభాత్ తెలిపారు. అయితే, ఐఐటీ మద్రాస్‌ను సంప్రదించిన తర్వాత వారు చెప్తున్నది అబద్ధమని తేలిందని పేర్కొన్నారు. కాలిఫోర్నియంను కొనడం, విక్రయించడం దేశంలో చట్టరీత్యా నేరం కావడంతో అసలు అది వారికి ఎలా దొరికింది? ఎవరు కొనుగోలు చేయబోతున్నారు? అన్నదానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. సీజ్ చేసిన పదార్థాన్ని పరీక్ష కోసం అణుశక్తి విభాగానికి పంపినట్టు తెలిపారు. మూడేండ్ల క్రితం లక్నోలో 8 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి 340 గ్రాముల కాలిఫోర్నియంను స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో ఆ పదార్థం గ్రాము విలువ రూ.19 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. కాగా, తాజా కేసులో అరెస్ట్ అయిన నిందితులు తమకు ఆ పదార్థాన్ని బొగ్గు గనిలో పనిచేసే వ్యక్తి ఇచ్చినట్టు తెలిపారు.

మహా విస్ఫోటనం వెంటనే విశ్వం అంతమయ్యేది!

బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం సరికాకపోవచ్చు



కాలిఫోర్నియా, ఆగస్టు 10: విశ్వం ఆవిర్భావం అంతు చిక్కని ప్రశ్నగా మారింది. సమాధానం కనుగొనేందుకు దశాబ్దాలుగా సైంటిస్టులు శోధిస్తున్నారు. మహా విస్ఫోటనం తర్వాత ప్రాథమిక మూలకాలు బోసన్ అనే రేణువుల సాయంతో ఒకదానితో ఒకటి ఢీకొని ద్రవ్యరాశి ఏర్పడిందనేది బిగ్ బ్యాంగ్(మహా విస్ఫోటనం) థియరీ. అయితే, ఈ సిద్ధాంతం తప్పు అయి ఉండవచ్చని మూలకాలు, దైవ కణాలు(హిగ్స్ బోసన్ పార్టికల్) ఆధారంగా చేసిన తాజా పరిశోధన చెప్తున్నది. లండన్ కింగ్స్ కాలేజీ పరిశోధకుల వాదన ప్రకారం, ఒకవేళ నిజమే అయితే మహా విస్ఫోటనం జరిగిన వెంటనే విశ్వం అంతమయ్యేది. విశ్వం ఆవిర్భావానికి సంబంధించి అన్ని సిద్ధాంతాలూ తప్పే అయ్యి ఉండాలి. ప్రాథమిక మూలకాలు అనేవే లేకపోయి ఉండాలి. విశ్వ అవిర్భావానికి కారణమేదో భౌతిక శాస్త్రం తెలుసుకోలేకపోతున్నది.

'ఖైదీ' ముద్ర.. ప్రజాస్వామ్యానికి సవాల్

- తన చేతిపై వేసిన గుర్తును షేర్ చేసిన జార్ఖండ్ సీఎం
- తనకే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితేమిటని ప్రశ్న



రాంచీ: జార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్ శనివారం తన పుట్టిన రోజు సందర్భంగా జైల్లో తన చేతిపై వేసిన 'ఖైదీ' ముద్రను ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఇది నా చేతిపై వేసిన స్టాంపే కాదు, దేశ ప్రజాస్వామ్యం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లకు ఒక చిహ్నమని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జైలు నుంచి విడుదలవుతున్న సమయంలో జైలు అధికారులు తన చేతిపై ఈ ముద్ర వేశారని తెలిపారు. ఎలాంటి ఆధారాలు, ఫిర్యాదులు, నేరం లేకుండా ప్రజలు ఎన్నుకొన్న ఒక సీఎంగా ఉన్న తనను 150 రోజుల పాటు జైల్లో ఉంచారని అన్నారు. తన పరిస్థితే ఇలా ఉంటే.. ఇక సామాన్య గిరిజనులు, దళితులు, అణగారిన వర్గాల ప్రజల విషయంలో ఏ విధంగా వ్యవహరిస్తారో ఇక చెప్పనవసరం లేదని అన్నారు. ఈ రోజు నుంచి అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం మరింత సమర్థవంతంగా పోరాడాలని సంకల్పించుకొన్నానని పేర్కొన్నారు. మతం, కులం, రంగు, అలవాట్లు ఇతరత్రా ఆధారంగా అణచివేత, అన్యాయానికి గురైన ప్రతి వ్యక్తి, ప్రతి వర్గం తరఫున తాను గొంతెత్తుతానని సొరేన్ తెలిపారు. చట్టం అందరికీ సమానమనేలా, అధికార దుర్వినియోగం లేని సమాజాన్ని నిర్మించుకొనేందుకు ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

మోదీ, షా రక్షణలో రాహుల్

పౌరసత్వం కేసులో సుబ్రమణ్య స్వామి విమర్శ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత నేత రాహుల్ గాంధీని బ్రిటిష్ పౌరసత్వం కేసులో కాపాడుతున్న ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్య స్వామి శనివారం హెచ్చరించారు. రాహుల్ 2003లో బ్రిటిష్ పౌరసత్వం తీసుకున్నారని, బ్యాక్‌ఆప్స్ అనే కంపెనీని లండన్‌లో ఏర్పాటు చేశారని, అందువల్ల ఆయన భారతీయ పౌరసత్వం చెల్లదని సుబ్రహ్మణ్య స్వామి ఆరోపిస్తున్నారు. రాహుల్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మోదీ, షాలను స్వామి ఎక్స్ పోస్ట్‌లో నిలదీశారు. ఈ అంశంపై తాను 2019లో విదేశాంగ శాఖకు చేసిన ఫిర్యాదు నకలును ఈ పోస్ట్‌లో జత చేశారు. అయితే, ఈ ఫిర్యాదు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాహుల్ గాంధీకి నోటీసు ఇచ్చినట్లు తెలుస్తున్నది.

బంగ్లా చీఫ్ జస్టిస్ రాజీనామా

- నిరసనకారుల సుప్రీం కోర్టు ముట్టడితో నిమిషాల్లో పదవికి ఒబైదుల్ హసన్ గుడ్‌బై
- పదవి నుంచి తప్పుకున్న బంగ్లా బ్యాంక్ గవర్నర్
- పలువురు జడ్జీలు, వీసీలు సైతం రాజీనామా
- తమపై దాడులకు నిరసనగా హిందువుల ఆందోళన



హసన్



ఢాకాలో సుప్రీంకోర్టు ఎదుట విద్యార్థుల ఆందోళన

ఢాకా, ఆగస్టు 10: బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు, సంక్షోభ పరిస్థితులు కొనసాగుతున్నాయి. మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా రాజీనామాకు ఒత్తిడి చేసి విజయవంతమైన నిరసనకారులు మిగతా ప్రధాన పదవుల్లో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకున్నారు. శనివారం ఉదయం వందలాది మంది నిరసనకారులు, విద్యార్థులు, న్యాయవాదులు సుప్రీంకోర్టు ప్రాంగణంలోకి చేరారు. గంట సేపట్లో ప్రధాన న్యాయమూర్తి రాజీనామా చేయాలని, లేకపోతే న్యాయమూర్తుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. దీంతో తప్పని పరిస్థితుల్లో బంగ్లాదేశ్ చీఫ్ జస్టిస్ ఒబైదుల్ హసన్ తన పదవికి రాజీనామా సమర్పించారు. న్యాయమూర్తుల భద్రత దృష్ట్యా తాను రాజీనామా చేసినట్టు ఆయన ప్రకటించారు. హసన్ రాజీనామా తమకు అందిందని పార్లమెంటరీ వ్యవహారాల సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ ఫేస్‌బుక్‌లో ప్రకటించారు. ఒబైదుల్ హసన్ తర్వాత మరో ఐదుగురు న్యాయమూర్తులు సైతం రాజీనామా చేశారు. కాగా, సుప్రీంకోర్టు ఫుల్ మీటింగ్ నిర్వహించేందుకు ప్రధాన న్యాయమూర్తి సిద్ధమయ్యారని, తాత్కాలిక ప్రభుత్వం చట్టవిరుద్ధమని ఆయన ప్రకటించాలని అనుకున్నారని నిరసనకారులు ఆరోపించారు. మరోవైపు, బంగ్లాదేశ్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అబ్దుల్ రౌఫ్ తాలుక్‌దర్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు బ్యాంకు ప్రాంగణంలో ఆందోళన చేశారు. ఢాకా యూనివర్సిటీ వీసీ మక్సూద్ కమల్, ఎస్‌యూఎస్‌టీ వీసీ ఫరీదుద్దిన్ అహ్మద్ సైతం రాజీనామా చేశారు.

మేమూ బెంగాలీలమే...

తమపై దాడులను నిరసిస్తూ బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో హిందువులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. తమపై, తమ ఆలయాలు, ఇండ్లపై జరుగుతున్న దాడులకు నిరసన తెలిపారు. తామూ బెంగాలీలమే అని, హిందువులకు కూడా బంగ్లాదేశ్‌లో నివసించే హక్కు ఉందని పేర్కొంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. హసీనా రాజీనామా తర్వాత హిందువులపై దాడులు జరిగాయి. ఒక హిందూ స్కూల్ టీచర్, ఇద్దరు కౌన్సిలర్‌లను అల్లరిమూకలు హతమార్చాయి. హిందువులు, ఇతర మైనారిటీలపై దాడులను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఖండించారు. దాడులు హేయమైనవని, హిందూ, క్రైస్తవ, బౌద్ధ కుటుంబాలకు రక్షణగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.

'హసీనాతో బలవంతంగా రాజీనామా చేయించలేదు'

షేక్ హసీనా రాజీనామా చేయలేదని, తలపై తుపాకీ గురిపెట్టి..పదవీ నుంచి దింపేశారని ఆమె కుమారుడు సాజీద్ వాజెద్ ఆరోపించారు. అయితే ఈ ఆరోపణల్ని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ) జనరల్ సెక్రెటరీ మీర్జా ఫక్రూల్ అలంగిర్ ఖండించారు. శనివారం భారత్‌కు చెందిన ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ఉండటమా? దేశాన్ని వీడటమా? అనే రెండు ఎంపికలు ఆ రోజు హసీనా ముందు ఉన్నాయని, దేశాన్ని వీడాలన్నది ఆమె నిర్ణయమని అలంగిర్ అన్నారు. మాజీ ప్రధాని ఖలీదా జియా ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నారని, ఆమె ఆరోగ్యం కుదటపడ్డాక ఎన్నికల్లో బీఎన్‌పీకి నేతృత్వం వహిస్తారని అన్నారు. దేశంలో హింస, అల్లర్లు హఠాత్తుగా సంభవించిన ఘటనలుగా పేర్కొన్నారు. తమ దేశ మాజీ ప్రధాని హసీనాకు ఆశ్రయం ఇచ్చే ముందు భారత దేశం ఆలోచించుకోవాలని అలంగిర్ అన్నారు. ఆమెకు ఆశ్రయం ఇవ్వడం వల్ల ప్రజల మధ్య సంబంధాలపై ప్రభావం పడుతుందని.. అన్ని దేశాలూ మనకు మిత్రులు కావాలని అన్నారు.

కశ్మీర్‌లో ఎదురుకాల్పులు

- ఇద్దరు సైనికుల మృతి

శ్రీనగర్, ఆగస్టు 10: ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు సైనికులు మరణించారు. అనంత్‌నాగ్ జిల్లా కోకెర్‌నాగ్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులున్నారనే సమాచారంతో శనివారం ఆర్మీ, జమ్ము కశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కలిసి సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. దీంతో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో నలుగురు సైనికులు, ఇద్దరు పౌరులకు గాయాలయ్యాయి. దవాఖానకు తరలించగా ఇద్దరు సైనికులు మరణించారు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు.

హిమాచల్‌లో ఆకస్మిక వరదలు

న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్‌లో శుక్రవారం సాయంత్రం నుంచి మళ్లీ భారీ వర్షాలు కురవడంతో ఆకస్మికంగా వరదలు పోటెత్తాయి. సహన్‌లో అత్యధికంగా 168.3 మిల్లీమీటర్లు, కందఘహట్టిలో అత్యల్పంగా 45.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. సహన్, సంధోల్, నగ్రోటా సూరియన్, ధౌలకువాన్ సహా పలుచోట్ల కొండ చరియలు విరిగిపడటంతోపాటు రోడ్లు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నెల 16 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

బద్రీనాథ్ హైవేపై కొండ చరియలు

ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాల వల్ల బద్రీనాథ్ జాతీయ రహదారిపై కొండ చరియలు విరిగిపడ్డాయి. కమెడ, నందప్రయాగ్, చిన్‌కా ప్రాంతాల్లో కొండ చరియలు పడటం వల్ల రాకపోకలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

లైంగిక సామర్థ్యం లేదని వివాహం రద్దు

ముంబై: ఆగస్టు 10(నమస్తే తెలంగాణ): తన భర్తకు శృంగార(లైంగిక) సామర్థ్యం లేక తనతో శారీరకంగా కలవలేకపోతున్నాడని పేర్కొంటూ ఓ యువతి బాంబే హైకోర్టును ఆశ్రయించగా, ఆ వివాహాన్ని కోర్టు రద్దు చేసింది. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌కు చెందిన యువకుడు, ఛత్రపతి శంభాజీనగర్‌కు చెందిన యువతికి మార్చి 13న వివాహం జరిగింది. మొదటి రాత్రి, హనీమూన్‌లో యువకుడు యువతిలో శృంగారంలో పాల్గొనకపోవడంతో యువతి మనస్తాపం చెందింది. ఇదేమని ప్రశ్నిస్తే.. శృంగారం తన వల్ల కాదని.. తనను వదిలేయాలని యువకుడు వేడుకున్నాడు. దీంతో యువతి బాంబే హైకోర్టును ఆశ్రయించింది. దీంతో కోర్టు వీరి వివాహాన్ని రద్దు చేసింది.

యూట్యూబ్ మాజీ సీఈవో సుసాన్ కన్నుమూత

న్యూఢిల్లీ, ఆగస్టు 10: యూట్యూబ్ మాజీ సీఈవో సుసాన్ వోజ్కికీ కన్నుమూశారు. 56 ఏండ్ల సుసాన్ గత రెండేండ్లుగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధ పడుతున్నారు. ఇంటర్నెట్‌ను రూపొందించడంలో, గూగుల్ చరిత్రలో ఆమె విశేష పాత్ర పోషించారు. 1990లో గూగుల్‌లో తన కెరీర్‌ను ప్రారంభించిన సుసాన్ యూట్యూబ్ సీఈవోగా 2014 నుంచి 2023 వరకు పనిచేశారు. గూగుల్ చరిత్రలో వోజ్కికీ అతి ప్రధానమైన వ్యక్తని, ఆమె లేని లోకాన్ని ఊహించడం కష్టంగా ఉందని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ సంతాపం వ్యక్తం చేశారు.

వయనాడ్ బాధితులకు తగిన సాయం: మోదీ

వయనాడ్: కేరళలోని వయనాడ్‌లో వరదలు, కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో ప్రధాని మోదీ శనివారం పర్యటించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు, బాధితులకు పునరావాసంపై కలెక్టరేట్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. బాధితులకు ఆర్థిక సాయం, పునరావాసం విషయంలో కేంద్రం తగిన సాయం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. సర్వస్వం కోల్పోయిన వారిని ఆదుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని తెలిపారు.



వైద్యురాలి హత్యకు నిరసనగా కోల్‌కతాలో జూనియర్ డాక్టర్లు, నర్సులు, మెడికల్ విద్యార్థుల ఆందోళన

వైద్యురాలిపై లైంగిక దాడి, హత్య

కోల్‌కతాలో దారుణం.. నిందితుడు అరెస్టు

కోల్‌కతా, ఆగస్టు 10: కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ శవ పరీక్ష నివేదిక వెలువడింది. ఆమెపై లైంగిక దాడి చేసిన అనంతరం హత్య చేసినట్టు అది నిర్ధారించింది. ఈ కేసులో ఒక నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడు హాస్పిటల్‌తో ఎలాంటి సంబంధం లేని బయటి వ్యక్తి అని, ఘటన జరిగిన రోజు అతను దవాఖానలోని అన్ని విభాగాలలో స్వేచ్ఛగా తిరిగాడని పోలీసులు శనివారం తెలిపారు. అతని కదలికలు అనుమానాస్పదంగా ఉన్నాయని, ఈ నేరంతో అతడికి ప్రత్యక్ష సంబంధం ఉన్నట్టు అనుమానిస్తున్నట్టు వారు చెప్పారు. అతడిని సెల్దా కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం 14 రోజుల పోలీస్ రిమాండ్‌కు ఆదేశించింది. ఛాతీ వైద్య విభాగంలో పీజీ రెండో సంవత్సరం విద్యార్థిని అయిన బాధితురాలు గురువారం రాత్రి డ్యూటీలో ఉండగా ఆమెను హత్య చేశారు. సెమినార్ హాల్‌లో అర్ధనగ్నంగా పడిఉన్న ఆమె దేహంపై గాయాల గుర్తులున్నాయి. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు డాక్టర్లను కూడా పోలీసులు విచారిస్తున్నారు. తన కుమార్తెపై అత్యాచారం చేసి హత్య చేశారని బాధితురాలి తండ్రి ఆరోపించారు. అయితే వాస్తవాలు కప్పిపుచ్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇది ఒక దురదృష్టకర ఘటన అని, హంతకుడికి ఉరి శిక్ష వేయించడానికి తమ ప్రభుత్వం వెనుకాడదని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు.



ప్లేట్లలో గుడ్లు పెట్టి వెంటనే లాగేసుకున్నారు

కర్ణాటకలో అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ సస్పెండ్

బెంగళూరు, ఆగస్టు 10: చిన్న పిల్లలకు పెట్టిన ఆహారాన్ని ఎవరైనా లాగేసుకుంటారా? కానీ కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఓ అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది ఆ పని చేశారు. కప్పాల్ జిల్లా కారంటాగి తాలూకా గుందుర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది చేసిన ఈ మోసంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. పిల్లల పట్ల అత్యంత అమానుషంగా వ్యవహరించిన అంగన్‌వాడీ హెల్పర్, వర్కర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. పిల్లలతో ప్రార్థన చేయించిన వెంటనే కొన్ని సెకన్ల వ్యవధిలో వారి ప్లేట్ల నుంచి గుడ్లను అంగన్‌వాడీ హెల్పర్, వర్కర్ తీసేసుకున్న తీరు వీడియోలో రికార్డైంది. పిల్లలకు గుడ్డు పెట్టామని చూపుకునేందుకే సిబ్బంది ఇలాంటి మోసం చేశారని తెలుసుకొని ప్రజలు అవాక్కయ్యారు.

కర్ణాటకలో 3 % హామీలే అమలు

- ప్రజారోగ్యం, విద్య, ఉపాధిపై నిర్లక్ష్యం
- కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలనపై 'సిటిజన్స్' సంస్థ నివేదిక
- మ్యానిఫెస్టో అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైందని విమర్శ



బెంగళూరు, ఆగస్టు 10: చేసిన వాగ్దానాలు కొండంత.. అమలు చేసినవి కూసింత.. ఇదీ కాంగ్రెస్ పాలిత కర్ణాటకలోని దుస్థితి. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఆ పార్టీ కేవలం మూడు శాతం వాగ్దానాలు మాత్రమే పూర్తిగా అమలు చేసింది. సిటిజన్స్ సంస్థ శుక్రవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. మొత్తం 59 వాగ్దానాల్లో కేవలం రెండింటిని మాత్రమే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రభుత్వం పూర్తిగా అమలు చేసిందని తెలిపింది. ఆ నివేదిక ప్రకారం అత్యంత ప్రధానమైన ప్రజారోగ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఇచ్చిన ఆరు హామీల్లో ఒక్కటీ అమలు పర్చలేదు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది, వైద్యుల ఖాళీలను భర్తీ చేస్తామని, జాతీయ రహదారి వెంబడి ప్రతి 100 కి.మీకు ఒక ట్రామా సెంటర్‌ను ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఏర్పాటు చేస్తామని ఇచ్చిన వాగ్దానాల మాటే సిద్ధరామయ్య ప్రభుత్వం మరిచిపోయింది. విద్యారంగంలో ఇచ్చిన ఏడు హామీల్లో ఒక్కటి, ఉపాధి రంగంలో 15 వాగ్దానాల్లో ఒక్కటి నెరవేర్చగా, పర్యావరణంపై చేసిన ఒక్క హామీ పేపర్‌కే పరిమితమైంది. పారిశ్రామిక రంగంలో 11 వాగ్దానాల్లో రిక్తహస్తమే మిగిల్చింది. బెంగళూరు అభివృద్ధికి చేసిన ఐదు హామీలు గాలిలో కలిసిపోయాయి. మ్యానిఫెస్టో అమలుపై కాం గ్రెస్‌కు చిత్తశుద్ధి కరువైందని సివిక్ బెంగళూరు సభ్యురాలు కాత్యాయనీ విమర్శించారు.

ప్రజలు నా మాట వినలేదనే రాజీనామా

రాజస్థాన్ మంత్రి కిరోడీలాల్ మీనా

జైపూర్: ప్రజలకు 45 ఏండ్ల నుంచి సేవ చేస్తున్నానని, అయినప్పటికీ వారు తన మాట వినలేదని, అందుకే తాను రాజస్థాన్ మంత్రి పదవికి రాజీనామా చేశానని బీజేపీ నేత కిరోడీ లాల్ మీనా చెప్పారు. ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా దౌసాలో ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్లను రద్దు చేస్తారనే వార్తలను ఖండించారు. ఈ విషయంలో తాను తన సమాజంతో కలిసి అంకితభావంతో పని చేస్తానని చెప్పారు. తూర్పు రాజస్థాన్‌లో ఏడు లోక్ సభ స్థానాలు ఉన్నాయి. వీటన్నిటిలోనూ బీజేపీ గెలుస్తుందని, కనీసం ఒక స్థానంలో బీజేపీ ఓడిపోయినా తాను రాష్ట్ర మంత్రి పదవికి రాజీనామా చేస్తానని ఆయన గతంలో ప్రకటించారు.



కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా సోమనాథన్

రాజీవ్ గౌబా స్థానంలో నియమించిన కేంద్రం

న్యూఢిల్లీ: కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి టీవీ సోమనాథన్‌ను కేంద్ర ప్రభుత్వం శనివారం నియమించింది. 1987 బ్యాచ్‌కు చెందిన తమిళనాడు క్యాడర్ అధికారి సోమనాథన్ ప్రస్తుతం ఆర్థిక కార్యదర్శిగా ఉన్నారు. రాజీవ్ గౌబా స్థానంలో క్యాబినెట్ కార్యదర్శిగా నియమితులైన ఆయన రెండేండ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. సోమనాథన్ 1987లో సివిల్స్‌లో 2వ ర్యాంకు సాధించారు. ఉత్తమ ప్రొబెషనరీ ఐఏఎస్‌గా బంగారు పతకాన్ని అందుకున్నారు. ఇంతకు ముందు పీఎంవోలో అదనపు కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా, ప్రపంచ బ్యాంకు డైరెక్టర్‌గా పని చేశారు.

2 వేల కోట్ల క్రిప్టో చోరుడు ఎక్కడ?

- ముమ్మరంగా నిఘా సంస్థల దర్యాప్తు
- లబోదిబోమంటున్న ఖాతాదారులు



ముంబై, ఆగస్టు 10: మన దేశంలో క్రిప్టో కరెన్సీ లావాదేవీలు ఎక్కువగా జరిగే వజీర్‌ఎక్స్ సంస్థలోని ఖాతాదారులకు గత నెలలో పెద్ద షాక్ తగిలింది. పలు అంచెల భద్రత ఉన్నప్పటికీ పలువురు వాలెట్లు (ఖాతాల) నుంచి కోట్లాది రూపాయల డిజిటల్ కరెన్సీ వేరే ఖాతాల్లోకి తరలిపోయింది. దీంతో వారు లబోదిబోమంటూ విషయాన్ని వజీర్‌ఎక్స్ దృష్టికి తెచ్చారు. అయితే వారు అప్రమత్తమయ్యే లోపు రూ.2,000 కోట్ల(230 మిలియన్ డాలర్లు) డిజిటల్ ఆస్తులు దొంగతనానికి గురయ్యాయి. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ అతి పెద్ద క్రిప్టో కరెన్సీ చోరీ వెనుక నిందితుల కోసం నిఘా సంస్థలు దర్యాప్తును ముమ్మరం చేశాయి.

అసలెలా జరిగింది?

తొలుత ఒక వజీర్‌ఎక్స్‌లో ఒక వాలెట్‌ను తెరచిన సైబర్ చోరుడు దానిలోకి 230 మిలియన్ డాలర్లను వివిధ క్రిప్టో కరెన్సీ రూపాల్లోకి బదిలీ చేశాడు. అలాగే హవాలా నగదు బదిలీకి వినియోగించే టోర్నడో క్యాష్ నుంచి ఆ వ్యాలెట్‌కు ఒక లావాదేవీ ద్వారా నిధులు సమకూరినట్టు కనిపించింది. జూలై 10 నుంచి 18 వరకు వజీర్ ఎక్స్‌లోని వివిధ ఖాతాల నుంచి డిజిటల్ ఆస్తుల అపహరణ మొదలైంది. అలా అపహరించిన మొత్తాన్ని వివిధ క్రిప్టో కరెన్సీల లోకి మార్చి చిన్న చిన్న మొత్తాలలో రెండు వేరే ఎక్స్ఛేంజ్‌లలోని పలు ఖాతాలలోకి సదరు దొంగ బదిలీ చేశాడు. 2 వేల లావాదేవీలు జరిపి అపహరించిన మొత్తాన్ని ఖాతాల్లోకి పంపాడు.

దొంగ సొత్తు ఖర్చు పెట్టగలడా?

నిందితుడు ఇంతవరకు ఆ ఖాతాలలోని మొత్తాన్ని వినియోగించ లేదు. దీనిని వినియోగించుకోవాలంటే వాస్తవ ప్రపంచంలోకి వచ్చి దానిని డాలర్, రూపాయి వంటి కరెన్సీగా మార్చుకోవాల్సి ఉంటుందని, అప్పుడు అతని నిజ రూపం వెల్లడి కాక తప్పదని సైబర్ నిపుణులు అంటున్నారు. సైబర్ నేరగాడు ప్రస్తుతం 61,000 ఈథరమ్‌లు (ఒక్క ఈథరమ్ రూ.2 లక్షలకు పైగా విలువ చేస్తుంది) మూడు వ్యాలెట్లలో దాచి ఉంచినట్టు నిపుణులు కనుగొన్నారు. ఈ వ్యాలెట్లలో ఎలాంటి కదలికలు ఏర్పడినా అతడిని కనిపెట్టడానికి నిఘా సంస్థలు సిద్ధంగా ఉన్నాయి. భారీ మొత్తం ఏదైనా ఉగ్రవాద సంస్థలకు నిధులను సమకూర్చడానికా? అనే కోణంలోనే దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి.

గాజాలో బడిపై ఇజ్రాయెల్ దాడి

80 మంది మృతి



జెరూసలేం, ఆగస్టు 10: గాజాలో శరణార్థులు తలదాచుకున్న ఓ స్కూల్‌పైనా ఇజ్రాయెల్ విచక్షణారహితంగా వైమానిక దాడులకు తెగబడింది. శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటనలో కనీసం 80 మంది చనిపోయి ఉంటారని పాలస్తీనా ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. గత 10 నెలలుగా సాగుతున్న ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో ఇది అత్యంత దారుణమైన ఘటనగా వారు పేర్కొన్నారు. గుర్తించలేని విధంగా మృతదేహాలు దెబ్బతిన్నాయని తెలిపారు. అయితే సెంట్రల్ గాజాలోని తబీన్ స్కూల్‌లో హమాస్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకుందని, అందుకే దాన్ని లక్ష్యంగా చేసుకున్నామని ఇజ్రాయెల్ మిలటరీ వర్గాలు తమ చర్యల్ని సమర్థించుకున్నాయి. కాగా, ఇజ్రాయెల్ ప్రకటనను హమాస్ ఖండించింది. యుద్ధంలో శరణార్థులుగా మారిన ప్రజలు ఆ స్కూల్‌లో తలదాచుకున్నారని తెలిపింది. క్షిపణి దాడుల్లో 47 మంది తీవ్రంగా గాయపడ్డారని ఆరోగ్య శాఖ తెలిపింది. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా ఇజ్రాయెల్ సైన్యం ఈ దాడికి తెగబడిందని ఆరోపించింది. గత 8 రోజుల్లో స్కూళ్లపై జరిగిన వైమానిక దాడుల్లో 163 మంది చనిపోయారు. వీటిపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది.

నమస్తే తెలంగాణ

డబుల్ యాక్షన్ గ్యారంటీ



రామ్ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్' ఈ నెల 15న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. 'ఇస్మార్ట్ శంకర్' మాస్‌ను మెప్పించడంతో ఈ సీక్వెల్‌పై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. 'ఏ' సర్టిఫికెట్ లభించింది. ఇంటెన్స్ యాక్షన్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో చిత్రాన్ని తీర్చిదిద్దామని, ఓల్డ్‌సిటీ శంకర్‌గా హీరో రామ్ యాక్షన్ మరో స్థాయిలో ఉంటుందని, ఇంటర్వెల్ బ్యాంగ్‌తో పాటు క్లైమాక్స్ ఘట్టాలు ఎవరూ ఊహించని రీతిలో సాగుతాయని మేకర్స్ తెలిపారు. రామ్, కావ్యథాపర్ మధ్య రొమాంటిక్ కెమిస్ట్రీ స్పెషల్ అట్రాక్షన్‌గా ఉంటుందని, మణిశర్మ కంపోజ్ చేసిన పాటలు ఇప్పటికే పాపులర్ అయ్యాయని చిత్ర బృందం పేర్కొంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నది. పూరి జగన్నాథ్, ఛార్మికౌర్ నిర్మించారు.

పుట్టిన ఊరుని మర్చిపోను



తాడూరు, ఆగస్టు 10 : తన గ్రామంలోని గుడి, బడిని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని 'కల్కి' సినిమా డైరెక్టర్ నాగ్ అశ్విన్ స్పష్టం చేశారు. నాగ్‌అశ్విన్ సొంతూరైన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఐతోల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తన సొంత నిధులు రూ.66 లక్షలతో నూతనంగా నిర్మించిన నాలుగు అదనపు తరగతి గదులను శనివారం కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అశ్విన్ మాట్లాడుతూ పుట్టిన ఊరు, కన్న తల్లిని ఎప్పటికీ మరిచిపోనన్నారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ కన్నతల్లితో సమానమైన సొంతూరికి ఉన్న బంధం పేగుబంధం వంటిదన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న వయసులోనే 'కల్కి' సినిమాతో ప్రపంచ స్థాయికి ఎదిగిన నాగ్ అశ్విన్ మన జిల్లా వాసి కావడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ అశ్విన్ తల్లి జయంతిరెడ్డి, తండ్రి జయరాంరెడ్డితో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అపజయం ఎరుగని యోధుడు



తమిళ అగ్ర హీరో సూర్య నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'కంగువ' నిర్మాణం నుంచి దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. శివ దర్శకుడు. ఇప్పటికే రిలీజైన ప్రచార చిత్రాలు, టీజర్ సినిమాపై మరింత అంచనాల్ని పెంచాయి. దసరా సందర్భంగా అక్టోబర్ 10న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. ట్రైలర్‌ను ఈ నెల 12న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా శనివారం కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పాన్ వరల్డ్ మూవీగా పదిభాషల్లో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో హీరో సూర్య అపజయం ఎరుగని యుద్ధవీరుడిగా కనిపిస్తారని, ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకు రానటువంటి వైవిధ్యమైన కాన్సెప్ట్, మేకింగ్‌తో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం త్రీడీలో కూడా విడుదలకానుంది. నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేస్తున్నది. ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిస్వామి, నిర్మాతలు: కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్, దర్శకత్వం: శివ.

స్నేహానికి మించిన శక్తి లేదు



'మ్యాడ్' చిత్రంతో మంచి గుర్తింపును తెచ్చుకున్నాడు ఎన్టీఆర్ బావమరిది, యువ హీరో నార్నే నితిన్. ఆయన తాజా చిత్రం 'ఆయ్' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. అంజి కె మణిపుత్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని బన్నీ వాస్, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ సందర్భంగా శనివారం హీరో నార్నే నితిన్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ సంగతులివి..

అల్లు అరవింద్‌గారి సలహా మేరకు ఈ సినిమాకు 'ఆయ్' అనే టైటిల్ పెట్టాం. గోదావరి యాసలో ఆయ్ అనే పదాన్ని ఎక్కువగా వాడుతుంటారు. గోదావరి నేపథ్య కథ కాబట్టి టైటిల్ బాగా కుదిరింది. స్నేహం ప్రధానంగా ఈ కథ నడుస్తుంది. కుల, మతాలకు అతీతంగా మనందరినీ ముందుకు నడిపించే గొప్ప శక్తి స్నేహానిదే అనే సందేశంతో ఆకట్టుకుంటుంది. కావాల్సినంత వినోదంతో పాటు ఎమోషనల్ ఎలిమెంట్స్ ఉంటాయి.

ఎన్టీఆర్ బాగుందన్నాడు

ఈ చిత్రంలో గోదావరి యాసలో మాట్లాడటం అంత ఇబ్బందిగా అనిపించలేదు. చిన్నతనం నుంచి గోదావరి ప్రాంతానికి చెందిన ఫ్రెండ్స్‌తో కలిసి ఉండటం వల్ల ఆ యాసలో పర్‌ఫెక్ట్‌గా మాట్లాడగలిగాను. ఎన్టీఆర్‌గారు ట్రైలర్ చూసి బాగుందని అన్నారు. ఆయనకు కామెడీ బాగా నచ్చింది. సినిమా చూసిన తర్వాత కూడా ఆయన హ్యాపీగా ఫీలవుతారని అనుకుంటున్నా.

హండ్రెడ్ పర్సంట్ ఎఫర్ట్స్

కెరీర్‌పరంగా ప్రత్యేకంగా ఎలాంటి ప్రణాళికలు వేసుకోలేదు. నా మనసుకు నచ్చిన కథలతో సినిమాలు చేస్తున్నా. ఎలాంటి కథ అయినా హండ్రెడ్‌పర్సంట్ ఎఫర్ట్స్ పెట్టాలన్నదే నటుడిగా నా లక్ష్యం. ప్రస్తుతం 'మ్యాడ్' సీక్వెల్ షూటింగ్ జరుగుతున్నది. ఈ ఏడాదిలోనే రిలీజ్ ఉండొచ్చు. ప్రస్తుతానికైతే కొత్త ప్రాజెక్టులు అంగీకరించలేదు.



నాగశౌర్య కొత్త చిత్రం

యువ హీరో నాగశౌర్య కొత్త చిత్రాన్ని ప్రకటించారు. రామ్ దేశిన దర్శకుడిగా పరిచయం కానున్న ఈ చిత్రాన్ని శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మిస్తున్నారు. శనివారం రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో నాగశౌర్య పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుందని, ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందిస్తామని మేకర్స్ తెలిపారు. సముద్రఖని, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, పృథ్వీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రసూల్ ఎల్లోర్, సంగీతం: హారిస్ జైరాజ్, రచన-దర్శకత్వం: రామ్ దేశిన (రమేష్).

రవితేజతో మరిన్ని సినిమాలు చేస్తాం



అనతికాలంలోనే తెలుగు సినీరంగంలో అగ్ర నిర్మాణ సంస్థగా ఎదిగింది పీపుల్ మీడియా ఫ్యాక్టరీ. ఇప్పుడీ సంస్థ లైనప్‌లో పదిహేను సినిమాలు రిలీజ్‌కు సిద్ధంగా ఉన్నాయి. వచ్చే ఏడాది దాదాపు పది చిత్రాలను తెరకెక్కించబోతున్నామని చెప్పారు పీపుల్ మీడియా సంస్థ సారథి, నిర్మాత టీజీ విశ్వప్రసాద్. రవితేజ కథానాయకుడిగా హరీశ్‌శంకర్ దర్శకత్వంలో ఆయన నిర్మించిన తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా అగ్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ శనివారం పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న విశేషాలు..

- రవితేజతో మా సంస్థకిది మూడో చిత్రం. ఇక ముందు కూడా ఆయనతో వరుస సినిమాలు చేస్తాం. రవితేజ-హరీశ్‌శంకర్ కాంబినేషన్‌కు మంచి క్రేజ్ ఉంది. 'మిస్టర్ బచ్చన్' చిత్రంలో యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్, ఫ్యామిలీ ఎమోషన్స్..ఇలా అన్ని అంశాలుంటాయి. ఇక యాక్షన్ ఎపిసోడ్స్ పరంగా 'ధమాకా' చిత్రానికి రెండింతలుగా ఉంటుంది.
- తొలుత ఈ చిత్రాన్ని ఆగస్ట్ 9న విడుదల చేద్దామని ప్లాన్ చేశాం. అయితే ఓ సాంగ్ బ్యాలన్స్‌గా ఉండటంతో డేట్ ప్రకటించలేదు. ఈలోగా 'పుష్ప-2' రిలీజ్ వాయిదా పడటంతో ఆ స్లాట్‌లో మా సినిమాను తీసుకురావాలని నిర్ణయించుకున్నాం. లాంగ్‌వీకెండ్ మా సినిమాకు చాలా ప్లస్ అవుతుందని భావిస్తున్నాం.
- 'మిస్టర్ బచ్చన్' చిత్రాన్ని చాలా గ్రాండ్ స్కేల్‌లో తెరకెక్కించాం. అనుకున్న బడ్జెట్‌తోనే పూర్తిచేశాం. ఈ సినిమా పాటలన్నీ సూపర్‌హిట్ అయ్యాయి. దర్శకుడు హరీశ్‌శంకర్, మ్యూజిక్ డైరెక్టర్ మిక్కీ జె మేయర్ మధ్య చక్కటి అవగాహన ఉండటంతో మ్యూజిక్‌పరంగా బెస్ట్ అవుట్‌పుట్ వచ్చింది.
- వంద సినిమాల టార్గెట్‌తో ఫ్యాక్టరీ మోడల్‌లో మా సంస్థను మొదలుపెట్టాం. ఆ ప్రయత్నాల్లో బిజీగా ఉన్నాం. ప్రస్తుతం 15 చిత్రాలు రిలీజ్‌కు సిద్ధంగా ఉన్నాయి. వచ్చే ఏడాది పది చిత్రాలు లైనప్‌లో ఉన్నాయి.
- ప్రభాస్‌తో మా సంస్థ చేస్తున్న ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ 'రాజాసాబ్' షూటింగ్ యాభై శాతం పూర్తయింది. ప్రస్తుతం జీ2, మిరాయ్, సన్నీడియోల్‌తో చేస్తున్న హిందీ సినిమా షూటింగ్స్ జరుగుతున్నాయి. కన్నడంలో మూడు చిత్రాలు చేస్తున్నాం. తెలుగులో ఐదు చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి. వీటితో పాటు అమెరికాలో రెండు ప్రాజెక్ట్స్ చేస్తున్నాం. ఓటీటీ రిలీజ్‌కు ఐదు చిత్రాలు సిద్ధంగా ఉన్నాయి.



నాలుగేళ్ల కష్టానికి ఫలితం

'విడుదలైన అన్ని కేంద్రాల్లో 'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తున్నది. సినిమాలో చర్చించిన పాయింట్ అందరికి కనెక్ట్ అయింది. ఇలాంటి సినిమా తీసినందుకు చాలా గర్వంగా ఉంది' అని చెప్పింది నిహారిక కొణిదెల. ఆమె సమర్పణలో పింక్ ఎలిఫెంట్, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ పతాకాలపై యదువంశీ దర్శకత్వంలో రూపొందిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన విజయోత్సవ వేడుకలో నిహారిక కొణిదెల మాట్లాడుతూ 'ఈ కథ విన్నప్పుడు తప్పకుండా గొప్ప చిత్రమవుతుందనే నమ్మకం కలిగింది. కొత్తవారైనా నటీనటులందరూ అద్భుతంగా పర్‌ఫార్మ్ చేశారు' అని చెప్పింది. నాలుగేళ్ల కష్టానికి ఈ విజయంతో ప్రతిఫలం లభించిందని, సినిమాలో ప్రతీ పాత్రకు ఆడియెన్స్ కనెక్ట్ అవుతున్నారని, మూడు తరాలను తెరపై చూపించడం ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తున్నదని దర్శకుడు యదువంశీ అన్నారు. మంచి కంటెంట్‌కు లభించిన ఆదరణ ఇదని నిర్మాత జయ అడపాక పేర్కొంది. ఈ వేడుకలో చిత్ర యూనిట్ మొత్తం పాల్గొంది.

డీల్ కుదిరిందా?



స్వీయ దర్శకత్వంలో హను కోట్ల హీరోగా నటిస్తున్న చిత్రం 'ది డీల్'. పద్మా రమాకాంతరావు, రామకృష్ణ నిర్మాతలు. ఈ చిత్ర పోస్టర్స్‌ను రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు, హీరో హను కోట్ల మాట్లాడుతూ 'ఓ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: పి.సురేంద్రరెడ్డి, సంగీతం: ఆర్.ఆర్.ధృవన్.

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

హిండెన్‌బర్గ్ మరో బాంబ్



సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురిపై సంచలన ఆరోపణలు

అదానీ గ్రూప్ షెల్ కంపెనీల్లో రహస్య వాటాలు

భర్తతో కలిసి పెట్టుబడులంటూ డాక్యుమెంట్ విడుదల › 12

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

ఆదివారం SUNDAY 11.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+32 పేజీల ఆదివారం అనుబంధం Pages: 12+4+32 Pages SUNDAY supplement | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 67 ‖ వెల (Price) రూ.8.00 | సప్తమి

ఆదివారం, సూర్యోదయం: 5-58, సూర్యాస్తమయం: 6-44. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం శుక్ల పక్షం తిథి: సప్తమి పూర్తి. నక్షత్రం: స్వాతి పూర్తి. వర్జ్యం: పగలు 12-04 నుంచి పగలు 1-51 వరకు. రాహుకాలం: సాయంత్రం 5-07 నుంచి సాయంత్రం 6-43 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 5-01 నుంచి సాయంత్రం 5-52 వరకు. అమృతకాలం: రాత్రి 10-44 నుంచి రాత్రి 12-31 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



ఏప్రిల్ నెలలో కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురై నిర్మల్ ప్రభుత్వ దవాఖానలో చికిత్సపొందుతున్న విద్యార్థినులు



సూర్యాపేట జిల్లా దోసపహాడ్ గురుకులంలో ఇటీవల కుమార్తె మృతి చెందడంతో రోదిస్తున్న సరస్వతి తల్లిదండ్రులు

గతి తప్పిన గురుకులం

ఫుడ్ పాయిజన్.. పాముకాట్లు.. బలవన్మరణాలు

ఎనిమిది నెలల్లో అంతా అస్తవ్యస్తం

- **రెసిడెన్షియల్ స్కూళ్లలో వరుస ఘటనలు**
- **ఆందోళన కలిగిస్తున్న విద్యార్థుల ఆత్మహత్యలు**
- **కలుషిత ఆహారంతో దవాఖానలపాలు**
- **రాష్ట్రంలో 30కి పైగా పాముకాటు కేసులు**
- **సస్పెన్షన్లతో సరిపెడుతున్న ఉన్నతాధికారులు**
- **దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టని ప్రభుత్వం**
- **పని ఒత్తిడితో ఉపాధ్యాయుల పర్యవేక్షణ కరువు**
- **విద్యాకుసుమాలు రాలుతున్నా పట్టని సర్కార్**
- **ఎత్తేసే కుట్రతోనే నిర్లక్ష్యమంటున్న విపక్షాలు**

హైదరాబాద్, ఆగస్టు10 (నమస్తే తెలంగాణ): నిన్నమొన్నటిదాకా దేశానికే తలమానికంగా నిలిచిన తెలంగాణ గురుకులాలు, ఇప్పుడు ఏ క్షణం ఏం జరుగుతుందోననే భయంతో వణికిపోతున్నాయి. ఓ వైపు ఫుడ్‌పాయిజన్, మరోవైపు విద్యార్థుల ఆత్మహత్యల వరుస ఘటనలతో బెంబేలెత్తుతున్నాయి. పాముకాట్లు, ఎలుకకాట్లు, కలుషిత ఆహారంతో పిల్లలు దవాఖానల పాలుకావడం, పరిస్థితి విషమించి పిట్టల్లా రాలిపోవడం, అనుమానాస్పద మరణాలు చోటుచేసుకోవడం, బలవన్మరణాలకు పాల్పడటం ఇటీవల కొంతకాలంగా ఆందోళన కలిగిస్తున్నది. సోషల్ › 2వ పేజీలో



డెంగ్యూతో విద్యార్థిని మృతి

గుండాయిపేట ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో ఘటన › 2

గ్రామాల్లో కుక్కలు.. గురుకులాల్లో ఎలుకలు



రైతుభరోసా లేదు.. తులం బంగారం ఇస్తలేదు

పింఛన్ పెంపు దేవుడెరుగు.. ఉన్నదీ రాకపాయె

నిర్వహణ లేక చెత్తకుప్పలుగా మారిన గ్రామాలు

డీజిల్‌కు పైసల్లేవ్.. సఫాయిలకు జీతాల్లేవ్

పడకేస్తున్న పల్లెలు .. విజృంభిస్తున్న విషజ్వరాలు

ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదు

కేసీఆర్ పాలనలో ఈ పరిస్థితి ఉండేదా? › 3

మాజీ మంత్రి హరీశ్‌రావు

విద్యార్థుల మరణాలు సర్కారీ హత్యలే

గురుకులాల్లో పిల్లలు చనిపోతున్నా స్పందించని కాంగ్రెస్ సర్కార్

రెసిడెన్షియల్ స్కూళ్ల మూసివేతకు కుట్ర

కేసీఆర్ కిట్లు ఇవ్వక పోవడం వల్లే సర్కార్ దవాఖానల్లో తగ్గిన ప్రసవాలు

ఎమ్మెల్యేలు కే సంజయ్, కౌశిక్‌రెడ్డి › 2

వార్షికాదాయం 2 లక్షల్లోపు ఉంటేనే

రేషన్‌కార్డు

పట్టణ ప్రాంతాల్లో జారీకి లెక్క ఇది

పల్లెల్లో భూమి కూడా పరిగణనలోకి

రెండుంటే ఒకటి వదులుకోవాల్సిందే

కొత్త కార్డుల జారీకి విధివిధానాలు

సక్సేనా కమిటీ సిఫారసుల పరిశీలన

మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం



హైదరాబాద్, ఆగస్టు10 (నమస్తే తెలంగాణ): కొత్త రేషన్‌కార్డుల జారీకి సిద్ధమవుతున్న ప్రభుత్వం ఎవరెవరికి ఇవ్వాలనేదానిపై ఓ నిర్ణయానికి వచ్చింది. పట్టణ ప్రాంతా ల్లో రేషన్‌కార్డుల జారీకి రూ. 2 లక్షల వార్షిక ఆదాయ పరిమితి విధించాలని నిర్ణయించినట్టు దీనిపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.5 లక్షలు, లేదా 3.5 ఎకరాల మాగాణి, లేదా 7.5 ఎకరాల మెట్టభూమి ఉన్న వారిని అర్హులుగా గుర్తించాలని అధికారులకు సూచించింది. పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం శనివారం సచివాలయంలో పౌరసరఫరాల కార్యదర్శి డీఎస్ చౌహాన్, ఆరోగ్యశాఖ కార్యదర్శి చొంగ్తూ తదితరులతో భేటీ అయింది. ఈ సందర్భంగా రేషన్‌కార్డుల జారీపై సుదీర్ఘంగా చర్చించింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారందరికీ రేషన్‌కార్డులు అందేలా లోతైన అధ్యయనం చేయాలని నిర్ణయించింది. రాజకీయాలకు అతీతంగా అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులందరి నుంచి సలహాలు, › 2వ పేజీలో



సమగ్ర కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం శనివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బీసీ సంఘాలు సత్యాగ్రహ దీక్ష చేపట్టాయి. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీసీ నేత రాజారాం యాదవ్ తదితరులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న ఆర్ కృష్ణయ్య. చిత్రంలో దాస్యం వినయభాస్కర్, జాజుల శ్రీనివాసగౌడ్ తదితరులు

'సుంకిశాల'పై విచారణకు వెనుకడుగు ఎందుకు?

ప్రమాదానికి బాధ్యులెవరు? కప్పిపుచ్చుతున్నదెవరు?

కాంట్రాక్టు సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకుండా ఆపుతున్నదెవరు?

రాహుల్‌గాంధీకి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలు



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): కోట్లాది రూపాయల నష్టం జరిగిన తర్వాత కూడా సుంకిశాల ప్రమాదాన్ని చిన్నదిగా చూపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మండిపడ్డారు. లోపభూయిష్టంగా పనులు చేసిన కాంట్రాక్టింగ్ ఏజెన్సీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకుండా తెలంగాణ › 3వ పేజీలో

తాజా అప్పు.. 3వేల కోట్లు

ఈ మంగళవారమే 3 వేల కోట్ల రుణం

వారం రోజుల్లో 6 వేల కోట్లకు అప్పు

గడిచిన 9 నెలల్లో రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన అప్పు 35,118 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): రిజర్వు బ్యాంకు వద్ద రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ మరో రూ.3000 కోట్లు అప్పు తీసుకోనున్నది. ఈ నెల 6వ తేదీనే రూ.3000 కోట్ల రుణం తీసుకున్న రేవంత్‌రెడ్డి సర్కార్.. మరోసారి ఈ నెల 13న మళ్లీ రూ.3000 కోట్ల అప్పు తీసుకొనేందుకు చర్యలు చేపట్టింది. వెయ్యి కోట్ల విలువైన మూడు బాండ్లను ఆర్బీఐ వద్ద వేలానికి పెట్టింది. మూడు వేల కోట్ల విలువైన బాండ్లను వేర్వేరుగా 11 ఏండ్లు, 14 ఏండ్లు, 21 సంవత్సరాల కాలానికి రాష్ట్ర ఆర్థికశాఖ ఆర్బీఐకి జారీచేసింది. వీటిని ఈ నెల 13న వేలం › 2వ పేజీలో

'స్థానికత' పాపం సర్కారుదే

మెడికల్ సీట్లలో 'ఉమ్మడి' కోటా జూన్ 2తో ముగుస్తుందని తెలిసినా రేవంత్ సర్కార్ తగిన చర్యలేవీ తీసుకోలేదు. కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ అలర్ట్ చేస్తూ లేఖరాసినా సర్కారు స్పందించలేదు. పొరుగు రాష్ట్రం ఏపీ 'స్థానికత'ను నిర్ధారిస్తూ జీవో తెచ్చినా మన ప్రభుత్వం అప్రమత్తం కాలేదు. తీరా అడ్మిషన్ల ముంచుకురాగానే అప్పుడు మేల్కొన్నది. అప్పటికప్పుడు ఆగమేఘాలపై ఉత్తర్వులు తెచ్చింది. 'స్థానికత'ను నిర్ధారించే నిబంధనలను మార్పు చేస్తూ తెచ్చిన జీవో 33తో విద్యార్థులు హతాశయులయ్యారు.



తెలంగాణలో ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితంగా తీరని నష్టం


ఎనిమిది నెలలుగా పట్టించుకోకుండా సర్కారు చోద్యం

చివరిక్షణాల్లో అడ్డగోలు నిబంధనలతో జీవో 33 జారీ

విద్యార్థుల జీవితాలతో చెలగాటం.. విమర్శల పాలు

ముందుగానే స్థానికతను నిర్ధారించిన ఏపీ సర్కారు

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో స్థానికత నిర్ధారణలో ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థుల జీవితాలను ఆగం చేస్తున్నది. స్థానికత నిర్ధారణ కోసం ఈ ఏడాది ప్రారంభం నుంచే విజ్ఞప్తులు అందినా ప్రభుత్వం పట్టించుకోలేదు. తెలంగాణ, ఏపీ మధ్య ఈ ఏడాది జూన్ 2తో 'ఉమ్మడి' బంధం శాశ్వతంగా ముగిసిపోతుందని ముందుగానే తెలిసినా పట్టించుకోలేదు. చివరిక్షణాల్లో జీవో ఇచ్చిన పాలకులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. మెడికల్ సీట్లలో ఉమ్మడి కోటాపై నిర్ణయం తీసుకోవాలని, స్థానికతను నిర్ధారించాలని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ నుంచి ఈ ఏడాది జనవరిలోనే వైద్యారోగ్య శాఖ కార్యదర్శికి లేఖ › 2వ పేజీలో



బంగ్లా చీఫ్ జస్టిస్ రాజీనామా

నిరసనకారుల ముట్టడితో నిమిషాల్లో పదవికి గుడ్ బై

పదవి నుంచి తప్పుకున్న బంగ్లా బ్యాంక్ గవర్నర్ › 7

కాంగ్రెస్‌లో రాజ్యసభ రగడ

తెరపైకి అభిషేక్ సింఘ్వీ పేరు

సీనియర్లకు సీఎం రేవంత్ చెక్

రగిలిపోతున్న ఆశావహులు

అందెశ్రీకి ఆఫర్ ఏమైనట్టు? › 5

సింఘ్వీతో లాభం ఎవరికి?

కోటి ఎకరాలకు భరోసా కోత!

- **బడ్జెట్‌లో రైతుభరోసాకు 15 వేల కోట్లు కేటాయింపు**
- **ఎకరానికి 15 వేలు ఇస్తే.. సీజన్‌కు ఇచ్చేది కోటి ఎకరాలకే**
- **కేసీఆర్ హయాంలో సీజన్‌కు 1.53 కోట్ల ఎకరాలకు..**
- **తాజా బడ్జెట్‌తో ప్రతి సీజన్‌లో 50 లక్షల ఎకరాలకు కోత**



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): పెట్టుబడి సాయం రైతుభరోసా (రైతుబంధు)లో భారీ కోతకు రంగం సిద్ధమైంది. ఏటా సుమారు కోటి ఎకరాలకు కోత పెట్టే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. తాజా బడ్జెట్ కేటాయింపులే ఇందుకు సాక్ష్యం. బడ్జెట్‌లో రైతుభరోసా పథకానికి ప్రభుత్వం రూ.15,075 కోట్లు మాత్రమే కేటాయించింది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం ఎకరాకు రూ.15 వేల చొప్పున పెట్టుబడి › 5వ పేజీలో

యువరైతు ఆత్మహత్య



దిగుబడి రాక.. అప్పు తీర్చలేక

మహబూబాబాద్ జిల్లాలో అన్నదాత బలవన్మరణం

ఇనుగుర్తి, ఆగస్టు 10 : పంట దిగుబడులు రాక.. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక యువ రైతు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. ఇనుగుర్తి మండలం కోక్యాతండాకు చెందిన జాటోత్ రమేశ్ (36) తనకున్న ఎకరం భూమితోపాటు 10 ఎకరాలు కౌలుకు తీసుకొని మూడేండ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. పత్తి, మిర్చి, వరి పండిస్తున్నాడు. ఈ మూడేండ్లలో సుమారు రూ.15 లక్షల వరకు అప్పు తెచ్చి పంట పెట్టుబడిగా పెట్టాడు. పంట దిగుబడి సరిగ్గా రాక, అప్పులు తీర్చే మార్గం › 2వ పేజీలో

కొత్తగా ఆరు రైల్వే లైన్లు!

పాండురంగాపురం-మల్కాన్‌గిరి మధ్య అంతర్రాష్ట్ర లైన్



డోర్నకల్-గద్వాల మధ్య 296 కిలోమీటర్ల మార్గం

డోర్నకల్-మిర్యాలగూడ మధ్య 105 కి.మీ రైల్వేలైన్

కాచిగూడ-జగ్గయ్యపేట, రామగుండం-మణుగూరు మధ్య కొత్త మార్గాలకు రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్

ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.26 వేల కోట్లు

త్వరలో ప్రారంభం కానున్న నిర్మాణ పనులు › 6

ఉక్కు ఫ్యాక్టరీపై ఒత్తిడి తేవాలి

బయ్యారంపై బీజేపీ ఎంపీలు స్పందించాలి



మల్కాన్‌గిరి రైల్వేలైన్‌తో ఐరన్ ఓర్ తరలింపు సులభం

రైల్వేలైన్లకు అనుగుణంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి : వినోద్ › 6

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

మహనీయులు ఎవరు ?

మన భాషలన్నిటికీ మూల భాష సంస్కృతం. కొద్దిగా వ్యాకరణ సూత్రాలు మారి కొద్దిపాటి తేడాలుంటాయి కానీ పదాలు మాత్రం సంస్కృతంలోంచే వస్తాయి. ఉదాహరణకు 'మహనీయుడు' అన్న పదం తీసుకుంటే సంస్కృతంలో అది 'మహనీయః' అని ఉంటుంది. ఈ మధ్య పొగడ్తలలో ఉత్సాహం, అభ్యాసం కొంచెం శృతిమించి ఉండే ఆంధ్ర పేపర్‌లో రాజకీయాలతో సంబంధం ఉన్న ఒక వ్యక్తిని – ఆయన నాయకుడు కూడా కాదు – మహనీయుడని ఆ సంపాదకుడు రాయడం చూసి కొద్దిగా ఆశ్చర్యపడి, ఆ పదానికి ఉన్న మూల అర్థం వెతికాను.



కనకదుర్గ దంటు
89772 43484

'మహత్' అన్న మూలపదంలోంచి దానికి సంబంధించిన మిగతా పదాలు కూర్పు జరిగింది. మహత్ అంటే 'గొప్పది' చేరుకోవటానికి దుస్సాధ్యమైనదని అర్థం. 'ని' అంటే ఎటువంటి గుణాలు లేని నిరాకారమైనది అని అర్థం. 'య'కారం యోగాన్ని – అంటే కలయిక లేక విలీనాన్ని– సూచించే అక్షరం. అంటే ఏ గుణములేని అన్నిటికంటే గొప్పదైన దానిని చేరుకునేవాడు మహనీయుడు.

సాధారణంగా ఇది ఆధ్యాత్మిక రంగంలో వాడవలసిన పదం. ఎందుకంటే ఏ గుణాలు లేనిది పరమాత్మ ఒక్కటే! అందుకే ప్రపంచంతో సంబంధం లేకుండా నిర్వికార జీవితం గడిపిన శ్రీ రామకృష్ణ పరమహంస, కంచి పరమాచార్యులని మహనీయులని అనవచ్చు. వారు ఏ వికారాలు, లౌకిక కోరికలు లేకుండా బ్రతికిన మహనీయులు. ఒకసారి ఒక శిష్యుడు తెలియనితనంతో తన దగ్గర ఉన్న కొద్ది పాటి డబ్బును గుడిలో చెట్టు కింద గల మంచం మీద ఉన్న పరుపు కింద పెట్టాడట మళ్లీ అవసరమైనప్పుడు తీసుకోవచ్చని. కొద్దిసేపటికి ఎవరో కలవటానికి వస్తే రామకృష్ణ పరమహంస వచ్చి ఆ మంచం మీద కూర్చున్నారు. నిముషంలో వారి శరీరంలో మంటలు పుట్టాయి. ఆ వేడి పొగలుగా బయటికి రావడం చూసి చటుక్కున లేచారుట. ఇద్దరు శిష్యులు పరిగెత్తుకుంటూ వచ్చి ఆ మంచం మీద పరుపు తీసి దులుపుదామనుకున్నప్పుడు ఆ డబ్బు కనిపించిందట! అంటే ప్రపంచానికి సంబంధం ఉన్న ఏదీ రామకృష్ణకు సరిపడదు. అది మహనీయత్వం అంటే!

ఇక సామాజిక రంగంలో కొందరుంటారు. ఏమీ ఆశించకుండా తమ స్థాయికి తగ్గట్టు, ఇతరులకు సహాయం చేసేవారు, నిష్కామకర్మగా. ఆస్పత్రులలో రోగులకు అన్నం పెడతారు. కానీ వారి పక్కనుండి వారిని చూసుకునే వారు అష్టకష్టాలు పడతారు. బయట హోటళ్లకు వెళ్లి భోజనం చేయాలి. రోగుల పక్కనుండే వారికి తమ ఇంటి దగ్గర వండి తీసుకువచ్చి భోజనాలు పెట్టేవారి గురించి విన్నాం. అది వారు కేవలం కష్టంలో ఉన్న సాటి మనిషికి సేవ చేయాలన్న దృక్పథంతో చేసే గొప్ప పని. కరోనా సమయంలో కూడా చాలాచోట్ల ఇట్లా భోజనాలు పంపిణీ చేశారు కొందరు ఉచితంగా. నిజానికి వీరిని కూడా మహనీయులు అనవచ్చు. బాల కార్మికులని రక్షించేవారు, అనాథ, వీధి బాలల గురించి శ్రద్ధ తీసుకునేవారు కూడా గొప్పవారు. అయితే టీఆర్‌పీలు మాత్రం కావాలనుకునే మన మీడియా వారికి వీరు కనపడరు.



మరి రాజకీయరంగంలో ఒకే పార్టీలో రెండు విభిన్న వ్యక్తిత్వాలున్నవాళ్లని చూస్తున్నాం. వాజపేయికి 1996లో అకస్మాత్తుగా జయలలిత తన సమర్థన ఉపసంహరించుకున్నప్పుడు కేవలం ఒక్క పార్లమెంటు సభ్యుడు తక్కువయ్యాడు. వేరే పార్టీలలోంచి తీసుకుందామని చెప్పినా, వాజపేయి ఒప్పుకోకుండా ప్రధాని పదవి వదులుకున్నారు. రాజకీయరంగంలో వి లువలంటే అవి! మరి అదే పార్టీ ఇప్పుడు చేస్తున్నదేమిటి? ఇదివరకు పక్కపార్టీ వాడిని ప్రలోభపెట్టి తమ పార్టీలోకి మార్పించడాన్ని హార్స్ ట్రేడింగ్ అనేవారు, అంటే గుర్రాలను కొన్నట్టు. మరి మహనీయుడు వాజపేయి పార్టీలో హార్స్ ట్రేడింగ్ చేసే వాళ్లు ఉండటానికి తగినవారేనా?

రాజకీయరంగంలో గొప్పవారి గురించి చెప్పినప్పుడు ఎవరికైనా అబ్రహాం లింకన్ గుర్తురాక మానడు. అమెరికా 16వ దేశాధ్యక్షుడిగా ఎన్నికైన అబ్రహాం లింకన్ అరుదైన వ్యక్తిత్వం ఉన్న రాజకీయ నేత. కట్టెలు కొట్టుకుంటూ, చెప్పులు కుట్టుకొని కుటుంబాన్ని పోషించుకున్న తండ్రికి పుట్టి అగ్రరాజ్యానికి అధినేత అయిన ధీరుడు. అమెరికాలో బానిసత్వాన్ని రూపుమాపడానికి శాయశక్తులా ప్రయత్నించి ఆ కారణంగానే హత్యకు గురై అసువులు బాశాడు. ఆయన అధ్యక్షుడైనపుడు, ఒక ముఖ్యమైన సమావేశంలో ప్రత్యర్థి ఆయనను కించపరచటానికి ప్రయత్నించాడు. 'మా నాన్నకి మీ నాన్న కుట్టి ఇచ్చిన చెప్పులు కొంచెం వదులయ్యాయి. సరిగ్గా లేవు' అని హేళనగా అన్న ఆయనకు లింకన్ సమాధానం చెప్పాడు. 'మా నాన్న గారు ఇప్పుడు లేరు, ఆయన తరపున నేను క్షమాపణ చెప్తున్నాను. వారి దగ్గర నేనూ పని నేర్చుకున్నాను. మీ నాన్న గారు ఆ చెప్పుల జత ఉపయోగించదల్చుకుంటే చెప్పండి. నేను రిపేర్ చేసి ఇస్తాను' అని ఎంతో వినయంగా సమాధానం ఇచ్చాడు. ఆయన మహనీయుడు!

తన కుమారుడికి చదువులో ఏమి చెప్పాలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునికి రాసిన లింకన్ సందేశం ప్రపంచంలోని విద్యారంగాలన్నీ అనుసరించతగ్గది. తన ఉత్తరంలో ఈ విధంగా రాశాడు అబ్రహాం లింకన్. 'ప్రపంచంలో మనుష్యులందరూ మంచివారే ఉండరని మీరు నా కుమారుడికి బోధిస్తారని నాకు తెలుసు. కానీ, ఇంకో విషయం చెప్పండి. ప్రతి దుర్మార్గుడికి ప్రతిగా ఒక మంచి వ్యక్తిత్వం ఉన్న నాయకుడు కూడా ఉంటాడని చెప్పండి. స్వార్థపూరిత రాజకీయాలు నడిపే ప్రతి ప్రతినిధికి ప్రతిగా ఒక నిస్వార్థ వ్యక్తిత్వం ఉన్న నాయకుడు కూడా ఉంటాడని నమ్మకంగా చెప్పండి. ప్రతి శత్రువుకు ప్రతిగా ఒక చక్కటి స్నేహితుడు కూడా దొరుకుతాడని చెప్పండి. కష్టపడి సంపాదించిన చిన్న మొత్తం, మోసం చేసి సంపాదించిన పెద్ద మొత్తం కంటే విలువైనదని చెప్పండి. నా కొడుకు విజయాలను, అపజయాలను ఒకేరకం గా ఎదుర్కొనేటట్టు చేయండి. అసూయ కాకుం డా ఆహ్లాదకరంగా నవ్వుకోవటం నేర్పండి. పుస్తకాలు చదవటం ప్రకృతిని ఆస్వాదించటం నేర్పండి. విశాలమైన ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే పక్షులని, తోటలలోని చక్కటి పూలను చూసి ఆనందించటం నేర్పండి. మోసం చేసి పైకి రావటం కంటే పాఠశాలలో అయినా, జీవితంలో అయినా వైఫల్యం చెందడం గౌరవప్రదం అని చెప్పండి. తన మీద, తన ఆలోచనల మీద నమ్మకం కలిగి ఉండాలని నేర్పండి. సున్నిత మనస్కులతో సున్నితంగా ఉండటం, కరకుగా ఉండే మనుష్యులతో దృఢంగా ఉండటంలో శిక్షణ ఇవ్వండి. అందరూ చేస్తున్నారు కదా అని ఒక పని చేయడమో, గుంపులో కలవటమో కాకుండా, తన ఆలోచనలకు పదునుపెట్టి, సరైన నిర్ణయం తీసుకోవాలని చెప్పండి. అందరూ చెప్పింది విని, మంచి మాత్రం గ్రహించేటట్టు చేయండి. విచారంలో కూడా నవ్వటం లేదా కన్నీరు పెట్టడానికి సిగ్గపడనక్కరలేదని కూడా నమ్మేటట్టు చేయండి. నిరాశావాదులని నమ్మవద్దనీ, అతి వినయంగా ఉండే వాళ్లు ప్రమాదకరమనీ, ఆత్మను అమ్ముకోవద్దనీ శిక్షణ ఇవ్వండి. ఒంటరిగా అయినాసరే సత్యం కోసం పోరాడాలని నమ్మకంగా చెప్పండి. గారాబం చేయకండి, అతి చనువు ఇవ్వకండి, కానీ సున్నితంగా చెప్పండి. ఏదైనా, ఓపిక, ధైర్యం ఉండాలనీ, ఆత్మవిశ్వాసం ముఖ్యమనీ, నా కొడుకుకు అర్థం చేయించండి' గౌరవభావంతో అబ్రహాం లింకన్.

మరి రాజకీయరంగంలో ఒకే పార్టీలో రెండు విభిన్న వ్యక్తిత్వాలున్నవాళ్లని చూస్తున్నాం. అటల్ బిహారీ వాజపేయి 1996లో అకస్మాత్తుగా జయలలిత తన సమర్థన ఉపసంహరించుకున్నప్ప డు కేవలం ఒక్క పార్లమెంటు సభ్యుడు తక్కువయ్యాడు. వేరే పార్టీలలోంచి తీసుకుందామని చెప్పినా, వాజపేయి ఒప్పుకోకుండా ప్రధాని పదవి వదులుకున్నాడు. రాజకీయరంగంలో వి లువలంటే అవి! మరి అదే పార్టీ ఇప్పుడు చేస్తున్నదేమిటి? ఇదివరకు పక్కపార్టీ వాడిని ప్రలోభపెట్టి తమ పార్టీలోకి మార్పించడాన్ని హార్స్ ట్రేడింగ్ అనేవారు, అంటే గుర్రాలను కొన్నట్టు. మరి మహనీయుడు వాజపేయి పార్టీలో హార్స్ ట్రేడింగ్ చేసేవాళ్లు ఉండటానికి తగినవారేనా?

ఈ సందేశం ప్రతి తల్లి, తండ్రి, ఉపాధ్యాయులు పాటిస్తే బహుశా వచ్చే తరాల్లో రాజకీయాల్లో కూడా మోసగాళ్లు, దుర్మార్గులు కాకుండా, మహావ్యక్తిత్వం ఉన్న మనుష్యులు నాయకులయ్యే అవకాశం ఉన్నది. జై తెలంగాణ.



రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం

భారతీయ సామాజిక వ్యవస్థలో కులానికి ఉన్న ప్రాధాన్యం ఏమిటన్నది అందరికీ తెలిసిందే. మన దేశంలో వర్ణ వ్యవస్థే తదనంతర కాలంలో కులాలుగా రూపం సంతరించుకున్నది. అయితే సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి పథంలో ఉన్నవి 10 శాతమున్న అగ్రకులాలైతే.. అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్నవి మాత్రం 90 శాతమున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలేనన్నది జగమెరిగిన సత్యం.



పుల్లెంల గణేష్
95530 41549

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని చెప్పిన విషయం విదితమే. ధర్మాసనంలోని ఆరుగురు న్యాయమూర్తులు వర్గీకరణను సమర్థించగా.. జస్టిస్ బేలా త్రివేది మాత్రం వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో మరోసారి వర్గీకరణ చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఏపీలో వలె మాదిగ– దాని ఉపకులాలకు 7 శాతం, మాల– దాని ఉపకులాలకు 6 శాతం మేర రిజర్వేషన్లు కల్పిస్తే.. మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. జనాభా పెరగడమే అందుకు కారణం. అందుకే జనాభా దామాషా ప్రకారం.. ఎస్సీలలో ఎక్కువగా ఉన్న మాదిగలకు 11–12 శాతం, మిగతా ఉప కులాలకు వారి ప్రాతినిధ్యానికి తగ్గట్టుగా వాటా ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. తద్వారా ఎస్సీల్లోని అన్ని కులాలకు సమన్యాయం జరుగుతుంది.

మన దేశ మొత్తం జనాభాలో ఎస్సీలు దాదాపుగా 20 శాతం ఉండగా.. తెలంగాణలో 18–20 శాతం వరకు ఉన్నట్టు అంచనా. తెలంగాణలో మాదిగలు 50 లక్షల మంది ఉండగా.. మాలలు 30 లక్షలు, ఇతర ఉపకులాలతో కలిపి మొత్తం ఎస్సీ జనాభా కోటి వరకు ఉండొచ్చు. ఇప్పటివరకు విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్సీల్లోని కొన్ని వర్గాలే ఎక్కువగా లబ్ధి పొందగా.. అనేక ఉపకులాలు నష్టపోయాయి. ఈ కారణంగానే ఎస్సీ వర్గీకరణ ఉద్యమం మొదలైంది. సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తాజా తీర్పుతో ఇప్పటివరకు నష్టపోయిన వర్గాలకు లబ్ధి చేకూరనున్నది. ఆయా వర్గాలు రాజ్యాంగబద్ధంగా వారికి దక్కాల్సిన హక్కును పొందనున్నాయి. అయితే ఎస్సీ వర్గీకరణతోనే ఆయా కులాలు అభివృద్ధి పథంలోకి వస్తాయనుకోవడం భ్రమే. ఎందుకంటే, రాజ్యాధికారంలో ఉన్న కులాలు మాత్రమే అన్నిరంగాల్లో వృద్ధి చెందుతున్నాయన్నది చరిత్ర మనకు చెప్తున్న సత్యం. అందుకే అణగారిన వర్గాల సకల సమస్యలకు రాజ్యాధికారమే అంతిమ పరిష్కారమని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చెప్పారు. రాజ్యాధికారంలో ఉన్న కులాలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెంది.. అణగారినవర్గాల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తాయన్న సత్యాన్ని ఆయన మాటల ద్వారా మనం అర్థం చేసుకోవాలి. ఈ విషయాన్ని గ్రహించిన కాన్షీరాం యూపీ వేదికగా 20 ఏండ్ల పాటు సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పోరాటం చేసి దళితుల నాయకత్వంలో రాజ్యాధికారాన్ని సాధించారు. మరి తెలంగాణ వేదికగా మెజారిటీ ప్రజల రాజ్యాధికారం కోసం ఎంతమంది పోరాటం చేస్తున్నారనేది మేధావులు, విద్యావంతులు ఒక్కసారి ఆలోచించాలి.

అగ్రవర్ణాలతో పోరాడి అణగారిన వర్గాలకు కూడా ఓటుహక్కును సాధించిన మరుక్షణం అంబేద్కర్ ఇలా చెప్పారు. 'ఓ నా అణగారిన సమాజమా! మీరు తరతరాలుగా అగ్రవర్ణ సమాజం చేత అన్నివిధాలుగా అణచివేతకు గురవుతున్నారు. కాబట్టి, మీకు ఓటు అనే వజ్రాయుధాన్ని ఇచ్చాను. ఇకపై ఆ ఓటును మీ ప్రయోజనాల కోసం వేసుకొని, దేశానికి పాలకులుగా మారాలి' అని హితబోధ చేశారు. మరి ఆ మహనీయుడు చూపిన మార్గంలో నేడు మనం వెళ్తున్నామా, లేదా? అనేది ఒక్కసారి ఆలోచించుకోవాలి. ఇకనైనా బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలి. వర్గీకరణతోనే సంతృప్తి చెందకుండా రాజకీయ పోరాటం కూడా చేస్తే సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా వృద్ధి చెందవచ్చు. లేకపోతే కేవలం పది శాతం ఉన్న అగ్రకుల పాలకులిచ్చే సంక్షేమ పథకాల కోసం మరికొంత కాలం ఎదురుచూడక తప్పదు.

ఆర్మీ చేతిలో బంగ్లా భవిష్యత్తు

మైక్రోఫైనాన్స్‌లో ఆర్థిక సాధికారత అంశంపై చేసిన విశేష కృషికి గానూ 2006లో నోబెల్ పురస్కారం అందుకున్న మొహమ్మద్ యూనస్ బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ సారథ్య బాధ్యతలు చేపట్టారు. ఆయన మధ్యంతర ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుగా నియమితులయ్యారు. ఇది ప్రధానమంత్రికి సమానమైన హోదాగా చెప్తున్నారు. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న బంగ్లాదేశ్‌కు ఈ పరిణామం కొంతవరకు ఊరట కలిగించేదే. రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలను ఆయన కొత్త పుంతలు తొక్కిస్తారేమో చూడాలి. అయితే ఆర్మీ చీఫ్ వకార్ ఉజ్జమాన్ రంగంలోకి దిగి, మధ్యంతర ప్రభుత్వానికి యూనస్ సారథ్యం వహించేలా చేసిన తీరు మాత్రం బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య భవిష్యత్తుకు శ్రేయస్కరం కాదు.



వెంకట్ పర్సా



బంగ్లాదేశ్‌లో రాజకీయ అధికారాన్ని రుచి మరిగిన సైన్యాధిపతి వకార్ ఉజ్జమాన్ చిక్కినట్టే చిక్కి చేజారిపోతున్న దాన్ని అంత సులువుగా వదలకపోవచ్చు. ఈ పరిస్థితుల్లో ఆయన వెనకడుగు వేసే అవకాశం లేదనే చెప్పాలి. పాకిస్థాన్‌లో మాదిరిగా ఆయన కూడా క్రప్రెత్తనానికి పాల్పడవచ్చు. ఆగస్టు 5న హసీనా రాజీనామా తర్వాత బంగ్లాదేశ్ అధ్యక్షుడు మొహమ్మద్ షహాబుద్దీన్ పార్లమెంట్‌ను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో మధ్యంతర ప్రభుత్వం ఆర్మీకి పబ్లిక్ ఫ్రంట్‌గా పనిచేయనున్నది. ప్రపంచంలోనే అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన హసీనా తన సుదీర్ఘ రాజకీయ జీవితానికి విషాదకరమైన రీతిలో ముగింపు పలికారు. ప్రాణాలను కాపాడుకునేందుకు బలవంతంగా తన పదవికి రాజీనామా చేసి, దేశం విడిచి పారిపోవాల్సి వచ్చింది.

షేక్ హసీనా తండ్రి, బంగ బంధు షేక్ ముజీబుర్ రెహ్మాన్ హత్యకు గురై ఆగస్టు 15 నాటికి 50 ఏండ్లు పూర్తవుతాయి. ఈ 50 ఏండ్లలో బంగ్లాదేశ్‌లో సుమారుగా 30 తిరుగుబాట్లు చోటుచేసుకున్నాయి. ఆర్మీ చీఫ్ వకార్ ఉజ్జమాన్ ఒత్తిడి కారణంగా షేక్ హసీనా బలవంతంగా ప్రధాని పదవిని వదులుకోవాల్సి వచ్చింది. ఇది తాజా తిరుగుబాటుగానే చెప్పుకోవాలి. ఆ వెంటనే బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ), జాతీయ పార్టీ, జమాత్– ఈ– ఇస్లామీలతో ఆయన చర్చలు జరిపారు. ఈ పరిణామం మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుకు దారితీసింది.

దేశం విడిచి వెళ్లేందుకు షేక్ హసీనాకు వకార్ 45 నిమిషాల సమయమిచ్చారు. దీంతో హసీనా ఆర్మీ విమానమెక్కి ఢిల్లీ శివార్లలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని హిండన్ విమానాశ్రయంలో దిగారు. దిగ్భ్రాంతికరమైన పరిస్థితుల నేపథ్యంలో తన భవిష్యత్తు ప్రణాళికల గురించి కూడా షేక్ హసీనా ఆలోచించుకోలేని స్థితిలో ఉన్నారు. భారత్‌లో హసీనా ఆశ్రయం పొందడం ఇది మొదటిసారి కాదు. 1975లో హసీనా తండ్రి ముజీబ్ సహా యావత్తు కుటుంబసభ్యులు దారుణ హత్యకు గురయ్యారు. ఆ సమయంలో జర్మనీలో ఉన్నందున హసీనా, ఆమె సోదరి ప్రాణాలు దక్కించుకున్నారు. 1975–1981 మధ్యకాలంలో హసీనా భారత్‌లో ఆశ్రయం పొందారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆగస్టు 5 నుంచి ఆమె రెండోసారి మన దేశంలో ఆశ్రయం పొందుతున్నారు.

1947లో భారత్, పాకిస్థాన్‌లకు ఒకే సమయంలో స్వాతంత్ర్యం వచ్చింది. అప్పటినుంచి భారత్‌లో ప్రజాస్వామ్య మూలాలు వేళ్లూనుకుపోయాయి. పాకిస్థాన్‌లో వలె 1971లో ఆవిర్భవించిన పొరుగుదేశం బంగ్లాదేశ్ కూడా నియంతృత్వంలో కూరుకుపోవడం విచారకరం. జనరల్ అయూబ్ ఖాన్ నుంచి యాహ్యా ఖాన్, జనరల్ జియా– ఉల్– హక్ నుంచి జనరల్ పర్వేజ్ ముషారఫ్ వరకు అనేకమంది సైనిక నియంతల పాలనను పాకిస్థాన్ చవిచూసింది. పాక్ ఆర్మీ ఇప్పటికీ రాజకీయాలపై ఆధిపత్యం కొనసాగిస్తూనే ఉన్నది. స్వాతంత్ర్య పోరాటం కారణంగా 1971లో ఆవిర్భవించిన బంగ్లాదేశ్‌లోనూ ప్రజాస్వామ్యం పట్టాలు తప్పినప్పుడు ఆ దేశం నియంతృత్వంలోకి జారుకున్నది.

1947లో స్వాతంత్ర్య పోరాటం నుంచి ఆవిర్భవించిన భారత నాయకత్వం ఎంతో శ్రమకోర్చి దేశంలో ప్రజాస్వామ్యానికి నారుపోసి, నీరుపోసి సంరక్షిస్తూ వచ్చింది. అయితే 1971లో స్వాతంత్ర్యం సాధించిన నాలుగేండ్ల కంటే తక్కువ సమయంలోనే బంగ్లాదేశ్ తిరుగుబాటును చూసింది. ఇది ఆ దేశం ఎదుర్కొన్న తిరుగుబాట్లలో మొదటిది. 1975లో బంగ బంధు షేక్ ముజీబుర్ రెహ్మాన్ హత్య తర్వాత ఖోండ్‌కర్ ముస్తాక్ అహ్మద్ అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత ఖోండ్‌కర్ ముస్తాక్‌ను గద్దె దించేందుకు బ్రిగేడియర్ ఖాలెద్ ముషారఫ్ తిరుగుబాటు చేశారు. ఆపై హుస్సేన్ మొహమ్మద్ ఇర్షాద్ కూడా తిరుగుబాటు ద్వారానే అధికారంలోకి వచ్చారు. ఆయన తర్వాత జియా–ఉర్–రెహ్మాన్ వంతు. షేక్ హసీనా రాజకీయ ప్రత్యర్థి బీఎన్‌పీ నేత బేగం ఖాలెదా జియా గత 17 ఏండ్లు జైలు జీవితం గడిపారు. ఇటీవల దేశాధ్యక్షుడి ఆదేశాల మేరకు ఆమె విడుదలయ్యారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ ఆర్మీ ఇప్పటికీ ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషిస్తుండటంతో దేశంలో ప్రజాస్వామ్యం మళ్లీ పరిఢవిల్లే అవకాశం అంతంతమాత్రమేనని, ఆ మాటకొస్తే అసలు లేదనే చెప్పాలి.

1972లో బంగ బంధు ముజీబ్ తీసుకొచ్చిన కోటానే ప్రస్తుత వివాదానికి మూలం. బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల కోసం ఆయన అప్పట్లో ఓ కోటాను తెచ్చారు. అంతేకాదు, స్వాతంత్ర్య సమరం జరిగిన సమయంలో పాక్ సైనికుల చేతుల్లో చిత్రహింసలకు గురైన మహిళల కోసం కూడా ఒక కోటాను ఏర్పాటు చేశారు. పాకిస్థాన్ ఆర్మీతో పోరాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన, ఇబ్బందులు ఎదుర్కొన్నవారికి కొత్త దేశం న్యాయం చేస్తుందని ముజీబ్ అప్పట్లో హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుత సంక్షోభానికి కారణం 2018లో జరిగిన కోటా వ్యతిరేక ఉద్యమమనే చెప్పుకోవాలి. 1972 నుంచి కొనసాగుతున్న ఈ ప్రత్యేక కోటా చట్టబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను 2018 మార్చి 8న బంగ్లాదేశ్ హైకోర్టు కొట్టేసింది. ఈ నేపథ్యంలో 1971 నుంచి స్వాతంత్ర్య పోరాట యోధుల వారసులకు లబ్ధి చేకూర్చుతున్న ఈ కోటాలను కొనసాగిస్తానని షేక్ హసీనా ప్రకటించారు. తన తండ్రి వారసత్వాన్ని ముందుకుతీసుకెళ్లే క్రమంలో ఈ అంశం హసీనాకు భావోద్వేగపూరితమైనది.

కానీ, ఆమె నిర్ణయం విద్యార్థుల్లో ఆందోళనకు దారితీసింది. ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుల ద్వారా బంగ్లాదేశ్ సివిల్ సర్వీసెస్‌లో కోటా కనుమరుగైంది. మొదట్లో విద్యార్థులు కోటాలను సంస్కరించాలని కోరారు. వాటిని రద్దు చేయాలని కోరలేదు. కానీ, షేక్ హసీనా నిర్ణయం మాత్రం స్వాతంత్ర్య సమరయోధుల పిల్లలకు కోటా దక్కకపోతే, మరెవరికీ దక్కవనే సంకేతాలను ఇచ్చింది. ఆ తర్వాత రెండేండ్ల పాటు చర్చలు జరిగినప్పటికీ హసీనా తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. అనంతరం 2020లో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ అమల్లోకి వచ్చింది.

యోగ్యత, సామర్థ్యం కంటే వ్యక్తిగత సంబంధాలు, కుటుంబ సంబంధాలకు విలువిచ్చే వ్యవస్థలో జరుగుతున్న అన్యాయంపై విద్యార్థుల్లో నిరసన వ్యక్తమైంది. వాస్తవానికి స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబాలకు ఇస్తున్న కోటా అసలు సమస్య కానే కాదు. దీనిని మొదటినుంచీ వారు ఆశ్రిత పక్షపాతంగా చూడటమే సమస్యకు అసలు కారణం. ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో ఆగ్రహానికి గురైన హసీనా.. స్వాతంత్ర్య పోరాటం సమయంలో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన రజాకార్లతో నిరసనకారులను పోల్చారు. హసీనా వ్యాఖ్యలపై భగ్గుమన్న నిరసనకారులు భారీ ర్యాలీ చేపట్టారు. నిరసనకారుల మనోవేదనను అర్థం చేసుకొని, వారి డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి తిరుగుబాటును కఠినంగా అణచివేయాలని హసీనా నిర్ణయించారు. బంగ్లాదేశ్ అవామీ లీగ్ పార్టీకి చెందిన విద్యార్థి విభాగం బంగ్లాదేశ్ ఛాత్ర లీగ్‌ను ఆమె రంగంలోకి దించారు. వారికి పోలీసుల మద్దతు ఉండేలా చూశారు. ఈ నేపథ్యంలో జూలై 15న జరిగిన ఘర్షణలో ఆరుగురు నిరసనకారులు మరణించారు. ఆ తర్వాత మూడు రోజుల్లోనే 200 మంది మృతిచెందారు. వారిలో 78 శాతం మంది విద్యార్థులు, సామాన్య పౌరులే. ఈ నిరసనల్లో అనేకమంది మరణిస్తున్నప్పటికీ వాటిపై దృష్టిసారించకుండా.. ఆందోళనల కారణంగా జరిగిన ఆర్థిక నష్టంపై షేక్ హసీనా దృష్టిపెట్టారు. అంతేకాదు, రాజకీయ లబ్ధి కోసం నిరసనకారులను ప్రతిపక్ష పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. మృతుల కుటుంబాలను కలవకపోగా.. నిరసనలో ఆస్తి నష్టం జరిగిన ప్రాంతాలను సందర్శించడం మొదలుపెట్టారు. మృతుల పట్ల హసీనా కనీసం సానుభూతి చూపకపోవడంపై ప్రజల్లో ఆగ్రహం మరింత పెరిగింది. మొదట విద్యార్థులు కోటా సంస్కరణ, ఇతర డిమాండ్లను నెరవేర్చాలంటూ నిరసన చేశారు. కానీ, చివరికి హసీనా నుంచి క్షమాపణ, ఆమె రాజీనామా కోసం పట్టుబట్టడం మొదలుపెట్టారు.

1971లో ముజీబుర్ రెహ్మాన్ నేతృత్వంలో సార్వభౌమ, లౌకిక, ప్రజాస్వామ్య బంగ్లాదేశ్ ఆవిర్భావాన్ని.. విభజనకు దారితీసిన ముస్లిం లీగ్ నాయకుడు మహ్మద్ అలీ జిన్నా రెండు దేశాల సిద్ధాంతాన్ని తిరస్కరించడంగా భారత్ చూసింది. ఈ సిద్ధాంతం ప్రత్యక్ష కార్యాచరణ రోజుల నుంచి విభజన దాకా చెప్పలేని నష్టాల్ని, కష్టాల్ని తెచ్చిపెట్టింది. బంగ్లాదేశ్ కూడా పాకిస్థాన్ మార్గంలోనే వెళ్లినందున ఆ సంబురం ఎక్కువ కాలం నిలవలేదు. తర్వాతి కాలంలో ఈ ధోరణిని వెనుకతట్టు పట్టించడంలో హసీనా విజయవంతమయ్యారు. అయితే ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలు భారత్‌కు అంత మంచివి కావు. పాకిస్థాన్‌లో వలె బంగ్లాదేశ్ భవిష్యత్తును నిర్దేశించేందుకు మరోసారి ఆర్మీ రంగంలోకి దిగింది.

స్వాతంత్ర్యం సాధించిన నాలుగేండ్ల కంటే తక్కువ సమయంలోనే బంగ్లాదేశ్ తిరుగుబాటును చూసింది. ఇది ఆ దేశం ఎదుర్కొన్న తిరుగుబాట్లలో మొదటిది. 1975లో బంగ బంధు షేక్ ముజీబ్ హత్య తర్వాత ఖోండ్‌కర్ ముస్తాక్ అహ్మద్ అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత ఖోండ్‌కర్ ముస్తాక్‌ను గద్దె దించేందుకు బ్రిగేడియర్ ఖాలెద్ ముషారఫ్ తిరుగుబాటు చేశారు. ఆపై హుస్సేన్ మొహమ్మద్ ఇర్షాద్ కూడా తిరుగుబాటు ద్వారానే అధికారంలోకి వచ్చారు. ఆయన తర్వాత జియా- ఉర్-రెహ్మాన్ వంతు.



నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడాలి!

మేం (ఆప్ నేతలు) రథానికి ఉండే అశ్వాల్లాంటి వాళ్లమే. మన రథసారథి ఇంకా జైల్లోనే ఉన్నారు. వారు (బీజేపీ నేతలు) రాజ్యాంగం కంటే శక్తిమంతులేమీ కాదు. ప్రతిపక్ష నాయకులను జైల్లో పెట్టడమే కాకుండా, పౌరులను కూడా హింసిస్తున్న నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలి.

- మనీశ్ సిసోడియా, ఆప్ నేత

కొలువుల కార్ఖానాగా బాసర ఆర్జీయూకేటీ

- ప్రభుత్వ ఇంజినీర్లుగా 100 మందికిపైగా విద్యార్థులు

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): చదువుల తల్లి సరస్వతీ చెంతనే ఉన్న బాసర ఆర్జీయూకేటీ విద్యార్థుల జీవితాల్లో వెలుగులను నింపుతున్నది. ఇంజినీర్లను తయారు చేసే కార్ఖానా అయ్యింది. ఇందులో చదివిన 100 మందికిపైగా విద్యార్థులు ప్రభుత్వశాఖల్లో ఇంజినీర్ ఉద్యోగాలు సాధించారు. 2012-2016 మధ్యకాలంలో బీటెక్ పూర్తిచేసుకున్న వారు ఇటీవల టీజీపీఎస్సీ వెల్లడించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఏఈఈ) ఫలితాల్లో అత్యధిక కొలువులు కైవసం చేసుకున్నారు. వారు శనివారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో సమ్మేళనం నిర్వహించారు. దీనికి 75 మంది ఉద్యోగాలు పొందిన వారు హాజరయ్యారు. ఆర్జీయూకేటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వీ వెంకటరమణ మాట్లాడుతూ.. మాక్ఇంటర్వ్యూ, వ్యక్తిత్వ వికాసం, పరీక్షలను ఎదుర్కొనేలా సిద్ధమయ్యేందుకు బాసర ఆర్జీయూకేటీలో పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

'భాషాపండితులకు పదోన్నతులివ్వాలి'

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): భాషాపండితుల అప్‌గ్రేడేషన్‌లో మిగిలిపోయిన వారికి పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ స్టేట్(ఆర్‌యూపీపీ టీఎస్) ప్రభుత్వాన్ని కోరింది. సంఘం రాష్ట్రస్థాయి సమావేశాన్ని శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. గెజిటెడ్ హెచ్‌ఎం పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయులకు అడ్డంకిగా ఉన్న 10-2-3 విధానాన్ని రద్దుచేసి, అందరితో సమానంగా జీహెచ్‌ఎం పదోన్నతుల్లో అవకాశం కల్పించాలని రాష్ట్ర అధ్యక్షుడు సీ జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు డిమాండ్ చేశారు.

త్యాగాల వారసత్వాన్ని భవిష్యత్తరాలకు అందిద్దాం: నర్సిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయుల హక్కుల సాధన పోరులో యూటీఎఫ్ నాయకుల త్యాగాల వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందిద్దామని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఏర్పడి 50 ఏండ్లు పూర్తయిన సందర్భంగా శనివారం దోమల్‌గూడలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులంతా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, ఎస్టీఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు సంయుక్త పాల్గొన్నారు.

వ్యవసాయ మహిళా డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు

హైదరాబాద్, ఆగస్టు10 (నమస్తే తెలంగాణ): వనపర్తి, కరీంనగర్‌లోని బీసీ గురుకుల మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సొసైటీ కార్యదర్శి సైదులు శనివారం ప్రకటనలో వెల్లడించారు. ఈఏపీసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థినులు బీఎస్సీ అగ్రికల్చర్ హానర్స్ కోర్సులో మొదటి సంవత్సరం ప్రవేశాలకు 12 నుంచి 31వరకు<https://mjptbcwreis.telangana.gov.in>లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈఏపీసెట్-2024 ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంకు, రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్ల ఎంపిక ఉంటుందని చెప్పారు. సీటు పొందిన విద్యార్థినులు కాలేజీ హాస్టల్‌లోనే ఉండాలని స్పష్టంచేశారు. వివరాలకు 040-23328266 నెంబర్‌లో సంప్రదించాలని సెక్రటరీ సూచించారు.


సిరిసిల్లలో అరుదైన ఖనిజ సంపద!



లాంథనైడ్ నమూనా

గనుల శాఖ అన్వేషణ

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : సాగునీటి వనరులు, ఇసుక రీచ్‌లు ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లా అరుదైన ఖనిజ సంపదకు కేంద్ర బిందువు కానున్నది. తాజాగా ఈ సంపద వెలుగు చూడటంతో రాష్ట్ర గనుల శాఖ మరింత పరిశోధన దిశగా అడుగులు వేస్తున్నది. కొత్తగా వేస్తున్న కొత్తపల్లి-మనోహరాబాద్ రైలు మార్గం తవ్వకాల్లో ఈ ఖనిజ సంపద బయటకు రావడంతో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సర్వే చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరింది. కేసీఆర్ కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కార్మిక క్షేత్రమైన సిరిసిల్ల, ధార్మిక క్షేత్రమైన వేములవాడ ప్రజల కోరిక మేరకు కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వేలైన్ మంజూరు చేయించారు. మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు లైన్ పూర్తి కావడంతో సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు మట్టి నమూనాలను సేకరించి పరీక్షించారు. అందులో అత్యంత అరుదైన ఖనిజ సంపద ఉన్నట్టు గుర్తించిన అధికారులు లోతైన పరిశోధన మొదలుపెట్టారు. రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో ఖనిజ సంపద ఉన్నట్టు గుర్తించిన గనుల శాఖ కేంద్రానికి నివేదికలు పంపించినట్టు తెలిసింది. సిరిసిల్ల జిల్లాలో ఈ ఖనిజ సంపద 562.47 చదరపు కిలోమీటర్లు ఉండగా, సిద్దిపేట జిల్లాలో మరికొంత భాగం ఉన్నట్టు గనుల శాఖ అధికారులు తెలిపారు. అందులో 15 రకాల లాంథనైడ్స్ ఉండగా, స్కాండియం, వైట్రియం ఖనిజాలు ఉన్నట్టు వారు పేర్కొన్నారు. కిలో రూ.32 వేలకుపైగా విలువ చేసే వైట్రియం ప్రధానమైనది కావడంతో మరింతగా పరిశోధనలు చేసేందుకు గనుల శాఖ సన్నద్ధమవుతున్నది. సిద్దిపేట జిల్లా విఠలాపురం, సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని పెద్దలింగాపూర్, బస్వాపూర్, లక్ష్మీపూర్ గుట్టల్లోనూ పరిశోధనలు చేస్తే ఇంకా అరుదైన ఖనిజ సంపద బయటపడే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.



స్కాండియం నమూనా



వైట్రియం నమూనా

బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టాలి

- కేంద్రంపై బీజేపీ ఎంపీలు ఒత్తిడి తేవాలి
- మల్కాన్‌గిరి రైల్వేలైన్‌తో ఐరన్ ఓర్ తరలింపు సులభం
- రైల్వేలైన్లకు అనుగుణంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి డిమాండ్



శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు రాజేందర్

హైదరాబాద్, ఆగస్టు 10(నమస్తే తెలంగాణ): కేంద్రం కొత్తగా మంజూరు చేసిన పాండురంగాపురం-మల్కాన్‌గిరి కొత్త రైల్వే లైన్ బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ అవసరాలు తీర్చేలా ఉన్నదని, కేంద్రం ఇప్పటికైనా బయ్యారంలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, ఇందుకోసం తెలంగాణ బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్‌చేశారు. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీకి అవసరమైన ఐరన్ ఓర్‌ను తరలించేందుకు ఈ రైల్వేలైన్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కొత్త రైల్వేలైన్, ఐరన్‌ఓర్‌ను గుజరాత్‌కు తరలించే ఆలోచన చేయడం తగదని సూచించారు. ఇక్కడ రైల్వేలైన్లకు అనుగుణంగా మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఖమ్మం నేత దిండిగల రాజేందర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కేంద్ర క్యాబినెట్ శుక్రవారం 173 కిలోమీటర్ల పాండురంగాపురం (భద్రాచలం)-మల్కాన్‌గిరి రైల్వేలైన్‌కు అనుమతి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, ఇది మంచి లైన్ అంటూ అభివర్ణించారు. ఈ రైల్వేలైన్‌ను తెలంగాణ ఓ కోణంలో వినియోగించుకోవాలని ఆలోచిస్తుంటే మోదీ మరోకోణంలో ఆలోచిస్తున్నారని తెలిపారు. 'బయ్యారం ఉక్కు తెలంగాణ హక్కు' అనే నినాదంతో ఉద్యమం కొనసాగిందని, విశాఖ కంటే బయ్యారానికే ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్లా దగ్గరవుతుందని, బయ్యారానికి రైల్వేలైన్ చాలా కీలకమైందని, ఎన్‌ఎండీసీ అధికారులు ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటుకు రైల్వేలైన్ కావాలని అడిగారని, దీని ద్వారా ఫ్యాక్టరీకి ప్రధాన రవాణా సౌకర్యం కలుగుతుందని చెప్పారు. 2017లో కేంద్రం ఉక్కు పాలసీ ప్రకటించిందని, 2030 నాటికి తలసరి ఉక్కు వినియోగాన్ని ప్రతి వ్యక్తి 158 కిలోలు వాడే విధంగా ప్రోత్సహించాలని నిర్ణయించిందని గుర్తుచేశారు. బయ్యారంలో తెలంగాణ స్టీల్ ప్లాంట్ పెడితేనే తలసరి వినియోగ అవసరాలను తీర్చేలా ఉత్పత్తి జరుగుతుందని చెప్పారు. కొత్త రైల్వేలైన్ ఖనిజ సంపదను గుజరాత్ తరలించేందుకు ఉపయోగపడేదిగా మారకూడదని తెలిపారు. బయ్యారంలో మూడు మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పాదక ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని గతంలోనే స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదించిందని, ఈ ఫ్యాక్టరీ వస్తే నాలుగు వేల మందికి ప్రత్యక్షంగా, పదివేల మందికి పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. పదేండ్లుగా కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా తెలంగాణలో భారీ పరిశ్రమలకు మోదీ పది పైసలైనా ఇచ్చారా? అంటూ ప్రశ్నించారు.

రాష్ట్రంలో కొత్తగా ఆరు రైల్వే లైన్లు!

- ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.26 వేల కోట్లు
- త్వరలో ప్రారంభం కానున్న నిర్మాణ పనులు

హైదరాబాద్, ఆగస్టు 10(నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంతంలో 6 మేజర్ రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిసింది. అందుకోసం రూ.26,000 కోట్ల వ్యయం అవుతుందని రైల్వే అధికారులు అంచనాలు సిద్ధంచేశారు. కొత్త ప్రాజెక్టులో భాగంగా భద్రాచలం-మల్కాన్‌గిరి రైల్వే స్టేషన్ల మధ్య నూతన రైల్వే మార్గం నిర్మించబోతున్నట్టు కేంద్రం తాజాగా ప్రకటించింది. ఈ లైన్ దూరం 170 కిలోమీటర్లుగా ఉంటుంది. అందులో ఏపీలో 85.55 కిలోమీటర్లు ఉండగా, తెలంగాణలో 20 కిలోమీటర్ల వరకు ఉంటుంది. మిగతాది ఒడిశాలో ఉండనున్నది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.7,383 కోట్ల వ్యయాన్ని అంచనా వేశారు. వచ్చే రెండు నెలల్లో ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వేమంత్రి అశ్వినివైష్ణవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం న్యూఢిల్లీ నుంచి వర్చువల్ ద్వారా మీడియాతో మాట్లాడారు.పాండురంగాపురం - భద్రాచలం-మల్కన్‌గిరి ప్రాంతాల మధ్య నూతన రైల్వే లైను ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందని వెల్లడించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ నుంచి ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్, సీపీఆర్వో శ్రీధర్ పాల్గొన్నారు.

ఇతర రైల్వే లైన్లు ఇవీ..

- డోర్నకల్-గద్వాల మధ్య 296 కిలోమీటర్ల దూరం నూతన రైల్వే లైను నిర్మాణాన్ని త్వరలో చేపట్టబోతున్నట్టు సమాచారం. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.5 వేల కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు.
- డోర్నకల్-మిర్యాలగూడ మధ్య 105 కిలోమీటర్ల మేరకు నూతన రైల్వే లైనును నిర్మించబోతున్నారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.2,100 కోట్లగా అంచనా వేశారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.
- కాచిగూడ(ఉందానగర్)-జగ్గయ్యపేట ప్రాంతాలను కలిపి నూతన రైల్వే మార్గం నిర్మాణం కాబోతున్నది. ఇది నేషనల్ హైవే 65 అంటే హైదరాబాద్-విజయవాడ రహదారికి సమాంతరంగా నూతన రైల్వే మార్గం. 228 కిలోమీటర్ల పొడువు ఉంటుంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.4,600 కోట్లు డీపీఆర్‌లో ప్రతిపాదించారు.
- రామగుండం-మణుగూరు ప్రాంతాలను కలుపుతూ 207 కిలోమీటర్ల మేరకు నూతన రైల్వే మార్గం నిర్మించబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. రెండు, మూడు నెలల్లో తుది అనుమతులు మంజూరు కానున్నాయి. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.4,100 కోట్లుగా అంచనా వేశారు.
- నాగులపల్లి-నిజామాబాద్-ఆదిలాబాద్ ప్రాంతాలను కలుపుతూ మరో నూతన రైల్వే మార్గం ప్రాజెక్టుకు త్వరలోనే కేంద్రం ఆమోదం తెలపనున్నది. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దాదాపు 316 కిలోమీటర్ల మేర నూతన రైలు మార్గం నిర్మాణం కాబోతున్నది. ఇందుకు రూ.6,400 కోట్లు ఖర్చు అవుతాయని అధికారులు అంచనా వేశారు.

ఒకటికి రెండు ఉంగరాలైతయ్!

- ఓ హోటల్ యజమానిని మోసం చేసే యత్నం
- దొంగబాబాలకు దేహశుద్ధి

పరిగి, ఆగస్టు 10: చెంబులో ఒక్క ఉంగరం వేసి.. దేవుడి దగ్గరపెట్టి మరుసటి రోజు చూస్తే రెండు ఉంగరాలు అవుతాయని ఓ హోటల్ యజమానిని మోసగించేందుకు యత్నించిన దొంగబాబాలకు గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. అనంతరం వారిని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన శనివారం వికారాబాద్ జిల్లా పరిగి మండలం నస్కల్ గ్రామంలో చోటుచేసుకుంది. నస్కల్ గ్రామంలో మాలికాడి శ్రీధర్ హోటల్ నడిపిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం నలుగురు వ్యక్తులు హోటల్‌కు వచ్చారు. ముగ్గురు కాషాయ దుస్తులు ధరించి స్వామీజీల్లా ఉన్నారు. భోజనం చేశాక యజమాని వారిని డబ్బులు అడిగితే.. 'మేము స్వామీజీలం, మమ్మల్ని డబ్బులు అడగొద్దు, మీకు అంతా మంచి జరిగేలా చేస్తాం' అని నమ్మబలికారు. చిన్న చెంబులో నీళ్లు తీసుకురమ్మన్న స్వామీజీలు.. శ్రీధర్ బంగారు ఉంగరాన్ని అందులో వేయించారు. ఆ చెంబుకు తెల్లటి వస్త్రం కట్టి దేవుడి ముందు ఉంచాలని, దానిని మరుసటి రోజు (ఆదివారం) చూస్తే.. రెండు ఉంగరాలు అవుతాయని శ్రీధర్‌కు చెప్పారు. దీంతో చెంబులో చూడగా రాయి ఉన్నది. తనను ఎందుకు మోసం చేశారని ప్రశ్నించగా.. శూలాన్ని శ్రీధర్‌పైకి విసిరారు. శ్రీధర్ తప్పించుకొనే క్రమంలో కిందపడిపోగా ఎడమచేతికి గాయమైంది. వెంటనే గ్రామస్థులు వారిని చితకబాది పరిగి పోలీసులకు అప్పగించారు. వారు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రావత్‌నాథ్, మిట్టనాథ్, మేఘనాథ్, డ్రైవర్ రాజేందర్‌గా పోలీసులు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేశారు.



వాహనంలో దొంగబాబాలు



వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటలో రైతులతో కలిసి కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బలవంతపు భూసేకరణను ప్రతిఘటిస్తాం

ప్రభుత్వానికి ప్రజా సంఘాల నాయకుల హెచ్చరిక

బొంరాస్‌పేట, ఆగస్టు 10: రైతులు, పేదల అనుమతి లేకుండా ఫార్మా కంపెనీల కోసం సాగు భూములను బలవంతంగా సేకరించడానికి ప్రయత్నిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం దుద్యాల మండలం హకీంపేటలో రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీల కోసం హకీంపేట గ్రామంలో 505 ఎకరాలు, పోలేపల్లిలో 130 ఎకరాలు, లగచెర్ల, పులిచెర్లకుంట తండా, రోటిబండ తండాలో 643 ఎకరాల భూమిని సేకరించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని చెప్పారు. కొడంగల్ నియోజకవర్గంలో 1,154 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి అన్యాక్రాంతమైందని, అధికారులు ఆ భూముల జోలికిపోకుండా పేదలు, సన్న, చిన్నకారు రైతులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని ఆరోపించారు. ధరణి, ప్రభుత్వ, అసైన్డ్ భూముల సమస్యలను పరిష్కరించాలని కొడంగల్ పట్టణంలోని రెడ్డిబసిరెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 13న జిల్లా స్థాయి భూసదస్సు నిర్వహిస్తామని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు హకీంపేటలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మల్లేశం, నర్సింహులు, బసప్ప, నారాయణ, వెంకటయ్య, మణికంఠగౌడ్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుపై జాతీయ ఉద్యమం

- 13, 14న హైదరాబాద్‌లో కీలక సమావేశాలు
- పోరాటానికి సిద్ధమవుతున్న ఏఐఎస్‌జీఈఎఫ్

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల పాలిట గుదిబండలా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) రద్దుపై జాతీయస్థాయిలో ఉద్యమానికి ఉద్యోగ సంఘాలు సమాయాత్తమవుతున్నాయి. ఆదాయపు పన్ను పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలన్న ప్రధాన డిమాండ్‌తో పోరాటానికి సిద్ధమవుతున్నాయి. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) హైదరాబాద్ వేదికగా జాతీయస్థాయిలో కార్యాచరణను ప్రకటించనుంది. 13, 14న ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ సమావేశాలు హైదరాబాద్‌లో జరగనున్నాయి. జాతీయ అధ్యక్షుడు సుభాష్ లంబ, ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ సహ పలు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు రెండు రోజుల పాటు సమావేశాల్లో పాల్గొంటారని ఏఐఎస్‌జీఈఎఫ్ ఉపాధ్యక్షుడు, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ తెలిపారు. సీపీఎస్, ఆదాయపు పన్ను పరిమితి పెంపు, పెండింగ్ డీఏల విడుదల, ప్రభుత్వశాఖల్లోని ఖాళీల భర్తీ, ప్రైవేటీకరణ రద్దు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీరణ వంటి అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు.



బెల్లంపల్లిలోని సివిక్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆయా బస్తీల వాసులు

క్వార్టర్లకు విద్యుత్తును పునరుద్ధరించాలి

- సివిక్ కార్యాలయం ఎదుట బస్తీవాసుల ధర్నా

బెల్లంపల్లి, ఆగస్టు 10 : సింగరేణి క్వార్టర్లకు తొలగించిన విద్యుత్తు సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిబస్తీ, కన్నాల బస్తీ, బూడిదగడ్డ బస్తీలకు చెందిన మాజీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని సివిక్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. మూడు రోజుల క్రితం విద్యుత్తు సరఫరాను నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్తు సరఫరా నిలిపివేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చేవరకు సింగరేణి కరెంట్ సరఫరా చేస్తుందని, ఈ మేరకు సింగరేణి సీఎండీతో మాట్లాడినట్టు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఓ ప్రకటనలో తెలిపాపరు.


సురక్షిత సింగరేణిని ఆవిష్కరిద్దాం

సంస్థ సీఎండీ బలరాం

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తి కన్నా కార్మికుల ప్రాణాలు ఎంతో విలువైనవని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. రక్షణ నియమాలు పాటిస్తూ సురక్షిత సింగరేణిని ఆవిష్కరిద్దామని ఆయన ఆకాంక్షించారు. శనివారం 11ఏరియాల్లోని 40గనుల రక్షణ కమిటీలు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, మైన్ కమిటీ సభ్యులు, రక్షణ సూపర్‌వైజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖర్చుకు వెనుకాడకుండా కార్మికులకు రక్షణకు సౌకర్యాలు కల్పిస్తామని స్పష్టంచేశారు. దవాఖానల్లో ప్రత్యేక వైద్యనిపుణులను నియమిస్తున్నామని, రామగుండం ఏరియా హాస్పిటల్‌ను సూపర్ స్పెషాలిటీ దవాఖానగా రూపుదిద్దుతామని హామీఇచ్చారు. డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, డీ సత్యనారాయణరావు, జీ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయ కార్యదర్శి డీఎస్ మృతి

- కూనంనేని, సురవరం, శ్రీనివాస్‌రెడ్డి నివాళి
- భౌతికకాయం మెడికల్ కాలేజీకి అప్పగింత



సీతారామచంద్రా రావు(ఫైల్)

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి, కోశాధికారి ధూళిపాల సీతారామచంద్రరావు (1935-2024) శనివారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని మెడికల్ కాలేజీకి అందజేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి రామచంద్రరావు భౌతికకాయంపై పార్టీ జెండా కప్పారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు, బీవీ విజయలక్ష్మి, సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ డైరెక్టర్ రజిని, భారత మాజీ రాయబారి సురేశ్‌బాబు నివాళులర్పించారు.

హైదరాబాద్‌లో జొయిటిస్ విస్తరణ

- ఈ ఏడాది సెప్టెంబర్ నుంచే ప్రారంభం
- సీఎం అమెరికా పర్యటనలో పలు ఒప్పందాలు



కాలిఫోర్నియాలోని గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థ 'జొయిటిస్' హైదరాబాద్‌లో తమ క్యాపబిలిటీ సెంటర్‌ను విస్తరించాలని నిర్ణయించింది. అమెరికా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు, అధికారుల బృందం పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభిస్తామని జోయిటిస్ తెలిపింది. భారత్‌లో తమ కంపెనీ విస్తరణకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని, తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉన్నదని జోయిటిస్ కంపెనీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సర్ బాగ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణకు మోనార్క్ ట్రాక్టర్స్ కూడా ముందుకొచ్చింది. తమ ఆర్ అండ్ డీ సంస్థకు అనుబంధంగా స్వయంప్రతిపత్తి ట్రాక్టర్ టెస్టింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామని సీఈవో ప్రవీణ్ పెన్మెత్స వెల్లడించారు. దీంతోపాటు తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ముందుకొచ్చింది. స్టాన్‌ఫోర్డ్ బైర్స్ సెంటర్ ఫర్ బయోడిజైన్ విభాగంలోని సీనియర్ ప్రతినిధులతో రాష్ట్ర బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో స్టాన్‌ఫోర్డ్ బయోడిజైన్ శాటిలైట్ సెంటర్ ఏర్పాటుపై చర్చించారు. ఈ మేరకు తగిన సహకారం అందిస్తామని బయోడిజైన్ విభాగం అధిపతులు డాక్టర్ అనురాగ్ మైరాల్, డాక్టర్ జోష్ మాకోవర్ తెలిపారు. ఆసక్తిని వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖను అందజేశారు. కాలిఫోర్నియాలోని మౌంటేన్ వ్యూలో ఉన్న గూగుల్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సీఎం సందర్శించారు. కాలిఫోర్నియా బే ఏరియాలో జరిగిన బిజినెస్ కాన్ఫరెన్స్‌లో ప్రపంచ ప్రఖ్యాత బిజినెస్ కన్సల్టెంట్, రచయిత, వక్త డాక్టర్ రామ్‌చరణ్‌ను కలిశారు. ఆయన అనుభవం తెలంగాణ పురోగతికి తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు.

విపక్షాలు ఏకమైతే 24 గంటల్లో కేజ్రీవాల్ విడుదల

మనీశ్ సిసోడియా

న్యూఢిల్లీ: నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష నేతలంతా ఏకమైతే, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 24 గంటల్లో విడుదలవుతారని ఆ రాష్ట్ర మాజీ సీఎం, ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. 'మనం ఓ రథానికి కేవలం గుర్రాల వంటివాళ్లం, నిజమైన రథసారథి ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఆయన త్వరలోనే బయటకు వస్తారు' అని చెప్పారు. బీజేపీ నేతలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, వారు రాజ్యాంగం కన్నా శక్తిమంతులు కాదన్నారు. ఈ నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. ఈ నియంతృత్వం కేవలం నేతలను జైళ్లలో పెట్టడం మాత్రమే కాకుండా, ప్రజలను వేధిస్తున్నదని చెప్పారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో సిసోడియా శుక్రవారం బెయిలుపై విడుదలైన సంగతి తెలిసిందే.

రాబందులు అంతర్ధానం

- 1980వ దశకంలో 4 కోట్లు.. ఇప్పుడు 326
- విజృంభిస్తున్న వైరస్‌లు, బ్యాక్టీరియాలు
- వ్యాధులతో ప్రజలు సతమతం



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): రాబందులంటే కేవలం పక్షులు మాత్రమే కాదు. పారిశుద్ధ్య పని చేస్తూ మన పరిసరాలు, ప్రకృతిని పరిశుభ్రంగా ఉంచే ఆత్మబంధువులు. ఊరి పొలిమేరల్లో పడేసిన జంతు కళేబరాలను రాబందులు తిని బ్యాక్టీరియా, వైరస్‌ల వ్యాప్తిని అడ్డుకుంటాయి. తద్వారా కలరా, ఆంత్రాక్స్ లాంటి వ్యాధులను నిరోధిస్తాయి. మన దేశంలో రాబందులు వేగంగా అంతరించిపోతున్నాయి. 1980వ దశకంలో దాదాపు 4 కోట్లుగా ఉన్న వీటి సంఖ్య 2015 నాటికి 15 వేలకు పడిపోయింది. ఇప్పుడు దేశవ్యాప్తంగా కనీసం 400 రాబందులు కూడా లేవు. దీంతో వివిధ రకాల వ్యాధులు ప్రబలి 2000-2005 మధ్య కాలంలోనే దాదాపు 5 లక్షల మంది మరణించినట్టు తేలింది. ఆ తర్వాతే రాబందుల వల్ల మానవాళికి జరుగుతున్న మేలు ఏమిటో ప్రపంచానికి తెలిసొచ్చింది. దీంతో భారత్‌లో రాబందుల సంతతిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్య లు చేపట్టింది. ఇంతకీ మన దేశంలో కోట్ల సంఖ్యలో ఉండాల్సిన రాబందుల సంఖ్య కేవలం 35 ఏండ్లలోనే వేలల్లోకి ఎందుకు పడిపోయింది అని లోతుగా పరిశీలిస్తే.. పశువులకు వాడే 'డైక్లోఫినాక్' అనే పురుగుమందు కారణమని తేలింది. ఆ మందు ప్రభావానికి లోనైన జంతువుల కళేబరాలను తినడం వల్లే రాబందులు మరణించినట్టు వెల్లడైంది. దీంతో కేంద్ర ప్రభుత్వం 2006లో 'డైక్లోఫినాక్'ను నిషేధించింది. ప్రజారోగ్య సంరక్షణలో ఎంతో కీలకపాత్ర పోషించే రాబందులు లేకపోతే ప్రపంచం ఆరోగ్య సంక్షోభాలను ఎదుర్కోవాల్సి వస్తుందని, వాటిని అధిగమించేందుకు ఏటా 70 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.5,87,889 కోట్లు) ఖర్చు చేయాల్సి వస్తుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

బెజ్జూర్ ప్రాంతంలో ఆవాసం

ఆదిలాబాద్ జిల్లా బెజ్జూర్ ప్రాంతంలో 26 రాబందులు ఉన్న ట్టు గుర్తించారు. వీటి సంఖ్యను పెంచేందుకు విభుప్రకాశ్, నిఖిత దాదాపు 30 ఏండ్ల నుం చి కృషి చేస్తున్నారు. 'వల్చర్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ఖ్యాతి పొందిన విభుప్రకాశ్‌ను 2021లో కేంద్రం 'ప్రాణిమిత్ర' అవార్డుతో సత్కరించింది